సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 79

శనివారం 10-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



The Perfect Life, Styled for You!

2, 3 & 4 BHK Flats

@ Centrally located in Narsingi, Near Financial District

Starting at ₹1.73 Cr.*







2 Clubhouses - 50+ World Class Amenities

Children's Play Area | Fitness Centres | Sports Arenas
Yoga & Meditation Deck | Supermarket | Swimming Pool
Pharmacy | Spa & Salon | Party Lawn & Halls

*T&C Apply

Unflinching Commitment to Customers Delight earns us Recognition & Laurels



INDIAN ACHIEVERS AWARDS 2023

SRI YERRAM VIJAY KUMAR
CHAIRMAN & MD, VASAVI GROUP
RECEIVING THE AWARD FROM HON'BLE MINISTER FOR ROAD TRANSPORT & HIGHWAYS IN THE GOVERNMENT OF INDIA
SRI NITIN GADKARI

- Trusted Developer of The Year 2022
- Best Ultra Luxury Apartment Ongoing Vasavi Skyla 2022
- Exemplary Contribution to Real Estate Hyderabad 2021
- Premium Affordable Project of the Year 2021
- Trusted Developer of the Year 2019

A Legacy of 3 Decades of Trust and Quality

50 Million sft. to be built in the next 5 years | **17** Commercial Projects | **310** Acres of Villa plots sold

8 Million sft. built | **4510** Apartments built till date | **30** Residential Projects

Vasavi Atlantis, Narsingi,
Near Financial District, Hyderabad.
www.vasaviatlantis.com

TS RERA: P02400003398

95335 14444


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 79



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఓ జిల్లా కేంద్రంలో గుట్టలుగా ఉన్న పాఠ్య పుస్తకాలు

పాఠశాలకు చేరని 'పాఠాలు'!

పాఠ్యపుస్తకాల ముద్రణ పూర్తయినా ఇంకా జిల్లా కేంద్రాల్లోనే..

- తీసుకెళ్లేందుకు ససేమిరా అంటున్న ప్రధానోపాధ్యాయులు
- గత రెండేళ్లుగా బిల్లులు ఇవ్వలేదనే ఆరోపణలు
- గుట్టలుగా పడేయడంతో ఎలుకలు కొడుతున్న వైనం
- వసతులు సరిగా లేని స్కూళ్లలో వర్షం పడితే పాడయ్యే ప్రమాదం
- ఆచరణకు నోచుకోని 'రవాణా టెండర్ల' ఆదేశం
- మరో రెండురోజుల్లో స్కూళ్లు .. నెలాఖరుకైనా అందడం కష్టమే!

సాక్షి, హైదరాబాద్: స్కూళ్లు తెరిచేలోగా పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరుస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన కార్యాచరణకు ఆమడ దూరంలో ఉంది. మరో రెండురోజుల్లో స్కూళ్లు తెరుస్తున్నా ఇప్పటివరకు ఒక్క పుస్తకం కూడా స్కూళ్లకు చేరలేదు. ముద్రణ పూర్తయిన పుస్తకాలు జిల్లాల్లోనే మూలుగుతున్నాయి. వాటిని విద్యార్థులకు అందించే బాధ్యత హెచ్ఎంలదే అని విద్యాశాఖ చెబుతుండగా మాకేం సంబంధం లేదని హెచ్ఎంలు స్పష్టం చేస్తుండటంతో పుస్తకాలు జిల్లా కేంద్రాల్లోనే మగ్గుతున్నాయి. పుస్తకాలను గుట్టలుగా పడేయడంతో కొన్ని చోట్ల ఎలుకలు కొడుతున్నాయి. సరైన సదుపాయం లేని స్కూళ్లలో వర్షం వస్తే తడిసిపోయే ప్రమాదం కూడా ఉందని అంటున్నారు. ఈ నెల 12 స్కూళ్లు తెరుచుకోనుండగా.. ఇప్పుడు హడావుడి చేసినా ఈ నెలాఖరుకు కూడా వాటిని స్కూళ్లకు చేరవేయడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

100 శాతం పూర్తికాని ముద్రణ

విద్యాశాఖ అడకమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 15 నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు ప్రారంభించాలి. రాష్ట్రవ్యాప్తంగా 28,77,675 మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో ఉన్నారు. వీరికి ఉచితంగా పుస్తకాలు అందించాల్సి ఉంది. సబ్జెక్టులు, లాంగ్వేజీలు కలిపి 1,63,78,607 పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. గత ఏడాది ముద్రించినవి పోను, ఇంకా 1,57,48,270 పుస్తకాలు అందించాలి. ఇందులో ఇప్పటివరకు 1,35,85,185 పుస్తకాలు ముద్రించారు. వీటిని జిల్లా కేంద్రాలకూ చేరవేశారు. ఇంకా 14 శాతం పుస్తకాల ముద్రణ పూర్తి కావలసి ఉండటంతో.. ఇప్పుడున్నవి పంపిణీ చేసినా, కొన్ని స్కూళ్లకు పుస్తకాల కొరత ఏర్పడనుంది.

రవాణా టెండర్లు ఏమయ్యాయి?

ముద్రణ అనంతరం జిల్లా కేంద్రాలకు చేరిన పుస్తకాలను హెచ్ఎంలు తమ పాఠశాలలకు తీసుకువెళతారు. ఇందుకయ్యే ఖర్చంతా ముందుగా హెచ్ఎంలే భరించి ఆ తర్వాత విద్యాశాఖకు బిల్లులు పెట్టి తీసుకుంటారు. అయితే గత రెండేళ్లుగా బిల్లులు రాలేదని హెచ్ఎంలు అంటున్నారు. ఈ కారణంగా

మిగతా 3వ పేజీలో ▶

ఐటీ పవర్‌హౌస్‌లుగా పట్టణాలు

- హైదరాబాద్‌లా తీర్చిదిద్దేందుకు హబ్‌ల నిర్మాణం..
- 15న సిద్దిపేట హబ్‌ను ప్రారంభించనున్న కేటీఆర్, హరీశ్

12లో

30% మందికి బీపీ.. 9.9% మందికి షుగర్

- దీర్ఘకాలిక వ్యాధుల బారిన తెలుగు రాష్ట్రాల ప్రజలు
- ఐసీఎంఆర్ సర్వే వివరాలు వెల్లడించిన లాన్సెట్ జర్నల్
- దేశంలో 11.4% మందికి డయాబెటిస్
- గోవాలో అత్యధికంగా 26% మందికి.. యూపీలో అతి తక్కువగా 4.8 శాతం మందికి చక్కెర వ్యాధి

12లో

ఐదారు రోజుల్లో నైరుతి!

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

- రాష్ట్రంలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు.. కరీంనగర్ జిల్లా తంగులలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- నేడు పలు జిల్లాల్లో వడగాడ్పులు
- కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు!

- వివరాలు 12లో

క్లుప్తంగా...

14 నుంచి పోలీసు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్‌కొలువుల భర్తీలో భాగంగా తుది రాత పరీక్షలో అర్హత సాధించిన వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి 26 వరకు ధ్రువపత్రాలను పరిశీలిస్తామని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్పీఆర్బీ) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపా రు. రాష్ట్రవ్యాప్తంగా 18 సెంటర్లలో ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. ధ్రువ పత్రాల పరిశీలనకు సంబంధించి తేదీలు, కేంద్రాల వివరా లు ఈ నెల 11న ఉదయం 8 నుంచి 13వ తేదీ రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 'www.tslprb.in' వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీల ద్వారా ఇంటిమేషన్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

డిస్కంలలో కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్లు

రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల్లో నామినీ డైరెక్టర్లుగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సందీప్ కుమార్, దాల్జిత్ సింగ్ ఖత్రిలను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు వీళ్లు నామినీ డైరెక్టర్లుగా కొనసాగుతారన్నారు. రుణాలు అందజేసిన ఆర్‌ఈసీ, పీఎఫ్సీ సంస్థల ప్రతినిధులను విద్యుత్ సంస్థల్లో నామినీ డైరెక్టర్లుగా నియమించుకోవాలని ఇటీవల ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అధికారులను డైరెక్టర్లుగా నియమించడం ఇదే తొలిసారి.

పీఆర్‌టీయూటీఎస్ మాస పత్రిక ఎడిటర్‌గా ఇన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంఘం అధికారిక మాస పత్రిక పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడిగా తిరుమల రెడ్డి ఇన్నారెడ్డిని నియమించినట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్నారెడ్డి ప్రస్తుతం మంచిర్యాల పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌టీయూటీఎస్ 77వ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టీయూటీఎస్) 77వ ఆవిర్భావ వేడుకలు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి సంఘం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌టీఈ ఉపాధ్యక్షులు బ్రహ్మాచారి, సీఎం ప్రసాద్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించలేరా?

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించలేరా? అని సీఎం కేసీఆర్‌ను సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. ఓయూలో శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో మహాసదస్సు జరిగింది. సదస్సుకు జేఏసీ చైర్మన్ డాక్టర్ పరశురామ్ అధ్యక్షత వహించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పుకొంటున్న సీఎం.. ఏళ్ల తరబడి తక్కువ వేతనానికి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేయలేరా? అని నిలదీశారు. ప్రొఫెసర్ పాపిరెడ్డి మాట్లాడుతూ వర్సిటీల్లో 3000 వేలకు పైగా అధ్యాపక పోస్టులుండగా.. 2000 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని వివరించారు. యూనివర్సిటీల మనుగడ కోసం కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు.

తెలంగాణకు ఇద్దరు నూతన ఏఐసీసీ కార్యదర్శులు

మన్సూర్ అలీఖాన్, పీసీ విష్ణునాథ్‌ను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఇద్దరు నూతన ఏఐసీసీ కార్యదర్శులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఇప్పటి వరకు ఏఐసీసీ కార్యదర్శులుగా ఉన్న ఎన్ఎస్ బోసురాజు, నదీమ్ జావేద్ స్థానంలో మన్సూర్ అలీఖాన్ (కర్ణాటక), పీసీ విష్ణునాథ్ (కేరళ)కు బాధ్యతలు అప్పగించారు. ఇకపై వీరిద్దరు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ థాక్రేకు తెలంగాణ పార్టీ వ్యవహారాల్లో సహాయకులుగా వ్యవహరించనున్నారు.

'బీ'టెక్ బేరం షురూ!

- యాజమాన్య కోటా సీట్ల బేరసారాలు
- టాప్ కాలేజీల్లో జోరుగా అమ్మకాలు
- రూల్స్ గీల్స్ జాన్తా నై...
- కంప్యూటర్ సీట్లకు యమ గిరాకీ
- ముందే అమ్ముకుంటున్న యాజమాన్యాలు



సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ ఫలితాలు ప్రకటించి, కౌన్సెలింగ్ తేదీలు వెల్లడించిన తర్వాత ఇంజనీరింగ్ సీట్ల కోసం పోటీ ఎక్కువైంది. ప్రైవేటు కాలేజీలు బీ కేటగిరీ (యాజమాన్య కోటా) సీట్ల భర్తీకి ఇప్పటికే ద్వారాలు తెరిచాయి. బేరసారాల కోసం ఆయా కాలేజీలు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశాయి. తల్లిదండ్రులూ ప్రముఖ కాలేజీల వద్ద బారులు తీరుతున్నారు. మధ్యస్థంగా ఉండే కాలేజీలు డిమాండ్ సృష్టించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాయి. కన్సల్టెన్సీలు, పీఆర్‌వోల ద్వారా విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఎంసెట్‌లో 50 వేలు ర్యాంకు దాటిన విద్యార్థులు మంచి కాలేజీలో కోరుకున్న సీటు రాదని భావిస్తున్నారు. దీంతో యాజమాన్య కోటాలో సీటు తెచ్చుకునేందుకు ముందుకొస్తున్నారు. హైదరాబాద్‌లోని మూడు ప్రముఖ కాలేజీల్లో రోజూ 20 మంది వరకూ కళాశాల ప్రతినిధులతో బేరసారాలు ఆడుతున్నారు. ఈ కేటగిరీలో ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఉన్నతాధికారులు ఉంటున్నారు. వాస్తవానికి కన్వీనర్ కోటా సీట్ల భర్తీ తర్వాతే యాజమాన్య కోటా సీట్ల భర్తీ ఉంటుంది. కానీ కాలేజీలు అనధికారికంగా ముందే బేరం కుదుర్చుకుంటున్నాయి. నిబంధనలకు పాతరేస్తున్నా అధికారులు మాత్రం ఇవేవీ తమ దృష్టికి రావడం లేదని చెబుతున్నారు.

రూ.లక్షల్లో బేరం

రాష్ట్రంలో దాదాపు 176 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో 145 ప్రైవేటు కాలేజీలే. 71 వేల ఇంజనీరింగ్ సీట్లు కన్వీనర్ కోటా కింద, 30 వేల సీట్లు యాజమాన్య కోటా కింద ఉంటాయి. ఇందులో సగం సీట్లను జేఈఈ ర్యాంకులు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్ మార్కుల మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన వార్షిక రుసుం తీసుకోవాలి. కాకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు. మిగిలిన సగం సీట్లను ప్రవాస భారతీయుల పిల్లలకు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసే వారికి ఇవ్వాలి. ఈ సీట్లకు ఎక్కువ ఫీజు వసూలు చేయొచ్చు. అందుకే ముందుగానే అనధికారికంగా డొనేషన్ల రూపంలో తీసుకుంటున్నాయి. ఒక్కో సీటుకు రూ. 8 నుంచి 12 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ఆర్ఐ కోటా సీట్లకు ఫీజులతో కలిపి రూ.20 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. బేరం కుదిరితే ఇప్పుడే సగం కట్టాలని షరతు పెడుతున్నట్లు సమాచారం.

నోటిఫికేషన్ ఇచ్చాకే భర్తీ చేయాలి

యాజమాన్య కోటా సీట్లయినా నిబంధనల ప్రకారమే భర్తీ చేయాలి. ఈ విషయంలో మండలి సీరియస్‌గా ఉంది. బీ కేటగిరీ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత మెరిట్ పద్ధతి పాటించాల్సిందే. అందుకు విరుద్ధంగా డబ్బులు తీసుకుని సీట్లు అమ్ముకున్నట్టు ఫిర్యాదులొస్తే విచారణ జరిపిస్తాం. ఏ విద్యార్థికి అన్యాయం జరిగినా ఊరుకోం. తల్లిదండ్రులు కూడా నోటిఫికేషన్ రాకుండా యాజమాన్య కోటా సీట్లు ఆశించడం సరికాదు.

ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి (ఉన్నత విద్య మండలి చైర్మన్)

కంప్యూటర్ సైన్స్ హాట్ కేక్

యాజమాన్య కోటా కింద సీట్లు ఆశిస్తున్న విద్యార్థులు ఎక్కువగా కంప్యూటర్, అనుబంధ బ్రాంచ్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో కాలేజీలు సీఎస్‌సీ సీటుకు వార్షిక ఫీజుకు అదనంగా రూ.8–10 లక్షలు అడుగుతున్నాయి. మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులైతే రూ.12 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కిందే సీట్లు భర్తీ కావడం లేదు. కాబట్టి ఎంసెట్‌లో లక్షల్లో ర్యాంకు వచ్చిన వాళ్లు, క్వాలిఫై కాని వాళ్లే ఈ సీట్లను ఆశిస్తున్నారు. ప్రముఖ కాలేజీలైతే రూ. 2 లక్షల వరకూ అదనంగా డిమాండ్ చేస్తున్నాయి.

చిరుతతో పోరాడి.. రైతు ప్రాణాలు కాపాడిన ఆవు

కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఘటన



చిరుతతో పోరాడిన ఆవు గౌరీతో యజమాని కరిహోలప్ప

బనశంకరి: తన యజమానిపై దాడి చేసిన చిరుత పులితో తీవ్రంగా పోరాడి రైతు ప్రాణాలు ఆవు కాపాడిన ఘటన కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... చెన్నగిరి తాలూకా ఉబ్రాణి హోబళి కొడదికెరె గ్రామానికి చెందిన రైతు కరిహోలప్ప(58) గత సోమవారం తన ఆవును తోటలో వదిలిపెట్టి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే మాటువేసిన చిరుత పులి ఒక్కసారిగా కరిహోలప్పపై దాడి చేసింది. గమనించిన ఆవు పరుగెత్తుకొచ్చి చిరుతపైకి దూకింది. కొమ్ములతో పొడిచింది. దీంతో చిరుత కిందపడిపోగా, అక్కడే ఉన్న శునకం కూడా దానిపైకి దూకింది. దీంతో చిరుత అక్కడి నుంచి ఉడాయించింది. ఈ సందర్భంగా రైతు కరిహోలప్ప మాట్లాడుతూ తాను పోషించిన ఆవు గౌరీ, శునకం మాత్ర శౌర్యాన్ని ప్రదర్శించి చిరుత బారి నుంచి తన ప్రాణాలు కాపాడాయని చెప్పాడు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'సుపరిపాలన' ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. 'స్వరాష్ట్రంలో సుపరిపాలన'పేరుతో ప్రభుత్వం ఈ ఉత్సవాలను నిర్వహించనుంది. గత తొమ్మిదేళ్ల కాలంలో పాలనా సంస్కరణల ద్వారా ప్రజలకు చేరువయ్యామని, రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత జరిగిన పరిపాలన వికేంద్రీకరణ ద్వారా సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని, సుపరిపాలనలో ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయని ప్రభుత్వం వెల్లడించింది. 2016 అక్టోబర్‌కు ముందు రాష్ట్రంలో 10 జిల్లాలుండగా, ఒక్కో జిల్లాలో సగటున 35లక్షలకు పైగా జనాభా ఉండటంతో పాలన కష్టతరమయ్యేదని, కొన్ని చోట్ల జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే 200–250 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని సమాచార, పౌరసంబంధాల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం–1974 ప్రకారం తెలంగాణలో మరో 23 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలనా సౌలభ్యం కలిగిందని వెల్లడించింది.

ప్రిలిమ్స్ వాయిదా పరిష్కారం కాదు

గ్రూప్ 1 ప్రిలిమ్స్‌పై స్టేకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జూన్ 11న (ఆదివారం) నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదాకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. పరీక్ష నిలుపుదల సమస్యకు పరిష్కారం కాదని వ్యాఖ్యానించింది. పరీక్ష నిర్వహణపై స్టే ఇవ్వలేమని తేల్చిచెప్పింది. పోటీ పరీక్షలకు టీఎస్‌పీఎస్సీ లాంటి రాజ్యాంగ బద్ధ సంస్థలపై ఆధారపడటం తప్ప కోర్టులు కూడా మరో మార్గం చూపలేవని పేర్కొంది. 'ఒకవేళ పరీక్ష వాయిదా పడితే.. చార్జిషీట్ దాఖలు చేయడానికి సిట్‌కు ఎంత సమయం పడుతుందో తెలియదు. మీ వాదనను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తే, అది పూర్తయ్యేసరికి మరో 20 ఏళ్లు పట్టవచ్చు. 2008 డీఎస్సీ గురించి ఒకసారి పునశ్చరణ చేసుకోండి'అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ మేరకు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. పేపర్ లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్), ఈడీ విచారణ పూర్తయ్యే వరకు గ్రూప్–1 పరీక్షలు ఆపాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలైన విషయం విదితమే. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. మార్చిలో నోటిఫికేషన్ ఇస్తే ఇప్పుడు వాయిదా కోరుతూ పిటిషన్లు వేయడాన్ని తప్పుబడుతూ పిటిషన్లను కొట్టివేశారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ ఎస్.మురళీధర్‌రెడ్డి.. ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ అభినంద్ కుమార్ షావలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

దశాబ్దిలో గడపగడపకు సంక్షేమం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గడపగడపకూ సంక్షేమాన్ని అందించామని, సమైక్య రాష్ట్రంలో అడుగడుగునా సంక్షోభమే ఉండేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా ట్వీట్ చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథ కం అందని ఇల్లు లేదని, లబ్ధిదారుడు లేని కుటుంబమే లేదన్నారు. పేదలను ముంచడం, పెద్దలకు పంచడం కేంద్ర ప్రభుత్వ మోడల్ అయితే.. సంపద పెంచడం, పేదలకు పంచడం తెలంగాణ సంక్షేమ మోడల్ అన్నారు. సంక్షేమాన్ని భారంగా కాకుండా బాధ్యతగా ఆచరించిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ తెలిపారు. సబ్బండ వర్గాల సంక్షేమం, సకల జనుల జీవన భద్రత కేసీఆర్‌తోనే సాధ్యమనేందుకు తొమ్మిదేళ్ల పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ రంగానికే ఏటా రూ.50వేల కోట్లు వెచ్చించడం దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయమని అన్నారు.

దర్యాప్తు నివేదిక అందజేయండి

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసు సీబీఐకి ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. దర్యాప్తుపై మూడు వారాల్లో పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సిట్‌ను ఆదేశించారు. సిట్ దర్యాప్తు కొనసాగుతున్న ఈ దశలో సీబీఐకి బదిలీ చేయడం ఎందుకని పిటిషనర్ తరపు న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. తదు పరి విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, గత ప్రిలిమ్స్‌లో తప్పుడు బబ్లింగ్ ద్వారా డిస్క్వాలిఫై అయిన నలుగురికి హైకోర్టులో ఊరట లభించింది. డిస్క్వాలిఫై అయిన తమకు ప్రిలిమ్స్ రాసే అవకాశం ఇవ్వాలని అభ్యర్థులు ఎస్.సురేశ్, డి.రమేశ్‌కుమార్, షమీమ్, వై.సాయి సుస్మిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పరీక్ష రాసేందుకు వీరికీ అవకాశం ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- 40వేలు కూడా దాటని మత్స్య సహకార సొసైటీల సభ్యత్వ నమోదు
- మేలోగా లక్ష సభ్యత్వం చేయాలని నిర్ణయం
- అధికారుల అలసత్వం, నిబంధనలతో కుంటుపడిన నమోదు

సాక్షి,హైదరాబాద్: లక్ష నమోదు లక్ష్యంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మత్స్య సహకార సొసైటీల సభ్యత్వ నమోదు నాలుగు నెలలైనా 40వేలు కూడా దాటలేదు. సభ్యత్వ నమోదు వేగంగా చేయాలని, మే నెలలోగా పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా అధికారుల అలసత్వంతో అటకెక్కిందన్న విమర్శలొస్తున్నాయి. నిబంధనల పేరుతో అడ్డుకోవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయినా.. ఆధార్ కార్డు సొంత గ్రామంలోనే ఉండాలని మత్స్యశాఖ నుంచి ఉత్తర్వులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

నిబంధనల కొర్రీలు..

సొంత గ్రామాలను వదిలి పట్టణాలకు వలసొచ్చినవారు.. అక్కడే ఆధార్, బ్యాంకు అకౌంట్ తీసుకున్నారు. దీంతో అదో ప్రధాన అడ్డంకిగా మారింది. మరోవైపు మత్స్యకారుడు వల విసిరినప్పుడు 60 నుంచి 70శాతం వలయాకారంలో పడాలని కూడా నిబంధనలు పెడుతున్నారు. ఈ నిబంధనలతో సభ్యత్వ నమోదు మందగించింది. 18 ఏళ్లు నిండిన ప్రతీ మత్స్యకారుడికి సభ్యత్వం ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినా.. నమోదుకు అధికారులు రకరకాల కొర్రీలు పెడుతున్నారని, కొన్ని గ్రామాల్లో ఒకట్రెండు సార్లు స్కిల్ టెస్టులు పెట్టి అధికారులు చేతులు దులుపుకొంటున్నారని మత్స్యకారులు చెబుతున్నారు. స్కిల్ టెస్టు కోసం గ్రామ మత్స్య సొసైటీలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఉదయం పూటే టెస్టు నిర్వహించాలని కోరుతున్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలో స్కిల్‌టెస్టు, సభ్యత్వ నమోదు నిర్వహించాలని కోరుతున్నారు. ఇక ఒకట్రెండు గ్రామాల్లో స్కిల్ టెస్టు నిర్వహించినా.. అందుకు అవసరమయ్యే టెంటు, ఫొటోగ్రాఫర్, కెమెరా వంటి అన్ని రకాల ఖర్చులకు డబ్బును గ్రామ మత్స్య సొసైటీల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. నిబంధనలు సడలించి, కొత్త మార్గదర్శకాలతో జూన్ నెలాఖరుకైనా సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని మత్స్యకార సొసైటీలు కోరుతున్నాయి.

ఆధార్‌తో లింక్ పెట్టొద్దు..


ఆధార్‌తో లింక్ పెట్టకుండా మత్స్యకారుడికి సభ్యత్వం ఇవ్వాలి. కొత్త నిబంధనలు పెట్టకుండా గ్రామంలో ఉన్న మత్స్యకారులందరికీ షరతుల్లేకుండా సభ్యత్వ నమోదు చేయాలి.

బి.అంజయ్య, మత్స్యకారుడు, సిరిసిల్ల జిల్లా

గ్రామానికో 'సాగు న్యాయ నేస్తం'

- తెలుగు రాష్ట్రాల్లో గ్రామానికో రైతు ఎంపిక
- లీఫ్స్ అధ్యక్షుడు సునీల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతాంగానికి న్యాయ సలహాలు, సాయం అందించడానికి ప్రతి గ్రామంలో ఒక రైతును 'సాగు న్యాయ నేస్తం'గా ఎంపిక చేస్తామని లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) అధ్యక్షుడు భూమి సునీల్ తెలిపారు. ఇప్పటికే లీఫ్స్ సంస్థ ద్వారా భూమి, వ్యవసాయానికి సంబంధించి రైతుల న్యాయ అవసరాలను తీర్చే ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు కొనసాగింపుగా ప్రతి గ్రామంలో ఒక సాగు న్యాయ నేస్తాన్ని ఎంపిక చేయనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. భూమి సాగు చేస్తున్న రైతు (కౌలు రైతు కూడా) అయిఉండి, సదరు గ్రామంలో నివసిస్తూ.. చదవడం, రాయడం వచ్చి, స్వచ్ఛందంగా రైతులకు సాయం అందించాలనే ఆసక్తి కలిగిన వారు సాగు న్యాయ నేస్తం కోసం తమ వివరాలను వాట్సాప్ నంబర్ 9000222674 కు ఈ నెల 30లోగా పంపాలని సూచించారు. అర్హులైన వారికి ఉచిత శిక్షణనిచ్చి గ్రామ సాగు న్యాయ నేస్తంగా నియమిస్తామని భూమి సునీల్ వెల్లడించారు.



ఐటీ, అనుబంధ సంస్థల రాకతో నగరవాసుల ఆదాయం గణనీయంగా పెరిగింది. ధనిక, పేద తేడా లేకుండా ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు, టీవీలు, వాటర్ హీటర్లు, ఐరన్ బాక్సులు, మిక్సీలు, గీజర్లు సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా తలసరి కరెంట్ వినియోగం కూడా భారీగా పెరిగింది. 2014లో తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 2,261 యూనిట్లకు చేరడం గమనార్హం.

గ్రేటర్ 'పవర్'ఫుల్..!

తొమ్మిదేళ్లలో రెట్టింపైన విద్యుత్ వినియోగం

- 2014లో పీక్ సీజన్ గరిష్ట డిమాండ్ 48 ఎంయూలు
- మే 19న రికార్డుస్థాయిలో 80 మిలియన్ యూనిట్లు నమోదు
- తలసరి వినియోగంలోనూ గ్రేటరే టాప్



సాక్షి, హైదరాబాద్: నగరం శరవేగంగా విస్తరిస్తోంది. కోర్‌సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గృహ, వాణిజ్య, పారిశ్రామిక భవనాలు వెలుస్తున్నాయి. నెలకు సగటున 2500–3000 వరకు కొత్త విద్యుత్ కనెక్షన్లు జత చేరుతున్నాయి. ఫలితంగా ఏటా విద్యుత్ వినియోగం రెండు నుంచి మూడు శాతం అధికంగా నమోదవుతున్నట్లు అంచనా. ఇక విద్యుత్ గృహోపకరణాల సంఖ్యా అదేస్థాయిలో పెరుగుతోంది. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవుతుండటంతో సిటీజనాలు ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు రోజంతా ఆన్ చేసి ఉంచుతున్నారు. ఫలితంగా గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ పీక్‌కు చేరుకుంది.

రికార్డు స్థాయిలో డిమాండ్

రాష్ట్రం ఏర్పాటు సమయంలో గ్రేటర్ పీక్ సీజన్ డిమాండ్ 48 నుంచి 49 మిలియన్ యూనిట్లు (ఎంయూ) నమోదు కాగా... ప్రస్తుతం రికార్డు స్థాయిలో నమోదవుతుంది. మే 19న డిస్కం చరిత్రలోనే అత్యధికంగా 80 ఎంయూలు నమోదైంది. గత ఏడాది ఏప్రిల్ 28న 71.09 ఎంయూల విద్యుత్ వినియోగం నమోదు కాగా, ఈ సారి ఏకంగా ఎనిమిది ఎంయూలకు పైగా వినియోగం నమోదు కావడం గమనార్హం. రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుండటంతో ఇంజనీర్లు బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతుండటం, ఆయిల్ లీకేజీల కారణంగా బస్తీల్లోని పలు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవుతుండటం, గంటల తరబడి సరఫరా నిలిచిపోతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు అప్రమత్తమై.. ఎప్పటికప్పుడు ఆయా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నారు.



రోగులతో ఆప్యాయంగా మెలగాలి

వైద్య సిబ్బందికి మంత్రి హరీశ్‌రావు సూచన



సాక్షి, హైదరాబాద్: రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు, వారితో ఆప్యాయంగా మెలగాలని వైద్య సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ముఖ్యంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది.. రోగులు, వారి సహాయకులతో గౌరవంగా ఉండాలని, వారి మెప్పు పొందేలా సేవలందించాలని చెప్పారు. నెలవారీ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పనితీరును శుక్రవారం ఆయన సమీక్షించారు. ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్ రెడ్డి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, వైద్యాధికారులు పాల్గొన్న సమావేశంలో మంత్రి హరీశ్ మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో బడ్జెట్‌లో రూ.12,364 కోట్లతో ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేసినట్లు చెప్పారు. గత నెలలో సాధారణ ప్రసవాలు ఎక్కువ శాతం నమోదు చేసిన ఆయా ఆస్పత్రుల ఓబీజీ విభాగాలను, పీహెచ్‌సీలను మంత్రి అభినందించారు. మందులు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రిఫర్ చేయకూడదని, డిశ్చార్జ్ అయిన పేషెంట్లకు మందులు ఇచ్చి పంపాలని సూచించారు. 14న నిర్వహించే వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మార్కులకు బదులు క్రెడిట్స్

- ప్రతి వర్సిటీలోనూ ఇన్నోవేషన్ కేంద్రం
- డిగ్రీ విద్యలో కీలక మార్పులు
- ఉన్నత విద్యా మండలి కీలక నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యలో కీలక సంస్కరణలు తేవాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఇంజనీరింగ్‌తో సమానమైన బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సును తెచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ దిశగా అన్ని విశ్వవిద్యాలయాలను అప్రమత్తం చేస్తూ, మండలి కొన్ని సూచనలు చేసింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్‌లో కీలక సమావేశం జరిగింది. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కాలేజీయేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిత్తల్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాసరావు, ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ మహిళ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాల వీసీలు పాల్గొన్నారు. సమావేశ వివరాలను ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి మీడియాకు వివరించారు.

50 కాలేజీల్లో బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్స్

ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని దాదాపు 50 కాలేజీల్లో నాలుగేళ్ల కాలపరిమితితో బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్స్ కోర్సును ప్రవేశ పెడతారు. ఇప్పటికే 36 ప్రైవేటు కాలేజీలు ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. పది ప్రభుత్వ కాలేజీల్లోనూ ఇది అందుబాటులో ఉంటుంది. హానర్స్ కోర్సుకు ప్రతి కాలేజీలో 60 సీట్లు కేటాయిస్తారు.

ద్వితీయ సంవత్సరంలో సైబర్ సెక్యూరిటీ...

డిగ్రీ రెండో సంవత్సరంలో సైబర్ సెక్యూరిటీ కోర్సును తప్పనిసరి చేస్తున్నారు. వాల్యూయాడెడ్ కోర్సుగా దీన్ని అందిస్తారు. ఇది రెండో సంవత్సరానికే పరిమితం. దీనికి 4 క్రెడిట్స్ ఉంటాయి. పోలీసు శాఖ, నల్సార్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ కోర్సును డిజైన్ చేస్తుంది.

పరీక్ష విధానంలో క్షేత్రస్థాయి మార్పులు

రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరీక్షల విధానం, మూల్యాంకనం, విద్యార్థి ప్రతిభను అంచనా వేసే పద్ధతిపై అధ్యయనం చేసిన ఇండియస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) వీసీల సమావేశంలో ఓ నివేదిక సమర్పించింది. ఆరు యూనివర్శిటీలు, 14 కాలేజీల్లో 3 వేల మంది విద్యార్థుల ద్వారా చేసిన అభిప్రాయ సేకరణ ఆధారంగా రూపొందించిన ఈ నివేదికను ఐఎస్‌బీ తరపున ప్రొఫెసర్ చంద్రశేఖర్ శ్రీపాద వీసీలకు వివరించారు. అందులోని కొన్ని సంస్కరణలను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తారు.

- మూల్యాంకన విధానంలో క్షేత్రస్థాయిలో మార్పులు, రూట్ లెర్నింగ్ అప్లికేషన్ తీసుకొస్తారు. మార్కుల విధానం తీసేసి క్రెడిట్స్ విధానం అమలు చేస్తారు.
- ప్రతి వర్సిటీలోనూ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ అసెస్‌మెంట్ అవాల్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, దీనికి ప్రత్యేక అధికారిని నియమిస్తారు.
- ప్రస్తుతం 80 మార్కులు పరీక్షకు, 20 మార్కు లు ఇంటర్నల్స్‌కు ఇస్తున్నారు. ఇందులో థియరీ మార్కులు తగ్గించి, ఇతర కార్యకలాపాలకు ఈ మార్కులను విభజిస్తారు.
- విద్యార్థి అటెండెన్స్, గ్రూపు డిస్కషన్స్, ప్రాజెక్టు వర్క్స్, ఇన్నోవేషన్, సెమినార్స్ వంటి వాటికి మార్కులు ఇస్తారు. దీనివల్ల విద్యార్థిలో సృజనాత్మకత పెరుగుతుంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 79

శనివారం 10-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



ఆసీస్‌దే పైచేయి...

భారత్ 296 ఆలౌట్. ఓవరాల్ 296 పరుగుల ఆధిక్యంలో ఆస్ట్రేలియా -15లో



ఎడారి చిరుత

'సహారా మారథాన్‌ను పూర్తిచేసిన మహాశ్వేతాఘోష్‌పై ప్రత్యేక కథనం -13లో



ట్రంప్‌పై నేరాభియోగాలు

ప్రభుత్వానికి చెందిన రహస్య పత్రాల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి.

- వివరాలు 6లో



భూగోళం.. అగ్నిగుండం

కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల భూగోళం క్రమంగా అగ్నిగుండంగా మారిపోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

- వివరాలు 6లో



సలహాదారులుగా కొనసాగలేం

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల సిలబస్‌లో కోతలపై ప్రధాన సలహాదారులు సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ మండిపడ్డారు.

- వివరాలు 6లో



మోదీ కోసం ఎదురు చూస్తున్నాం

భారత ప్రధాని నరేంద్ర మోదీ రాక కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది.

- వివరాలు 6లో

ప్రచార 'సారథి' ఈటల!

దాదాపుగా ఖరారు చేసిన బీజేపీ అధిష్టానం

- ఈటలకున్న గుర్తింపు, రాజకీయ అనుభవం, కుల సమీకరణాలు పరిగణనలోకి..
- మరింత మంది అసంతృప్త నేతలు బీజేపీలోకి వచ్చే అవకాశాలుంటాయని అంచనా!
- ఇప్పటికే ఈటలకు సమాచారం.. రెండు మూడ్రోజుల్లో ప్రకటన
- రాష్ట్రానికి సంబంధించిన కీలక పదవులపై పార్టీ పెద్దల కసరత్తు
- కొత్తవారికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలపైనా తర్జనభర్జన
- పరిశీలనలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేరు
- మార్పు జరిగితే సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి!



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తంలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కొన్ని కీలక పదవుల భర్తీపై బీజేపీ కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. నాలుగైదు రోజులుగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లు ఈ విషయమై చర్చలు జరిపారు. అత్యంత కీలకమైన పార్టీ ప్రచార కమిటీ బాధ్యతలను సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు కట్టబెట్టాలని దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు రెండు, మూడు రోజుల్లోనే అధికారిక ప్రకటన ఉండొచ్చని ఢిల్లీ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలో ఈటలకున్న గుర్తింపు, రాజకీయ అనుభవం, కుల సమీకరణల ఆధారంగా..ప్రచార బాధ్యతలు ఆయనకు అప్పగిస్తేనే అధికార బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోగలమని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈటలకు కీలక బాధ్యతలు ఇస్తే బీఆర్‌ఎస్ నుంచి

మిగతా 3వ పేజీలో ▶

అత్యంత కీలకమైన పార్టీ అధ్యక్ష బాధ్యతల మార్పుపైనా బీజేపీ పెద్దలు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. బండి సంజయ్‌నే కొనసాగించాలని పార్టీలోని ఓ వర్గం కోరుతుంటే.. ఎన్నికలను, అధికార బీఆర్‌ఎస్‌ను సమర్థంగా ఎదుర్కోవాలంటే మార్చడమే ఉత్తమమని మరికొంతమంది నేతలు చెబుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఒకవేళ సంజయ్‌ను పక్కన పెడితే ఎవరిని అధ్యక్షుడిగా నియమించాలన్న దానిపైనా బీజేపీ జాతీయ నాయకత్వం సమాలోచన చేస్తోంది. ఈ క్రమంలో మొన్నటివరకు ఈటల పేరును పరిశీలించినా, చివరకు ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించాలని పెద్దలు నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేరు ముందుకు వచ్చినట్లు సమాచారం. వివాదాలకు దూరంగా ఉండటం, అందరినీ కలుపుకొనే తత్వం, పార్టీ అప్పగించే బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తించడం, సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆమెను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమెకు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టే అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఇన్‌చార్జిల నుంచి అభిప్రాయ సేకరణ జరిపినట్లు చెబుతున్నారు. అన్నీ ఓకే అయితే అధ్యక్షుడి మార్పుపై సైతం రెండు, మూడ్రోజుల్లోనే ప్రకటన ఉండొచ్చని అంటున్నారు. అదే జరిగితే ఇప్పటివరకు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన సంజయ్‌కు కేంద్రమంత్రి పదవి ఇవ్వడం ద్వారా సముచిత గౌరవం కల్పించవచ్చని తెలుస్తోంది.





శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి వెళ్తూ గోదావరిఖని సమీపంలో నిండుకుండలా ఉన్న గోదావరి తల్లికి బ్రిడ్జిపై నుంచి హారతి ఇస్తున్న సీఎం కేసీఆర్

వికలాంగులకు మరో రూ.వెయ్యి

పింఛను పెంచుతున్నామని మంచిర్యాల ప్రగతి నివేదన సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్

వచ్చే నెల నుంచే రూ.4,116 పింఛను అందిస్తామని వెల్లడి

- అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ
- సంక్షేమం, వ్యవసాయంలో ముందంజ
- ధరణి తీసేస్తా అనే వారిని బంగాళాఖాతంలో విసిరేయాలి
- కులవృత్తులకు రూ.లక్ష సాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి పథకాలు ప్రారంభం

2లో

న్యూస్‌రీల్

గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి



గొర్రెల పెంపకం వృత్తిగా జీవిస్తున్న గొల్ల, కురుమల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అర్హులైనవారికి గొర్రె పిల్లల యూనిట్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి తలసాని తెలిపారు.

- వివరాలు 3లో▶

80వేల మందికి పైనే...



ఆస్తమా రోగులు ఎంతగానో ఎదురుచూసే చేప ప్రసాదం పంపిణీ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. తొలిరోజు రాత్రి పొద్దుపోయే వరకు 80 వేల మందికి చేప ప్రసాదం ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

- వివరాలు 7లో▶

భారత్ వైపు.. దిగ్గజాల చూపు



కోవిడ్ అనంతరం లగ్జరీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ దిగ్గజాలు భారత్ వైపు దృష్టి సారిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు రెండు డజన్ల సంస్థలు ఎంట్రీ ఇవ్వనున్నాయి.

- వివరాలు 15లో▶

బొమ్మలకు ఒక రోజు



ప్రతి యేడాది జూన్ రెండవ శనివారం వరల్డ్ డాల్ డే ని జరుపుకుంటున్నారు డాల్ లవర్స్. చేతితో సొంతంగా తయారు చేసుకున్న బొమ్మల నుండి డిజైనర్ బొమ్మల సేకరణ వరకు ఈ డాల్ డే ని ప్రత్యేకంగా జరుపుకోవచ్చు.

- వివరాలు 13లో▶

ధరణిని బరాబర్ రద్దు చేస్తాం



- యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్
- ధరణి రాక ముందు గ్రామాల్లో రికార్డులు లేవా?
- భూస్వాములకోసమే ధరణిని తెచ్చారు
- అవకతవకలకు పాల్పడిన అధికారులను ఊచలు లెక్కపెట్టిస్తాం
- అభివృద్ధి విషయంలో చర్చకు సిద్ధం
- సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేస్తాం

- వివరాలు 12లో▶

ధరణితో రైతుల హక్కులకు విఘాతం



- ఈ పోర్టల్‌తో రైతులు భూములపై హక్కులు కోల్పోతున్నారు
- ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నేతలకు ఎన్నికల్లో తగిన శాస్తి తప్పదు
- బహుళజాతి సంస్థలకు దళారీగా కేటీఆర్
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి

- వివరాలు 12లో▶

ప్రియురాలిని చంపి ఉప్పు పాతరేశాడు!



అప్సర



సాయి కృష్ణ

రాయితో మోది దారుణంగా హతమార్చిన పూజారి

- గుడికి వచ్చిన యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్న వివాహితుడు.. పెళ్లి చేసుకోవాలన్నందుకు ఘోరకృత్యం
- మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో వేసి ఉప్పు, ఎర్రమట్టి నింపాడు.. పోలీసులకు యువతి అదృశ్యమైనట్లుగా ఫిర్యాదు
- పోలీసుల దర్యాప్తుతో హత్యోదంతం వెలుగులోకి..
- నిందితుడి అరెస్టు.. మృతదేహం వెలికితీత

శంషాబాద్, చైతన్యపురి, హుడా కాంప్లెక్స్: గుడికి వచ్చిన యువతితో వివాహితుడైన పూజారికి ఏర్పడిన పరిచయం అక్రమ సంబంధానికి దారి తీసింది. కొన్నాళ్లు బాగానే గడిపారు. తీరా తనను వివాహం చేసుకోవాల్సిందిగా ఆమె నుంచి ఒత్తిడి పెరగడంతో చంపాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం నగర శివార్లలోకి తీసుకువెళ్లి దారుణంగా హతమార్చాడు. మృతదేహాన్ని సరూర్‌నగర్ మండల ఆఫీసు వెనుక ఉన్న పాత సెప్టిక్ ట్యాంక్‌లో పడేసి ఉప్పు, ఎర్రమట్టి నింపాడు. వాసన బయటకు రాకుండా దానికి ఉన్న రెండు మ్యాన్‌హోల్స్‌కు కాంక్రీట్ చేశాడు. తర్వాత ఆమె అదృశ్యమైనట్లు ఆర్‌జీఐఏ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో ముందుకు వెళ్లిన

మిగతా 2వ పేజీలో ▶



పాస్‌వర్డ్ గుట్టు వీడలేదు!

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో తొలి చార్జిషీట్ దాఖలు

- తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో (టీఎస్‌పీఎస్సీ) చోటుచేసుకున్న ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ అధికారులు శుక్రవారం తొలి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అరెస్టులు మొదలై 90 రోజులు కావస్తుండటంతో నాంపల్లి న్యాయస్థానంలో సప్లిమెంటరీ చార్జిషీట్ వేశారు. ఇందులో 37 మందిపై అభియోగాలు మోపారు.

- వివరాలు 5లో▶

క్లుప్తంగా...

12న రాష్ట్రపతితో ఆదిమ గిరిజనుల భేటీ



సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా ఉన్న ఆదిమ గిరిజనులు ఈ నెల 12న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ కానున్నారు. ఈ మేరకు ఆదిమ గిరిజనుల బృందానికి ప్రభుత్వం ఐదు గురు లైజన్ అధికారులను ఎంపిక చేసిందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ఆహ్వానం మేరకు తెలంగాణ నుంచి 60 మంది ఆదిమ గిరిజనులు (కోలాం -15, తోటి-15, చెంచు-15, కొండరెడ్లు-15) ఈ బృందంలో ఉండనున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ గిరిజనుల జీవన విధానాలు, ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం కోసం ద్రౌపది ముర్ము.. కేంద్ర గిరిజన శాఖ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు.

మెదక్ నుంచి ప్రియాంక పోటీ

టీపీసీసీ మేధావుల సెల్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు నుంచి ప్రియాంకాగాంధీని పోటీ చేయించాలని టీపీసీసీ మేధావుల సెల్ కోరింది. తద్వారా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడింది. గాంధీభవన్‌లో శుక్రవారం టీపీసీసీ మేధావుల సెల్ సమావేశం జరిగింది. సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జి.నిరంజన్, శ్యాంమోహన్, కమలాకర్ రావు తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం శ్యాంమోహన్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఎలా సన్నద్ధమవ్వాలన్న అంశంపై సమావేశంలో చర్చించినట్టు తెలిపారు.

నిరుద్యోగుల ఉసురు తీస్తున్న కేసీఆర్

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగుల ఉసురు తీసుకుంటున్న కేసీఆర్ అండ్ కోలను తన్ని తరిమే రోజులు దగ్గర పడ్డాయని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జోస్యం చెప్పారు. తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం వస్తదని రెచ్చగొట్టి, నిరుద్యోగుల ప్రాణం తీసేశారని ఆమె ఆరోపించారు. చదువుకున్నోళ్లందరికీ సర్కారు కొలువులు ఇవ్వలేమని కేటీఆర్ చేతులెత్తేసి, నిరుద్యోగులకు శఠగోపం పెట్టారని ట్విట్టర్‌లో విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు పోతే, ఆగమేఘాల మీద మళ్లీ పదవులు తెచ్చుకోవచ్చు.. స్వరాష్ట్రం కోసం కొట్లాడిన నిరుద్యోగులు మాత్రం తొమ్మిదేండ్లుగా కొలువులు లేక ఆకలితో అలమటించాల్నా? అని ఆమె నిలదీశారు. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది?.. 12 వందల మంది బలిదానాలు చేసుకున్నదని? ప్రశ్నించారు.

బీసీ జాబితాలోని అన్ని కులాలకు రూ.లక్ష ఇవ్వాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కుల వృత్తులకు మాత్రమే కాకుండా బీసీ జాబితాలోని అన్ని కులాలకు 'రూ.లక్ష' పథకాన్ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా బీసీ బంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలని, గత ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్న 5.77 లక్షల మందికి సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పద్మశాలి, ముదిరాజ్, గౌడ, గొల్ల, కురుమ, మున్నూరు కాపు, బెస్త, బోయ, వాల్మీకి, బలిజా, లింగాయత్‌తో పాటు 130 కులాలకు కూడా లక్ష రూపాయల పథకాన్ని అమలు చేయాలన్నారు. అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.



...సార్ ఆధ్వర్యంలో ఇంకా మంచి గ్రాఫిక్ డిజైనర్స్‌తో తీర్చిదిద్దుతాం!

వికలాంగులకు మరో వెయ్యి

పింఛను పెంచుతున్నామని మంచిర్యాల ప్రగతి నివేదన సభలో ప్రకటించిన సీఎం కేసీఆర్



మంచిర్యాల సభకు హాజరైన ప్రజలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'వికలాంగులకు ఇప్పటివరకు రూ.3,116 ఇస్తున్నాం. శుక్రవారం మంచి రోజు. ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వికలాంగుల పింఛను మరొక వెయ్యి పెంచుతున్నం. మంచిర్యాల గడ్డ, తెలంగాణ ఈశాన్య ప్రాంతం నుంచే ఈ మాట ప్రకటించాలని నేను సస్పెన్స్‌లో పెట్టా. వచ్చే నెల నుంచే పెరిగిన రూ.4,116 అందిస్తాం..' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అధ్యక్షతన జరిగిన మంచిర్యాల ప్రగతి నివేదన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు.

దేశానికే తలమానికంగా తెలంగాణ

'దేశంలో తెలంగాణ అన్నింటా నంబర్ వన్‌గా నిలుస్తోంది. మంచిర్యాల జిల్లా ఏర్పాటు చేసి చక్కటి కలెక్టరేట్ నిర్మించాం. మెడికల్ కాలేజీ అనుబంధంగా ఆసుపత్రి కూడా సమకూర్చుకుంటున్నాం. ఇలా ఒక్కొక్కటిగా అన్నీ సమకూర్చుకుంటూ దేశానికే తలమానికంగా రాష్ట్రాన్ని మార్చుకున్నాం. పెద్ద రాష్ట్రాల్లో తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం, మంచి గ్రామం, మున్సిపాలిటీల్లో నంబర్ వన్ ఎవరంటే తెలంగాణ. మిషన్ భగీరథతో ప్రతిఇంటికీ నల్లా పెట్టి అందరికీ నీళ్లసరఫరా చేసే రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమే. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నాం. రైతుబంధుతో రూ.68 వేల కోట్లు రైతులకు అందించాం. గతంలో పంటలు పండాలంటే కరెంట్, నీళ్లు లేక గోస పడిన సంగతి తెలిసిందే. ఈ యాసంగిలో దేశంలో వరి 94 లక్షల ఎకరాల్లో సాగైతే ఒక్క తెలంగాణలోనే 54.40 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను మించిపోయింది. దేశంలోనే అతి ఎక్కువగా వడ్లు పండిస్తూ నంబర్ వన్‌గా నిలిచాం. గతంలో కోటి టన్నులు పండితే ఎక్కువ అనుకున్నాం. అటువంటిది మూడు కోట్ల టన్నుల పై చిలుకు బ్రహ్మాండంగా చేసుకుంటున్నాం. ఇదంతా ప్రభుత్వ సహకారం, రైతుల కష్టంతోనే సాధ్యమైంది..' అని కేసీఆర్ చెప్పారు.

ఇలాంటి గోదావరి చూస్తామా అనుకున్నాం..

'రూ.500 కోట్లతో మందమర్రి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశాం. ఆదివాసీ, గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తున్నాం. యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నాం. ఎంబీసీ, బీసీ కులాల వారికి రూ.లక్ష సాయం అందిస్తున్నాం. సొంత జాగా ఉంటే రూ.3 లక్షల సాయం ఇచ్చే పథకాన్ని ప్రారంభించుకున్నాం. గతంలో గోదారిలో రూపాయి బిళ్ల వేద్దామంటే నీళ్లు కనిపించేవి కావు. బ్రిడ్జి మీద అటు ఇటు తిరిగి మడుగులో ఎక్కడో వేసి వెళ్లిపోయేవాడ్ని. ఈ రోజు హెలికాప్టర్‌లో వస్తుంటే బ్రహ్మాండంగా గోదావరి ఉంది. ఇలాంటి గోదావరి చూస్తామా? అనుకున్నాం. గోదావరిఖనికి చెందిన సదాశివ కవి 'తలాపున పారుతుంది గోదావరి, మా చేన్లు, మా చెలక ఎడారి అని పాడేవారు' ఈ రోజు ఎంత బ్రహ్మాండంగా ఉందో మీరంతా చూస్తున్నారు. చెన్నూరు ఎత్తిపోతలు, వార్ధా బ్యారేజీతో ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లికి లక్ష ఎకరాల చొప్పున. సాగు నీరందిస్తాం..' అని చెప్పారు.

సింగరేణి నడకా మారింది..

'నిజాం మొదలు పెట్టిన 134 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి మన సొంత ఆస్తి. కాంగ్రెస్ హయాంలో సర్వ నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి అప్పులు తెచ్చి, చెల్లించలేక సొంత కంపెనీని 49 శాతం వాటా కింద అమ్మేశారు. సమ్మెలు, కార్మికుల అణిచివేత ఉండేది. 2014 కంటే ముందు రూ.11 వేల కోట్ల టర్నోవర్‌తో, కార్మికులకు 18 శాతం బోనస్‌తో రూ.56 కోట్లు మాత్రమే సింగరేణి పంచేది. ఈ రోజు సింగరేణి నడక మారింది. ప్రస్తుతం రూ.33 వేల కోట్ల టర్నోవర్ ఉంది. ఈ సంవత్సరం రూ.2,184 కోట్ల లాభాలు వచ్చాయి. ఇప్పుడు వచ్చే దసరాకు రూ.700 కోట్ల లాభాలు వస్తాయి. కాంగ్రెస్ హయాంలో 6,453 ఉద్యోగాలు ఇస్తే, డిపెండెంట్ల ఉద్యోగాలు పునరుద్ధరించి 15,256మందికి ఉద్యోగాలిచ్చాం. ఇవికాక మరో 19,463 ఉద్యోగాలు ఇచ్చాం. ప్రమాదం జరిగితే కార్మికులకు రూ.లక్ష ఇచ్చి చేతులు దులిపేసుకునేవారు. ప్రస్తుతం రూ.10 లక్షలు ఇస్తున్నా. దశాబ్ది ఉత్సవాల్లో అందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మందమర్రిలో బీసీ గురుకులానికి చెందిన ఓ అమ్మాయికి 470కు 468 మార్కులు వచ్చాయి. కలెక్టర్ అయ్యేందుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి రూ.5 లక్షల చెక్కు పంపిస్తామని చెప్పాం. బ్యాంకులో వేసుకుని చదువుకోమన్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశాం. ఈ ఏడాది 1.30 లక్షల మందికి దళితబంధు ఇస్తాం..' అని సీఎం తెలిపారు.

సింగరేణికి తాళం వేయనిద్దామా?

'కాంగ్రెస్ వాళ్లు సింగరేణిలో 49 శాతం వాటా కేంద్రానికి అమ్మేశారు. ఇప్పుడు బొగ్గు గనుల ప్రైవేటీకరణతో సింగరేణి తాళం వేస్తామంటున్నారు. వేయనిద్దామా? సింగరేణిని నిండా ముంచేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. మోదీ తెలంగాణలో గనులు ప్రైవేటీకరణ చేయమని చెప్పి, బెంగళూరు వెళ్లి టెండర్లు పిలిచి మోసం చేశారు. అస్సాంలో పంకాలు బంద్‌జేయ్ మంటర్రు, ఇంకో దగ్గర ఏసీలు బంద్ చేయిమంటున్నాం, దేశ రాజధాని ఢిల్లీలో పవర్ కట్ ఉంది. కానీ నిరంతరంగా ఎటువంటి అవరోధాలు లేకుండా 24 గంటల కరెంటు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే..' అని స్పష్టం చేశారు

రైతు బొటన వేలితో పట్టామార్పు

'గతంలో ధరణి రాకముందు రికార్డుల మార్పులకు లంచం ఇవ్వాల్సి వచ్చేది. ఆ అధికారం ఆఫీసర్లకు ఉండేది. ఇప్పుడు ఆ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అప్పగించింది. వీఆర్‌ఏ నుంచి సీఎం వరకు ఎవరూ మార్చలేరు. రైతు బొటన వేలితో మాత్రమే మారుతుంది. ప్రతి మండల ఆఫీసులో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఐదు నిమిషాల్లో పట్టా అవుతోంది. రైతుబీమా కింద రూ.5 లక్షలు బాధిత రైతులకు పది రోజుల్లోనే అందుతోంది. గతంలో వడ్లు అమ్ముకునేందుకు సేట్ల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం నేరుగా డబ్బులు బ్యాంకుల్లో పడుతున్నాయి. తెలంగాణ భూ భాగమే 2.75 కోట్ల ఎకరాలు. ఇందులో 1.55 లక్షల ఎకరాలు ధరణిలో ఎక్కాయి. 66 లక్షల ఎకరాల అటవీ భూమి ఉంది. మిగిలిన కుంటలు, బావులు, ఇళ్లు తీసేస్తే ఒక లక్ష వరకు మాత్రమే ఉంది. 99 శాతం పోర్టల్‌లో ఎక్కింది. కానీ ఎలక్షన్లు రాగానే కాంగ్రెస్ వాళ్లు ధరణి తీసేస్తాం, బంగాళాఖాతంలో వేస్తాం అంటున్నారు. వాళ్లనే బంగాళాఖాతంలో విసిరెయ్యాలి. నేను మూడేళ్లు చెమటోడ్చి కష్టపడి రైతు బాధలు పోవాలనే ఈ పోర్టల్ రూపొందించా. అంతకుముందు పెంరిగిన భూముల ధరలతో ఎన్నో కొట్లాటలు జరిగేవి. ఈ రోజు పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. భూమి ఉందో లేదో కంప్యూటర్‌లో చూసుకోవచ్చు. అలాంటి ధరణి ఉండాలా? వద్దా? (చేతులు లేపాలని సీఎం కోరారు). ధరణి తీసేస్తే మళ్లీ దళారీ రాజ్యం వస్తుంది. రైతుబంధు, బీమా ఎలా వస్తాయి. దీనిపై గ్రామాల్లో చర్చ పెట్టాలి..' అని సీఎం కోరారు. సభకు ముందు రూ.55 కోట్లతో సమీకృత జిల్లా కార్యాలయ భవనం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, రూ.1,658 కోట్లతో చెన్నూరు ఎత్తిపోతల పథకం, రూ.205 కోట్లతో మంచిర్యాల మెడికల్ కాలేజీ, రూ.164 కోట్లతో మంచిర్యాల–అంతర్గాం బ్రిడ్జి, రూ.500 కోట్లతో మందమర్రి ఆయిల్‌పాం ఫ్యాక్టరీతో పాటు ఎంబీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష సాయం, సొంతింటి పథకానికి రూ.3 లక్షల సాయం (గృహలక్ష్మి), రెండో విడత గొర్రెల పంపిణీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. మాజీ స్పీకర్ మధుసూదనచారి, మంత్రులు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కు, కోనప్ప, రేఖానాయక్, రాథోడ్ బాపురావు, జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు. కాగా సీఎం కేసీఆర్, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. నూతన కలెక్టరేట్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి.. కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కుర్చీలో కూర్చోబెట్టి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం వెంట సీఎస్ శాంతికుమారి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు జె.సంతోష్‌కుమార్, బొర్లకుంట వెంకటేష్ నేత, చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, దండే విఠల్, తాటిపర్తి జీవన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



మంచిర్యాలలో మహిళకు ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న కేసీఆర్. చిత్రంలో ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల, బాల్క సుమన్

గోదావరిమాతకు కేసీఆర్ పూజలు

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా పర్యటను ముగించుకుని రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరిఖని సమీపంలోని గోదావరి బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి నిండుకుండలా ఉన్న గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వేద బ్రాహ్మణోత్తముల మంత్రోచ్ఛరణల మధ్య పూలు, చీరసారె నదిలో వేసి కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం గోదావరి తల్లికి మహాహారతి ఇచ్చారు.

బీఆర్ఎస్‌ను రెండు కండెల లోతులో పాతిపెడదాం

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బీఆర్ఎస్ మీటింగ్ కన్నా గొప్పగా ఖమ్మంలో సభ
- 2, 3 రోజుల్లో హైదరాబాద్‌లో ఏ పార్టీలో చేరేది చెప్తా
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో పొంగులేటి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'కల్లబొల్లి మాటలు కాదు.. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన ప్రతీ మాట అమలు చేస్తాం. బీఆర్ఎస్ పార్టీతో పాటు కేసీఆర్‌ను రెండు కండెల లోతులో పాతి పెడదాం. జాతీయ పార్టీ పెట్టుకున్నామని ఖమ్మంలో మీటింగ్ ఏర్పాటుచేసి జబ్బలు చరుచుకున్న వారి కన్నా గొప్పగా బహిరంగ సభ పెట్టి మన సత్తా ఏమిటో చూపిద్దాం' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలకు చెందిన ముఖ్య అనుచరులతో శుక్రవారం ఆయన ఖమ్మంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబం నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించేందుకు తనలా ఆలోచన చేస్తున్న వ్యక్తులందరినీ సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే పలువురితో రహస్యంగా చర్చలు జరిపానని, వారందరినీ ఏకం చేస్తున్నానని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఏ పార్టీలో చేరతాననే నిర్ణయాన్ని వెల్లడిస్తానని తెలిపారు. తన నిర్ణయం అనుచరుల అభీష్టం ప్రకారమే ఉంటుందని అన్నారు. ఈ నెలాఖరులోగా ఖమ్మం నడిబొడ్డున భారీ బహిరంగ సభ పెట్టనున్నట్లు పొంగులేటి చెప్పారు. అధికార మదంతో ఉన్న ప్రజాప్రతినిధులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కొందరు కళ్లున్నా కనపడని ధృతరాష్ట్ర పాలకుల్లా ఉన్నారని, వంశచరిత్ర అంటూ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి నేను పూలమాల వేస్తే పాలతో శుద్ధి చేయిస్తావా.. ఇదేనా నీ సంస్కారం' అంటూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజల దృష్టి అంతా ఖమ్మంపైనే ఉందని, ఉమ్మడి జిల్లా ప్రజలు తనకు అండగా ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన నష్టానికి వడ్డీతో సహా తీసుకునే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

అందరిదీ ఒకే మాట..

సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా నేతల నుంచి పొంగులేటి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో దాదాపు 50 మందికి పైగా మాట్లాడితే వారంతా కాంగ్రెస్‌లోనే చేరాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఏ ఒక్కరు కూడా ఇతర పార్టీల పేరెత్తకుండా ముక్తకంఠంతో పొంగులేటి కాంగ్రెస్‌లోనే చేరాలంటూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

లక్ష మందితో అమిత్‌షా సభ

- ఖమ్మంలో బీజేపీ దమ్మేంటో చూపిస్తాం
- మైదానాలను పరిశీలించిన బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్



స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న సంజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 15న ఖమ్మం వస్తున్న నేపథ్యంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జిల్లా నేతలతో కలిసి శుక్రవారం ఆయన ఖమ్మంలోని ఎస్పీ స్టేడియం, పక్కనే ఉన్న ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ మైదానాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అమిత్‌షా మొదటిసారి ఖమ్మంలో పర్యటిస్తుండటంతో జనం పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, అందుకే సువిశాల ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ మైదానాన్ని ఎంపిక చేశామని చెప్పారు. సభకు స్వచ్ఛందంగా తరలి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం స్టేడియంలో పిల్లలతో బండి సంజయ్ సరదగా ఫుట్‌బాల్ ఆడారు. స్టేడియం పక్కనే ఉన్న కేఫ్‌లో కార్యకర్తలతో కలిసి చాయ్ తాగారు.

బీజేపీ సింగిల్‌గా పోటీ చేస్తుంది..

అంతకుముందు ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నేతలతో సంజయ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయిందన్నారు. కమ్యూనిస్టులను కేసీఆర్ విమర్శించినా.. వారు మాత్రం బీఆర్ఎస్ పంచనే చేరుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తుందని, అందరూ కష్టపడి పనిచేసి కాషాయ రాజ్య స్థాపనకు కృషి చేయాలని సూచించారు కార్యక్రమంలో పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎం.ధర్మారావు, కొండేటి శ్రీధర్, కుంజా సత్యవతి, నేతలు ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్ రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, సినీనటి కవిత, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎనిమిది మందితో ఎన్ఎస్‌సీ కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడానికి ప్రపంచ స్థాయిలో విత్తన పరిశ్రమ పరిస్థితులకు అనుగుణంగా నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎస్‌సీ) పనితీరును పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం ఎనిమిది మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా డా ఎస్.కే రావు, సభ్యులుగా కె. కేశవులు, డీకే యాదవ్, వి.శంకరన్, మాళవిక దద్లాని, కె.నారాయణ స్వామి, అరవింద్ కపూర్, ఎం.ఎస్ బెనర్జీలను నియమించింది. ఈ కమిటీ ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించి..రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ, విత్తనాభివృద్ధి సంస్థ, రాజేంద్రనగర్‌లో ఉన్న అంతర్జాతీయ విత్తన పరీక్ష ల్యాబ్ (టీఐఎస్‌టీఏ)ను సందర్శించింది.

ప్రియురాలిని చంపి ఉప్పు పాతరేశాడు!

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులు ఆమె హత్యకు గురైనట్లు తేల్చారు. పోలీసుల కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..

గుడిలో ఏర్పడిన పరిచయం కాస్తా ..

చెన్నైకి చెందిన కురుగంటి అరుణ, శ్రీకర్ దంపతుల కుమార్తె అప్సర (30) అక్కడే సినీ రంగంలో పని చేశారు. ఓ చిత్రంలో పాత్ర కూడా పోషించారు. తండ్రి కాశీకి వెళ్లిపోవడంతో కూతురును తీసుకొని తల్లి హైదరాబాద్‌కు వలస వచ్చింది. వీళ్లు సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ రోడ్ నం.15 లోని బంగారు మైసమ్మ ఆలయ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. స్వతహాగా భక్తురాలైన అప్సర తరచూ తన ఇంటికి సమీపంలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లేది. ఈ క్రమంలో ఆలయ ప్రధాన పూజారి, రియల్టర్ అయిన అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణతో గతేడాది ఏప్రిల్‌లో పరిచయమైంది. ఇరువురిదీ ఒకే సామాజిక వర్గం కావడంతో సాన్నిహిత్యం పెరిగి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఓ పాపకు తండ్రి కూడా అయిన సాయికృష్ణ తరచు అప్సర ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఆమెను తీసుకుని తన ద్విచక్ర వాహనం, కార్లలో గోశాలలు, దేవాలయాలకు వెళ్తుండేవాడు. ఎలాంటి సందేహం రాని అరుణ వారికి ఎప్పుడూ అడ్డు చెప్పలేదు.



మృతదేహాన్ని పాతిపెట్టిన స్థలం వద్ద పంచనామా చేస్తున్న సరూర్‌నగర్ తహశీల్దార్ జయశ్రీ

వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో...

సాయికృష్ణతో సన్నిహితంగా మెలుగుతున్న అప్సర గతంలో పలుమార్లు తనను రెండో వివాహం చేసుకోవాల్సిందిగా కోరింది. అతడు దాటవేస్తుండటంతో ఈ ఏడాది మార్చి నుంచి ఒత్తిడి పెంచింది. దీంతో ఆమెను హత్య చేయాలనే నిర్ణయానికొచ్చిన సాయికృష్ణ.. ఈ నెల 3వ తేదీ రాత్రి 8.15 గంటల ప్రాంతంలో తన కారులో (ఫోర్డ్ ఫిగో, టీఎస్ 07హెచ్‌జే 2172) అప్సర ఇంటికి వెళ్లాడు. కోయంబత్తూరు వెళ్దామని చెప్పి బయటకు తీసుకొచ్చాడు. 11 గంటల సమయంలో శంషాబాద్ సమీపంలో భోజనం చేశారు. తర్వాత కాస్త అస్వస్థతకు గురైన అప్సర కారు ముందు సీట్లో నిద్రకు ఉపక్రమించింది. సాయికృష్ణ అక్కడినుంచి సుల్తాన్‌పూర్ గోశాల వైపు కారు తీసుకెళ్లాడు.

కారు బాడీ కవర్‌తో చంపేందుకు విఫలయత్నం...

తెల్లవారుజామున 3.50 గంటలకు అప్సర నిద్రలో ఉండగా.. కారు బాడీ కవర్ బయటకు తీసిన సాయికృష్ణ వెనుక సీటులోకి వచ్చాడు. అక్కడ నుంచే బాడీ కవర్‌ను ఆమె మెడకు చుట్టి, ఊపిరి ఆడకుండా చేసి చంపాలని ప్రయత్నించాడు. కానీ అప్సర ప్రతిఘటించడంతో వెనుక సీటు కింద ముందే ఉంచిన బెల్లం కొట్టే రాయి తీసి దాదాపు పదిసార్లు కొట్టడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని అదే కవర్‌లో చుట్టిన సాయికృష్ణ కారు డిక్కీలో పెట్టి మరుసటి రోజు (ఈ నెల 4న) తెల్లవారుజామున 4:45 గంటలకు సరూర్‌నగర్‌లోని తన అపార్ట్‌మెంట్‌కు చేరుకుని కారును మృతదేహంతో పాటే పార్కింగ్‌లో ఉంచాడు. ఉదయం అరుణ ఇంటికి వెళ్లిన సాయికృష్ణ అప్సర తన స్నేహితులతో కలిసి భద్రాచలం వెళ్లిందని నమ్మించాడు. తర్వాత అప్సర ఆచూకీ తెలియడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేద్దామని చెప్పి, ఈ నెల 5వ తేదీన అరుణతో కలిసి ఆర్‌జీఐఏ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అప్సరను తన మేనకోడలిగా పేర్కొన్నాడు. భద్రాచలం వెళ్తానని చెప్పడంతో తన కారులోనే శంషాబాద్ వరకు తీసుకువచ్చి అక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె ఫ్రెండ్స్ కారులో ఎక్కించానని, మరుసటి రోజు నుంచి ఆమె ఫోన్ స్విచ్చాఫ్ వస్తోందని తెలిపాడు.

మృతదేహం నుంచి వాసన వస్తుండటంతో...

అప్సర మృతదేహం 5వ తేదీ సాయంత్రం వరకు సాయికృష్ణ కారులోనే ఉంది. దుర్వాసన వస్తున్నట్టు గమనించిన అతను రాత్రి వేళ కారు తీసుకుని సరూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం వెనుక నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ వినియోగంలేని సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహాన్ని గన్నీ బ్యాగ్‌లో కుక్కి పడేసి, దాదాపు 2 బస్తాల ఉప్పు దానిపై పోశాడు. నిత్యాన్నదానం చేస్తున్న ఇతను దానికి వాడే ఉప్పునే దీనికి ఉపయోగించాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 2 టిప్పర్ల ఎర్రమట్టి తెప్పించి సెప్టిక్ ట్యాంక్‌లో పోయించాడు. ఆమె హ్యాండ్ బ్యాగ్, లగేజీ బ్యాగ్ కాల్చేశాడు. ఇంటికి వెళ్లి కారును శుభ్రం చేసి దాచిపెట్టాడు. ఈ నెల 7న మరోసారి అక్కడకు వెళ్లిన సాయికృష్ణ సెప్టిక్ ట్యాంక్‌కు ఉన్న రెండు మ్యాన్‌హోల్స్ నుంచి దుర్వాసన వస్తున్నట్లు గమనించాడు. దీంతో ఎల్బీనగర్ లోని లేబర్ అడ్డాకు వెళ్లి కొత్త మ్యాన్‌హోల్ మూతలు తెచ్చాడు. వీటిని మ్యాన్‌హోల్స్‌పై ఉంచి కాంక్రీట్ పోశాడు. ఆ సమీపంలో ఓ బోరు కూడా వేయించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ స్థలాన్ని బాగు చేయించాడు. ఇదంతా సామాజిక సేవలో భాగమనే భావన స్థానికులకు కల్పించాడు.

సీసీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో..

మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు అప్సర ఆచూకీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. శంషాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లోని నమోదైన సీసీ కెమెరాల ఫుటేజీలు, అప్సర, సాయికృష్ణ ఫోన్ల టవర్ లొకేషన్లు తదితర సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజీలో సాయికృష్ణ కారులోనే అప్సర శాబాద్ రోడ్డు మీదుగా నర్కూడ వైపు వెళ్లినట్లు కనిపించింది. దీంతో పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడు. శుక్రవారం ఆర్‌జీఐఏ పోలీసులు సెప్టిక్ ట్యాంక్‌ను పగులగొట్టి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న అప్సర మృతదేహాన్ని బయటకు తీశారు. సాయికృష్ణను అరెస్టు చేసి కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ డీసీపీ కె.నారాయణరెడ్డి శుక్రవారం ప్రకటించారు. హత్య జరిగిన ప్రాంతం శంషాబాద్ గ్రామీణ పోలీసుస్టేషన్‌పరిధిలోకి వస్తుంది. దీంతో మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి ఆ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయనున్నారు. పెళ్లి చేసుకోమంటూ ఒత్తిడి చేయడంతోనే అప్సరను చంపానని సాయికృష్ణ పోలీసు విచారణలో చెప్పినట్లు తెలిసింది. అప్సర గతంలోనూ గర్భం దాల్చిందని, దీంతో తనను పెళ్లి చేసుకోవాలని తనపై ఒత్తిడి తీసుకొచ్చిందని చెప్పినట్లు తెలిసింది. తన వల్లే అప్సర గర్భం దాల్చలేదని, ఆమెకు ఇతరులతోనూ సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నట్లు సమాచారం. గతంలో ఆమెకు తానే అబార్షన్‌చేయించానని చెప్పాడని తెలుస్తోంది.

మా అబ్బాయి మంచివాడు

మా అబ్బాయి సాయికృష్ణ చాలా మంచి వాడు. దైవసేవ తప్ప వేరే ఆలోచన ఉండేది కాదు. అప్సర చనువుగా ఉండటం గమనించి ఆడవాళ్లతో జాగ్రత్తగా ఉండమని చెప్పాం. మా అబ్బాయే హత్య చేశాడని అనుకోవటం లేదు.

– నిందితుడి తండ్రి లక్ష్మీనర్సింహమూర్తి

సాయికృష్ణను ఉరితీయాలి

అక్కయ్యా అని పిలుస్తూ మా ఇంటికి వచ్చేవాడు. అభం శుభం తెలియని నా బిడ్డకు మాయ మాటలు చెప్పి మోసం చేశాడు. చివరకు పొట్టన పెట్టుకున్నాడు. వాడిని బహిరంగంగా ఉరి తీయాలి.

– అప్సర తల్లి అరుణ

ఇంత కర్కోటకుడు అనుకోలేదు

సాయికృష్ణ గత పదేళ్లుగా సరూర్‌నగర్ పరిసరాల్లోని ఆలయాల్లోనే పని చేస్తున్నాడు. అందరికీ సుపరిచితుడు. నమ్మకంగా ఉండటంతో ఆలయం ప్రధాన పూజారిగా నియమించాం. కానీ ఇంత కర్కోటకుడు అనుకోలేదు.

– అకుల అరవింద్‌కుమార్, ట్రస్టీ, బంగారు మైసమ్మ దేవాలయం

బీజేపీలో కోవర్టులు ఎవరు?

- నందీశ్వర్ ఆరోపణలతో మళ్లీ తెరపైకి వచ్చిన కోవర్టుల పంచాయితీ
- అన్ని పార్టీల్లో కేసీఆర్ కోవర్టులున్నారంటూ గతంలో ఈటల ప్రకటన
- మీడియా చిట్‌చాట్లతో పార్టీకి నష్టం చేసిన వారే కోవర్టులని కొందరి వాదన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో 'కోవర్టుల'అంశం కలకలం సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రధాన రాజకీయపార్టీల కార్యకలాపాలు ఊపందుకోగా, కోవర్టుల అంశాన్ని బీజేపీ మరోసారి చర్చకు తెరలేపింది. బీజేపీలో ఉన్న సీఎం కేసీఆర్ కోవర్టులే తాను కాంగ్రెస్‌లో చేరబోతున్నానని ప్రచారం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ తాజాగా చేసిన ఆరోపణలు పార్టీలో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. కోవర్టులెవరో జాతీయ, రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన వెల్లడించారు. దీంతో బీజేపీలో కోవర్టులు ఎవరై ఉంటారా? అని రకరకాల ఊహాగానాలు పార్టీనాయకుల్లో సాగుతున్నాయి.

ఇప్పటికే కోవర్టులపై ఈటల వ్యాఖ్యలు...

పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ అన్ని పార్టీల్లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారంటూ కొద్ది రోజుల క్రితమే సంచలన ప్రకటన చేశారు. ఆయన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపాయి. బహిరంగంగా మాత్రం తమ పార్టీలో ఎవరూ లేరని గంభీరంగా చెబుతున్నా.. అంతర్గత చర్చల్లో మాత్రం 'ఫలానా నేత అయ్యి ఉండొచ్చా.. సదరు నాయకుడి ప్రకటనలు, ప్రవర్తన చూస్తే అలాగే అనిపిస్తోంది'అనేదాకా చర్చలు వెళ్లాయి. ఇప్పుడు నందీశ్వర్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి పార్టీలో చర్చకు కారణమయ్యాయి. గత కొన్నిరోజుల్లో ముఖ్యనేతలు నాలుగైదు సందర్భాల్లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన మాటలు పేర్లు ప్రస్తావించకుండా పత్రికల్లో ప్రచురితమవ్వడం, టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో తీవ్ర దుమారానికి కారణమయ్యాయి.

మళ్లీ ఇప్పుడెందుకు ?

నందీశ్వర్‌గౌడ్ వ్యాఖ్యలతో మళ్లీ కోవర్టుల పంచాయితీ ముందుకొచ్చింది. తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు ఢిల్లీలో అధినాయకత్వం మేధోమథనం నిర్వహిస్తున్న సందర్భంలోనే ఇవి ఎందుకు చర్చనీయాంశం అవుతున్నాయనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఐదురాష్ట్రాల ఎన్నికల్లో ఎలాంటి చాన్స్ తీసుకోకూడదని.. సంస్థాగతంగా అధ్యక్షుడి మార్పు, ఎన్నికల కమిటీ నియామకం వంటి మార్పుచేర్పులపై నాయకత్వం దృష్టి పెట్టిన సందర్భంలో ఈ ఆరోపణలు ఎందుకొచ్చాయి? ఇవి ఎవరిని ఉద్దేశించి చేసినవి? అనే చర్చ సాగుతోంది. ఈ కోవర్టుల గోలపై పార్టీ హైకమాండ్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- నకిరేకల్‌లో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

నకిరేకల్(నల్లగొండ): గొర్రెల పెంపకం వృత్తిగా జీవిస్తున్న గొల్ల, కురుమల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అర్హులైనవారికి గొర్రె పిల్లల యూనిట్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో రెండవ విడత గొర్రెల యూనిట్‌ల పంపిణీని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీకి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు ప్రకటించారని తెలిపారు. మొదటివిడతలో 50 శాతం పంపిణీ చేశామన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో రెండో విడత పంపిణీ చేపట్టామన్నారు. మొదట ఒక యూనిట్‌కు రూ.1.25 లక్షలు ఉండగా, రేట్లు పెరిగాయని గ్రహించిన సీఎం కేసీఆర్ ఒక యూనిట్‌కు రూ.1.75 లక్షలకు పెంచి పథకాన్ని కొనసాగించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.90 కోట్ల గొర్రెలు ఉన్నాయని తలసాని వెల్లడించారు.

కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదు..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదని మంత్రి తలసాని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉండగా తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. తెలంగాణలో అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్, సంక్షేమ రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి వైపు ఇతర రాష్ట్రాలు చూస్తున్నాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా ఎస్పీ అపూర్వరావు తదితరులు పాల్గొన్నారు.


జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదాద్రిలో హైకోర్టు జడ్జి పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేసి..అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ప్రచార 'సారథి' ఈటల!

▶ మొదటి పేజీ తరువాయి

మరింత మంది అసంతృప్త నేతలు బీజేపీలోకి వచ్చే అవకాశాలు కూడా ఉంటాయని అంచనా వేస్తున్నట్టు సమాచారం. నిజానికి తనకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని ఈటల కోరుతున్నప్పటికీ, వివిధ సమీకరణలు, పార్టీలో కొంత మంది నుంచి వ్యక్తమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఇప్పటికే ఈటలకు పెద్దలు సమాచారమిచ్చారని, దీనికి ఆయన కూడా అంగీకారం తెలిపినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈటలను శుక్రవారం ఢిల్లీకి పిలిపించారని ప్రచారం జరిగినా, గౌహతి వెళ్లినట్లుగా ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

పాఠశాలకు చేరని 'పాఠాలు'!

▶ మొదటి పేజీ తరువాయి

వారు పుస్తకాలు తీసుకెళ్లట్లేదు. దీంతో పుస్తకాల రవాణాకు టెండర్లు పిలవాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఇటీవల అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. టెండర్లు ఆహ్వానించే గడువు కూడా ఈ నెల 15 వరకూ పెట్టారు. అయితే ఇప్పటివరకు ఒకటి, రెండు జిల్లాల్లో తప్ప ఎక్కడా టెండర్లు పిలవలేదు. దీంతో టెండర్లు దాఖలయ్యేదెప్పుడు? ఖరారు చేసేదెప్పుడు? టెండర్ దక్కించుకున్న సంస్థ పుస్తకాలు చేరవేసేదెప్పుడు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బడులు తెరిచాక పుస్తకాలు అందించకపోతే పిల్లలకు పాఠాలు చెప్పేదెలా? అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

పుస్తకాలు లేకుంటే ఎలా..?

పుస్తకాల చేరవేతకు టెండర్లు పిలవమని ఉన్నతాధికారులు చెప్పినా, అది అమలుకు నోచుకోవడం లేదు. జూన్ 12న స్కూళ్లు తెరిచేలోగా పుస్తకాలు అందకపోతే బోధనకు ఇబ్బంది అవుతుంది. డీఈవోలు తక్షణమే ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయాలి. వంద శాతం పుస్తకాలు ఉంటేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

–పి.రాజా భానుచంద్ర ప్రకాశ్
(తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు)

బిల్లులు రాక ఇల్లు తాకట్టుకు సిద్ధమయ్యా..

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


లబ్ధిదారుల మాటలు విని కన్నీరు పెట్టుకుంటున్న స్పీకర్

బాన్సువాడ/నస్రుల్లాబాద్: డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు రావడం కొంత ఆలస్యం కావడంతో.. ఒకానొక సందర్భంలో సొంతింటిని తాకట్టు పెట్టి బిల్లులు చెల్లించాలనుకున్నానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కానీ కొందరు తనపై విశ్వాసంతో వారించడంతో ఆ నిర్ణయం ఉపసంహరించుకున్నట్టు తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబరాలను నిర్వహించారు. పోచారం మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో సొంత స్థలాలున్న వారికి 7 వేల ఇళ్లు, ప్రభుత్వపరంగా 4 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. కాగా, ఓ లబ్ధిదారుడు కలలో కూడా ఇంతమంచి ఇంట్లో ఉంటానని ఊహించలేదని.. స్పీకర్ సార్ తనకు దేవుడితో సమానమని కన్నీరు పెట్టుకున్నాడు. దీంతో స్పీకర్ కూడా కంటతడి పెట్టారు.

నేనే క్రతువును, నేనే యజ్ఞాన్ని, హోమం చేసే మూలికలు నేనే,
మంత్రాన్ని నేనే, అగ్నినీ ఆహుతినీ కూడా నేనే.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 10 జూన్ 2023

ఎన్ఎంసీ తీరు మారాలి

దేశంలో వైద్య విద్య పర్యవేక్షణకు నెలకొల్పిన భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) భ్రష్టుపట్టిందనీ, దాని ప్రక్షాళన అసాధ్యమనీ పదమూడేళ్ల క్రితం సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఆ తర్వాత 2019లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు చట్టమై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆవిర్భవించింది. 2020 సెప్టెంబర్ నుంచి కొత్త సంస్థ పనిచేయటం ప్రారంభమైంది. పాత వ్యవస్థలోని లోపాలనూ, దోషాలనూ పరిహరించి కొత్త వ్యవస్థ వస్తున్నదంటే ఎవరైనా స్వాగతిస్తారు. కానీ ఈ మూడేళ్లలో ఎన్ఎంసీ ఆచరణ సరిగా ఉందా లేదా అన్నదే ప్రశ్న. కొత్త చట్టం వచ్చినప్పుడూ, కొత్త వ్యవస్థలు రూపుదిద్దుకున్నప్పుడూ సంబంధిత రంగాల్లోనివారు నిశితంగా గమనిస్తారు. అవి తమ ఆశలకూ, ఆకాంక్షలకూ అనుగుణంగా ఉన్నాయో లేదో తరచి చూస్తారు. ఎంబీబీఎస్ పూర్తయ్యాక వైద్య వృత్తిలో ప్రవేశించేందుకైనా, పీజీ కోర్సుల్లో ప్రవేశం కోరడానికైనా నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్స్) పేరిట జరిగే ఉమ్మడి ప్రవేశపరీక్ష రాయాల్సిందేనన్న నిబంధనను బిల్లుపై పార్లమెంటు చర్చిస్తున్న సమయంలోనే వైద్యరంగ నిపుణులు, వైద్య విద్యార్థులు గట్టిగా వ్యతిరేకించారు. అలాగే ఫీజుల నిర్ణయం విషయంలోనూ ఆందోళన వ్యక్తమైంది. వారి అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ అది చట్టంగా మారింది. దాని సంగతలావుంచి కొత్త వ్యవస్థ అయినా పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదా? దేశవ్యాప్తంగా 38 వైద్య కళాశాలల గుర్తింపు రద్దు చేస్తున్నట్టు ఈమధ్యే ఎన్ఎంసీ ప్రకటించింది. మరో వందకు పైగా వైద్య కళాశాలల్లో అనేక లోటుపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకోనట్టయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిజానికి గతంలో ఎంసీఐ సైతం ఇలాంటి తనిఖీలే చేస్తుండేది. చర్యలు తీసుకునేది. అయినా దానిపై ఎందుకు ఆరోపణలొచ్చేవో, అది ఎందుకు భ్రష్టుపట్టిపోయిందో కొత్త వ్యవస్థ సారథులు సరిగా అర్థం చేసుకున్నట్టు లేరు.

వచ్చే నెలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ ప్రవేశాలుంటాయి గనుక ఎన్ఎంసీ ముందుగానే వైద్య కళాశాలలను తనిఖీ చేయటం మెచ్చదగింది. గుర్తింపు రద్దు చేసినంత మాత్రాన వెంటనే ఆ కళాశాలలకు కేటాయించిన సీట్లన్నీ రద్దుకావు. అవి సకాలంలో మేల్కొని దిద్దుబాటు చర్యలు తీసుకుని, తిరిగి దరఖాస్తు చేసుకుంటే ఎన్ఎంసీ పరిశీలించి అనుమతులు పునరుద్ధరిస్తుంది. అలాగే ఎన్ఎంసీ సంతృప్తి చెందని పక్షంలో సంబంధిత కళాశాల కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖను కూడా ఆశ్రయించే వెసులుబాటుంది. వైద్య కళాశాలలపై ప్రధానంగా బోధనా సిబ్బంది కొరత విషయంలోనే ఆరోపణలొస్తున్నాయి. రెసిడెంట్ డాక్టర్ల సమస్య సరేసరి. ఇక ఇతరేతర మౌలిక సదుపాయాల లేమి సైతం ఎన్ఎంసీ కన్నెర్రకు కారణమవుతోంది. వైద్య కళాశాలల్లో విద్యా ప్రమాణాల తీరుతెన్నులనూ, అక్కడి మౌలిక సదుపాయాల కల్పననూ మదింపు వేయటం చాలా అవసరం. అయితే ఆ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తే మాత్రం ప్రయోజనం శూన్యం. వాస్తవానికి ఎన్ఎంసీ చట్టం–2019లోని సెక్షన్ 26(ఈ) ప్రకారం సంస్థకు చెందిన మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (మార్బ్) కళాశాల తీరుతెన్నులపై ఇచ్చే మదింపు, ఆ కళాశాలకిచ్చే రేటింగ్ అందరికీ అందుబాటులో ఉంచాలి. కానీ ఈ నెల మొదట్లో జారీ చేసిన కళాశాలల ఏర్పాటు, మదింపు, రేటింగ్ నిబంధనల్లోని సెక్షన్ 25 దీన్ని నీరుగారుస్తోంది. నిజానికి ఎన్ఎంసీ ఏర్పడింది మొదలు కళాశాలల మదింపు నివేదికల జాడే లేదు. సరిగదా అంతక్రితం ఎంసీఐ ఉన్నప్పుడు పొందుపరిచిన మదింపు నివేదికలు, రేటింగ్‌లు సైతం మాయమయ్యాయి. ఫలానా కళాశాలలో ఏ సదుపాయాలు లోపించాయో, దానిపై ఎందుకు చర్యలు తీసుకోవలసి వచ్చిందో, కాలక్రమంలో అది ఏయే అంశాల్లో మెరుగుపడిందో అందరికీ తెలియకపోతే ఎట్లా? ఇక ఆ తనిఖీల వల్ల సాధారణ విద్యార్థులకు ఒరిగేదేముంటుంది? విద్యార్థులు నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకునే సమయంలో ఎన్ఎంసీ మదింపు నివేదికలు అందుబాటులో ఉంటే, కళాశాల పూర్వ చరిత్ర తెలిస్తే వారు మెరుగైన నిర్ణయం తీసుకోగలుగుతారు. అంతేతప్ప కేవలం అది ప్రకటించిన ఫలితాన్నీ, దాని రేటింగ్‌నూ చూసి ఎలా సరిపెట్టుకుంటారు? ఈ చిన్న విషయం ఎన్ఎంసీకి తెలియదా? ఇలాంటి ధోరణి అటు కళాశాలలకు సైతం నష్టం కలిగిస్తుంది. రేటింగ్ సరిగా లేని కళాశాలలో స్వల్ప లోటుపాట్లు మాత్రమే ఉండొచ్చు. అవి సరిచేసుకునే స్థాయిలోనే ఉండొచ్చు. కానీ ప్రత్యర్థి కళాశాలకు చెందినవారు మాత్రం ఆ లోపాలను భూతద్దంలో చూపి తప్పుడు ప్రచారానికి దిగొచ్చు. విద్యార్థులకు తగిన సమాచారం అందుబాటులో లేకపోవటంతో ఆ కళాశాలపై అనాసక్తి ప్రదర్శిస్తారు.

ఎన్ఎంసీ తీరుపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి చాన్నాళ్ల క్రితమే ఫిర్యాదులు దాఖలయ్యాయి. ఆ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సీఐసీ మొన్న మార్చిలో ఆదేశాలు కూడా ఇచ్చింది. తీరా ఈ నెల మొదట్లో నోటిఫై చేసిన నిబంధనలు గమనిస్తే సీఐసీ ఆదేశాలు బేఖాతరైనట్టు అర్థమవుతుంది. గతంలో పనిచేసిన ఎంసీఐ అవినీతిమయం అయిందని రద్దు చేస్తే, దాని స్థానంలో వచ్చిన ఎన్ఎంసీ కూడా అదే బాటలో సాగుతున్నదన్న అభిప్రాయం కలిగిస్తే, పారదర్శకతకు పాతరేస్తే ఏమనాలి? ఇది సరికాదు. దేశంలోని ప్రతి వైద్య కళాశాలకు సంబంధించి ఎంసీఐ కాలంనాటి మదింపు నివేదికలు, రేటింగ్‌లతోపాటు ఎన్ఎంసీ గత మూడేళ్ల అంచనాలు సైతం అందరికీ అందుబాటులో ఉంచాలి. విద్యార్థులు మెరుగైన నిర్ణయం తీసుకొనేందుకు తోడ్పడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.సప్తమి సా.5.55 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** శతభిషం రా.7.41 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.1.42 నుండి 3.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.29 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ప.12.48 నుండి 1.55 వరకు

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

శాంతి స్థాపనలో భారత్ ముఖ్యపాత్ర?

విశ్లేషణ



పి.కె. వాసుదేవ

ఉక్రెయిన్–రష్యా యుద్ధం కారణంగా చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. శాశ్వత కాల్పుల విరమణను, స్థిరమైన శాంతిని సాధించడానికి దీర్ఘకాలిక అంకితభావం, పట్టుదలతో పాటు అంతర్జాతీయ ఒత్తిడి అవసరం. ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో శాంతి భద్రతలను నిర్వహించడంలో భారత్ ముఖ్యమైన పాత్రను పోషించింది. పుతిన్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోనూ భారత్ నాయకత్వం సన్నిహితంగా ఉండటంతో శాంతిని నెలకొల్పేందుకు భారత ప్రధాని మధ్యవర్తిత్వం వహించవచ్చని కొన్ని దేశాలు అభిప్రాయపడుతున్నాయి. సమస్యను పరిష్కరించడంలో అగ్రదేశాలు విఫలమవుతున్న నేపథ్యంలో భారత్ గురుతర బాధ్యత పోషించాల్సి ఉంది.

మెజారిటీ దేశాల ఆర్థిక వ్యవస్థలను అధమ స్థాయికి చేర్చిన 15 నెలల రష్యా–ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతోంది. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా ఇంధనం, ఆహార మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. సరఫరాను తగ్గించి, నిత్యావసరాల ధరలను మునుపెన్నడూ లేని స్థాయికి పెంచింది. ఇతర ఆర్థిక ప్రాంతాలతో పోలిస్తే, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర రేపే ఆర్థిక పరిణామాలకు యూరో ప్రాంతానికి ప్రత్యేకించి హాని కలుగుతుంది.

అణ్వాయుధాలను ఆశ్రయించవచ్చని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ పదేపదే హెచ్చరించినప్పటికీ, అణుయుద్ధం జరిగే అవకాశాలు పెద్దగా లేవు. తనను బెదిరించినట్లయితే రష్యా 'ప్రాదేశిక సమగ్రతను' రక్షించడానికి 'అందుబాటులో ఉన్న అన్ని ఆయుధ వ్యవస్థలను' ఉపయోగిస్తానని పుతిన్ 2022 సెప్టెంబరు 21న తేల్చిచెప్పారు.

భారత్ స్పందనేమిటి?

భారతదేశం సాంప్రదాయకంగా అంతర్జాతీయ సంఘర్షణలలో అలీన విధానాన్ని, తటస్థ విధానాన్ని అనుసరిస్తోంది. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తూ, సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. పుతిన్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సన్నిహితంగా ఉండటంతో శాంతి నెలకొల్పేందుకు ప్రధాని మోదీ మధ్యవర్తిత్వం వహించవచ్చని కొన్ని దేశాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని భారత్ నిలకడగా సమర్థిస్తోంది. అయితే ఉక్రెయిన్‌లో 'సమగ్రమైన, న్యాయమైన, శాశ్వత శాంతి' ఆవశ్యకతను నొక్కిచెప్పే తీర్మానంపై ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ఓటింగుకు మాత్రం భారత్ దూరంగా ఉండిపోయింది.

2015లో, క్రిమియాను రష్యా విలీనం చేసుకోవడాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభ చేసిన తీర్మానానికి... ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదనే విధానాన్ని పేర్కొంటూ భారతదేశం దూరంగా ఉంది. అయితే దౌత్య మార్గాల ద్వారా వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం భారతదేశం పిలుపునిచ్చింది. అలాగే మిన్‌స్క్ ఒప్పందం అమలు జరగాలని సూచించింది. భారత్ వైఖరిని ఉక్రెయిన్‌తో సహా కొన్ని దేశాలు విమర్శించాయి, రష్యా చర్యలపై న్యూఢిల్లీ మరింత బలమైన వైఖరిని తీసుకోవాలని ఉక్రెయిన్ వాదించింది. అంతర్జాతీయ శాంతి పరిరక్షక ప్రయత్నాలలో, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి మిషన్లలో పాల్గొనడం ద్వారా భారతదేశం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ వస్తోంది. ఐరాస శాంతి పరిరక్షక కార్యకలాపాలకు దళాలను స్థిరంగా అందించిన సుదీర్ఘ చరిత్ర భారత్‌కు ఉంది. పైగా ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత



ప్రాంతాలలో శాంతి భద్రతలను నిర్వహించడంలో భారత్ ముఖ్య పాత్రను పోషించింది.

విశ్వసనీయ దేశం

దేశాల సఖ్యత విషయంలో భారతదేశం విశ్వసనీయతను పొందుతోంది. ఇండో–పసిఫిక్ ఫోరమ్ దేశాలు భారత టీకా దౌత్యం, అవసరమైన సమయంలో మానవతా సహాయం తర్వాత భారతదేశంతో సహకారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయి. ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సంబంధాలు కూడా గణనీయమైన పురోగతిని చూపుతున్నాయి. ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మధ్య సమావేశాలు పరస్పర విశ్వాసంతో గౌరవంతో జరిగాయి. సంబంధాలను మెరుగుపరిచేందుకు తీవ్రంగా కృషి చేసిన తర్వాత, ఎలక్ట్రిక్ కార్ బ్యాటరీల కోసం భారత్‌కు లిథియం సరఫరా చేసేందుకు ఆస్ట్రేలియా సిద్ధంగా ఉండటంతో ఇరుపక్షాల సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి.

హిరోషిమాలో ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ రష్యాతో యుద్ధాన్ని ముగించే శాంతి ప్రణాళికను ప్రధాని మోదీకి అందించారు. దానికి భారతదేశం ఆమోదం కోరారు. ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీని ఆహ్వానించారు కూడా. అధికారిక సోర్సుల ప్రకారం, అనేక దేశాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ వైపు చూస్తున్నాయని భావించినందున, తన శాంతి ప్రతిపాదనకు మద్దతు కోరడం మినహా జెలెన్‌స్కీ భారతదేశంపై ఎటువంటి డిమాండ్ మోపలేదు. ఈ ప్రతి పాదనను మోదీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

శాంతి స్థాపన చర్యలు

ఉక్రెయిన్ యుద్ధంలో కాల్పుల విరమణను అమలు చేయడం అనేది బహుళ పార్టీలతో, భౌగోళిక రాజకీయ పరిగణనలతో కూడిన సంక్లిష్ట సమస్య. కాల్పుల విరమణ కోసం తీసుకోవాల్సిన కొన్ని చర్యలు: ఉక్రెయిన్, రష్యా, తూర్పు ఉక్రెయిన్‌లోని వేర్పాటువాద సమూహాలతో సహా వివాదాస్పద పక్షాల మధ్య చర్చలను సులభతరం చేయడానికిగానూ దౌత్య ప్రయత్నాలను ప్రోత్సహించడం; సంభాషణను, శాంతి చర్చలను సులభతరం చేయడానికి ఐక్యరాజ్య సమితి లేదా ఐరోపాలో భద్రత, సహకార సంస్థ (ఓఎస్‌సీఈ) వంటి అంతర్జాతీయ మధ్యవర్తులు లేదా సంస్థలను నిమగ్నం చేయడం; విరుద్ధమైన పార్టీలు శత్రుత్వాలను విరమించుకోవడానికి తగిన దౌత్యపరమైన ఒత్తిడి తీసుకురావాలని యూఎస్, యూరోపియన్ యూనియన్, పొరుగుదేశాల వంటి అంతర్జాతీయ పాత్రధారులను కోరడం; కాల్పుల విరమణకు అనుగుణంగా ఆర్థిక ఆంక్షలు విధించడం; దౌత్యపరంగా ఒంటరయ్యేట్టు చూడటం; ఇంకా ఇతర రాజకీయ చర్యలను ఉపయోగించవచ్చు. ప్రమేయం ఉన్న పక్షాల మధ్య సంభాషణ, నమ్మకాన్ని పెంపొందించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేలా పరస్పర విశ్వాసాన్ని పాదుగొలిపే చర్యలు తప్పనిసరి. ఇందులో ఖైదీల మార్పిడి, భారీ ఆయుధాల ఉపసంహరణ, నిర్దిష్ట స్థానిక ప్రాంతాల్లో కాల్పుల విరమణల అమలు వంటివి ఉంటాయి.

అంతేకాకుండా, సంఘర్షణలో చిక్కుకున్న పౌరులకు వైద్య సామగ్రి, ఆహారం, ఆశ్రయంతో సహా ప్రభావిత ప్రాంతాల్లో మానవతా సహాయానికి, తోడ్పాటుకు అనియంత్రిత ప్రాప్యతను ఏర్పరచాల్సిన అవసరం ఉంది.

జనాల బాధలను తగ్గించడానికి, సద్భావనను పెంపొందించడానికి రెండు వైపులా మానవతా సాయాన్ని అందించాలి. దీనితో పాటు కాల్పుల విరమణ అమలును పర్యవేక్షించడానికి, ధృవీకరించడానికి సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇందులో అంతర్జాతీయ పరిశీలకులు, శాంతి పరిరక్షక దళాలకు ప్రమేయం ఉండాలి. ఈ సంస్థలు కాల్పుల విరమణ ఉల్లంఘనలను నివేదించడంలో సహాయపడతాయి. అలాగే అంగీకరించిన నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూడటం ద్వారా పార్టీల మధ్య విశ్వాసాన్ని పెంపొందించవచ్చు. రాజకీయ, ఆర్థిక, జాతిపరమైన మనోవేదనలతో సహా సంఘర్షణ మూల కారణాలను పరిష్కరించడానికి రాజకీయ సంభాషణలను, సయోధ్యను ప్రోత్సహించాలి. సంఘర్షణ–ప్రభావిత ప్రాంతాల ప్రతినిధులతో సహా మొత్తం వాటాదారులను నిమగ్నం చేయడం అనేది, అంతర్లీన సమస్యలను పరిష్కరించడంలో, స్థిరమైన శాంతి ఒప్పందం కోసం పని చేయడంలో సహాయపడుతుంది.

ఈ పరిమాణంలో ఉన్న సంఘర్షణను పరిష్కరించడానికి అన్ని పార్టీల నిబద్ధత, సహకారం అవసరం. శాశ్వత కాల్పుల విరమణను, సుస్థిరమైన శాంతిని సాధించడానికి దీర్ఘకాలిక అంకితభావం, పట్టుదల, అంతర్జాతీయ ఒత్తిడి అవసరం.

వ్యాసకర్త అంతర్జాతీయ వాణిజ్య విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదీ సేవే!



ట్రూ కాలర్‌లో స్పామ్ కాల్స్‌ను 'ఫ్రాడ్' అని మార్క్ చేసేవాళ్లు తమ పనికి తగిన విలువ దక్కని దయాళువులు.

– ఆదిత్య మేనన్, జర్నలిస్ట్

మూల బీజం



ఈ 'అఖండ్ భారత్' మ్యాప్ ఎక్కడినుంచి వచ్చిందని మీరు ఆశ్చర్యపడుతుంటే గనక, అది హిందుత్వ ఊహల నుంచి వచ్చింది. అది హిందూ రాజ్యం అనే భావనతో లోతుగా ముడిపడి ఉంది.

– ఆద్రే త్రూష్కే, చరిత్రకారిణి

పెద్ద ప్రశ్నలు



గాంధీజీ హత్యకు సంబంధించిన న్యాయ విచారణ పాఠం చదివితే ఎవరైనా గందరగోళానికి గురవుతారు. గాడ్సే ఎన్ని గుళ్లను పేల్చాడన్నది నిర్ధారించలేదు. ఎందుకంటే ఆయన రివాల్వర్ కనబడలేదు. ఎందుకు మనూ, అభాలను సాక్షులుగా తీసుకోలేదు? ఎవరికీ తెలీదు. ఈ హత్య లబ్ధిదారులు బ్రిటిష్‌వాళ్లు. ఆర్ఎస్ఎస్ మీద నేరం మోపలేదు అయినా దూషణకు గురైంది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఏమిటీ గోల?



మార్కెటింగ్ కాల్స్ తప్పించుకోవడానికి ఎవరైనా ఎందుకు బజాజ్ ఫైనాన్స్ దగ్గర తమ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి? ప్రభుత్వ 'డీఎన్‌డీ' (డు నాట్ డిస్టర్బ్) రిజిస్ట్రీ చాలదా? కాల్ సెంటర్ కాల్స్ తనను ఇబ్బందికి గురిచేయకూడదని ఒక వ్యక్తి అనుకుంటే అతడిని బజాజ్ ఫైనాన్స్ శిక్షిస్తుందా?

– మాలిని, జర్నలిస్ట్

వెయ్యి రోజులా?



పరిశోధక విద్యార్థి ఉమర్ ఖాలిద్ ఏ విచారణ, బెయిల్ లేకుండానే జైల్లో వెయ్యి రోజులు పూర్తిచేసుకున్నాడు. ఆయన మీద చేసినవి తప్పుడు ఆరోపణలు అయినప్పటికీ, వాటిల్లో పొంతన లేని తనం ఉన్నప్పటికీ బెయిల్ తిరస్కరణకు గురైంది.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

ఎంతకాలం ఉచితం?



రెండు కథనాలు నన్ను ఆకర్షించాయి. ఇండియాలో సంగీతం మీద డబ్బులు ఆర్జించడాన్ని 'స్పాటిఫై' సవాలు చేయడం; 'హాట్‌స్టార్' తన ధోరణి మార్చుకుని క్రికెట్‌ను ఉచితంగా ప్రసారం చేయడం. అందరికీ రెండు ప్రశ్నలు. ఉచిత కంటెంట్‌ను మనం ఇష్టపడతాం, తరచుగా వచ్చే వాణిజ్య ప్రకటనలను పట్టించుకోం; ఎందుకు? ఒక్కసారి ఉచితమైతే ఇక భవిష్యత్‌లో ఎప్పుడైనా డబ్బులు చెల్లిస్తామా?

– రానీ స్క్రూవాలా, నిర్మాత

ఏం చేస్తున్నట్టు?



ఉత్తరాఖండ్ సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి చైనా సైన్యం ఎన్నో కొత్త నిర్మాణాలను చేపట్టింది. అయినప్పటికీ చైనా పేరెత్తడానికి మోదీ ఇంకా ధైర్యం కూడగట్టుకోవలసే ఉంది. లదాఖ్, అరుణాచల్ తర్వాత ఒకవేళ ఉత్తరాఖండ్‌లో మరింత భూభాగాన్ని కూడా చైనా తీసుకుంటే యూఎస్ గానీ, రష్యా గానీ ఇండియాను కాపాడలేవు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఇన్‌బాక్స్

విస్మృత దేశభక్తుడు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తెలంగాణలో జన్మించిన పలువురు కవులు వెలుగులోకి వచ్చారు. అటువంటి వారిలో 'ప్రతిజ్ఞ' రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు ఒకరు. పైడిమర్రి 1962 లోనే ప్రతిజ్ఞ రాసినప్పటికీ, పాఠ్య పుస్తకాలలోకి ప్రతిజ్ఞ అయితే చేరింది కానీ, రచయిత పేరు మాత్రం చేరలేదు. తెలంగాణ సాహితీవేత్తల విజ్ఞప్తి మేరకు 2015లో నూతనంగా ముద్రించిన పాఠ్య పుస్తకాలలో ప్రతిజ్ఞ రచయిత అంటూ ఆయన పేరు చేర్చారు. అలాగే 5, 9వ తరగతి పాఠ్యపుస్తకాలలో ఆయన జీవిత వివరాలను పొందుపరిచారు. 2016లో ఆయన శత జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో సంస్మరణ సభను ఏర్పాటు చేసి పైడిమర్రి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పైడిమర్రి పేరును పాఠ్యపుస్తకాలలో చేర్చింది.



పైడిమర్రి వెంకట సుబ్బారావు

1916 జూన్ 10న నల్లగొండ జిల్లాలోని అన్నే పర్తి గ్రామంలో జన్మించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు గొప్ప దేశభక్తుడిగా పేరు పొందారు. పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించి బహుభాషా కోవిదుడిగా పేరు పొందారు. ఆయన 'కాలభైరవుడు' వంటి నవలలు రాశారు. అనేక ప్రాంతాల్లో ఖజానా శాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. హోమియోపతి వైద్యునిగా పేరు పొందారు.

1962లో ఇండియా–చైనా మధ్య యుద్ధం వచ్చినప్పుడు విద్యార్థులలో దేశభక్తి, సోదర భావం వంటివి పెంచడానికి ఓ వాగ్దాన గీతం ఉంటే బావుంటుందని భావించి, తొమ్మిది వాక్యాల ప్రతిజ్ఞ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1964 నుండీ, 1965 నుండి దేశవ్యాప్తంగా ఆయన రాసిన ప్రతిజ్ఞను పాఠశాలల్లో విద్యార్థులు చేస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల పాఠ్యపుస్తకాలలో మాత్రమే ప్రతిజ్ఞ వద్ద ఆయన పేరు చేరింది. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో ఆయన పేరు చేరాల్సి ఉంది. దేశానికి ప్రతిజ్ఞ అందించిన పైడిమర్రి జయంతి వేడుకలను వాడవాడలా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– ఎమ్. రాం ప్రదీప్, తిరువూరు

(నేడు పైడిమర్రి జయంతి, హైదరాబాద్‌లో 'ప్రతిజ్ఞ సందేశం' పుస్తకావిష్కరణ)

జాతీయ బ్యాంకులపై ప్రైవేటు 'కత్తి'

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

ప్రైవేటీకరణ కత్తితో పబ్లిక్ రంగ సంస్థలపై విరుచుకుపడుతున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు మరో 10 నెలల్లో ఎదుర్కోబోతున్నప్పటికీ తన ప్రైవేటీకరణ ఎజెండా నుంచి 'తగ్గేదేలే' అంటోంది. 'బ్యాంకింగ్ రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టనున్నాం' అంటూ ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో మరోవిడత పబ్లిక్ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లను విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అర్థమయింది. ఇంతకుముందు 10 పబ్లిక్ రంగ బ్యాంకులను విలీన ప్రక్రియతో 4కు కుదించిన కేంద్రం.. మరో 12 చిన్న ప్రభుత్వరంగ బ్యాంకులను విలీన ప్రక్రియ ద్వారా 4కు కుదించడానికి పావులు కదుపుతోంది. నిజానికి 2021లోనే నీతిఆయోగ్ చేసిన సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వం 'బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు 2021'ను రూపొందించింది గానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదు.

జూలై లేదా ఆగస్ట్ మాసంలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో 'బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు 2021'ను ప్రవేశపెట్టి ఆమోదించుకొన్నాక, 12 చిన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కుదించేందుకు కేంద్రం చాపకిందనీరులా పని మొదలు పెట్టింది. పీఎస్‌బీలను ప్రైవేటీకరించే అంశంలో ఓ కమిటీని నియమించి, సదరు కమిటీ సిఫార్సుల మేరకు వాటిల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను పసిగట్టిన బ్యాంకు ఉద్యోగ సంఘాలు 'బ్యాంక్ బచావో... దేశ్ బచావో' అనే నినాదంతో ఆందోళన చేయడానికి సమాయత్తం అవుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఐదున్నర దశాబ్దాలుగా వెన్నెముకగా నిలుస్తున్నాయి. 60 శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగానికి; 20 కోట్ల మంది ఆధారపడిన చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు తక్కువ వడ్డీపై రుణాలందించి వాటి వ్యాపార కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడానికి దోహదం చేస్తున్నవి పీఎస్‌బీలే.

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రాధాన్యత రంగాలలో మొదటిది వ్యవసాయరంగమే. రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకులు అందించే మొత్తం రుణవితరణలో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు అందించాలి. అంతేకాదు పీఎస్‌బీలు చేసే వ్యవసాయ రుణవితరణలో తప్పనిసరిగా చిన్న, సన్నకారు రైతాంగానికి 8 శాతం మేర రుణాలు అందించాలి. 1969లో బ్యాంకులు జాతీయం అయ్యేనాటికి గ్రామీణ ప్రాంతాలలో రుణవితరణ కేవలం రూ. 115 కోట్లు కాగా, జాతీయం అయ్యాక కేవలం ఒక దశాబ్ద కాలం నాటికే రూ. 3,000 కోట్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రుణాల పరిమాణం అదే కాలంలో రూ. 67 కోట్ల నుండి రూ. 2,800 కోట్లకు చేరింది. కాగా, ప్రస్తుతం జాతీయ బ్యాంకులు అందిస్తున్న వ్యవసాయ రుణాలు రూ. 10 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో జాతీయ బ్యాంకులు పోషిస్తున్న పాత్ర ఏమిటో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా, ప్రభుత్వరంగ బ్యాంకులపై చట్టపరంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్‌బీఐల అజమాయిషీ, నియంత్రణ గలిగి ఉంటాయి. పైగా, డిపాజిట్‌ల రక్షణ విషయంలో సెంట్రల్ విజిలెన్స్ కమిటీ (సీవీసీ), సీబీఐలు కూడా అవసరమైన సందర్భాలలో జోక్యం చేసుకొనే అవకాశం ఉంది. దీనికితోడు 2005 నుంచి 'సమాచార హక్కు చట్టం' ద్వారా ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి పౌరుడు పొందే వెసులుబాటు ఉంది. ఇన్ని వ్యవస్థలు ప్రభుత్వరంగ బ్యాంకుల్ని 'వాచ్ డాగ్'లా కని



పెట్టుకొని ఉండటం వల్ల వాటికి జవాబుదారీతనం హెచ్చుస్థాయిలో ఉంది.

ఇందిరాగాంధీ దేశానికి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1969లో తొలుత 14 బ్యాంకుల జాతీయీకరణ జరిగింది. దేశానికి స్వతంత్రం లభించిన ఏడాది తర్వాతనే భారత రిజర్వుబ్యాంకును జాతీయం చేశారు. 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'ను 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా మార్చారు. కాగా, 1980లో మరో 6 బ్యాంకుల్ని జాతీయం చేశారు. జాతీయ బ్యాంకులకు సామాజిక బాధ్యత ఉండటం వల్ల సంక్షేమ రాజ్యం భావనతో రాజ్యాంగం ఏర్పరిచిన లక్ష్యాల మేరకు సామాన్యులకు సైతం సేవలు అందిస్తున్నాయి. అయితే, 1991లో దేశంలో 'సంస్కరణలు; ఉదార ఆర్థిక విధానాలు' మొదలయ్యాక... వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రభుత్వ రంగ బ్యాంకులలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మొదలయింది. ప్రభుత్వరంగ బ్యాంకుల బోర్డులలో రాజకీయ నాయకులకు స్థానం కల్పించడం ఎక్కువయ్యాక, వారి ప్రమేయంతో పేరు, ఊరు లేని సంస్థలకు భారీగా రుణాలందించడం కూడా ఎక్కువైంది. కావాలని బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టే జాడ్యం దేశంలో పెరిగిపోయింది. ఫలితంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు దాదాపు 12 శాతం మేరకు చేరుకొన్నాయి. అయితే, వాటిని సమర్థవంతంగా రికవరీ చేయకుండా ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం ఏకైక మార్గంగా పరిగణించడం కేంద్రంలోని ప్రభుత్వాలకు అలవాటైంది.

ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ బాట పట్టించడం వల్ల ఒనగూరే లాభాలు చాలా స్వల్పం. కస్టమర్ సేవల్లో, పాలనా వ్యవహారాలలో నాణ్యత పెరిగే మాట నిజమే. అలాగే, నిరర్థక ఆస్తుల శాతం తగ్గిపోతుంది. అయితే, ప్రైవేటు బ్యాంకుల కార్యకలాపాలపై ఆర్‌బీఐ పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెచ్చిన బ్యాంకింగ్ నియంత్రణ చట్టం– 1949, ఆర్‌బీఐ చట్టం–1934 వంటివి ప్రైవేటు బ్యాంకులకు వర్తించినప్పటికీ... ఆ రెండు చట్టాలూ డిపాజిటర్ల హక్కులను పూర్తిగా రక్షించలేవు. ఇక, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగ నియామకాల్లో అమలు జరిగే రిజర్వేషన్లను ప్రైవేటు బ్యాంకులు అమలు చేయవు. దానివల్ల ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు అవకాశాలు లేకుండా పోయి, సామాజిక న్యాయం జరగాలన్న రాజ్యాంగ లక్ష్యం దెబ్బతింటుంది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

మరణంలోనూ వీడని బంధం

- రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- ధర్మసాగర్ వద్ద అన్నాచెల్లెళ్లు, మరిపెడ వద్ద నవదంపతులు..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘటనలు

వారిద్దరిది రక్త సంబంధం.. మరో ఇద్దరిది మూడుముళ్ల బంధం. మృత్యువుకూడా వారి బంధాన్ని విడదీయలేకపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అన్నాచెల్లెలు, నవ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.


సుజిత్‌రెడ్డి


పూజారెడ్డి

ధర్మసాగర్/మరిపెడ రూరల్: ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ తల్లిని పోషించుకుంటున్న అన్నాచెల్లెళ్లు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం శివారు జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజిత్‌రెడ్డి (26) పోరెడ్డి పూజారెడ్డి (22) అన్నా చెల్లెళ్లు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తల్లిని చూసుకుంటున్నారు. వారి తండ్రి దేవేందర్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం చనిపోగా, తల్లి సుజాత పిల్లలిద్దరిని ఉన్నత చదువులు చదివించింది. కాగా, శుక్రవారం ఉదయం వారు తల్లిని చూసేందుకు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై నాగారానికి బయలుదేరారు. ఈ క్రమంలో కరుణాపురం శివారులో సుజిత్‌రెడ్డి ద్విచక్ర వాహనం ఓ లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుజిత్‌రెడ్డి, పూజ అక్కడికక్కడే మృతి చెందారు. చేతికి అందివచ్చిన బిడ్డలిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లి, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

అత్తగారి ఇంటికి వస్తూ..


నారాయణ సింగ్, అంజలి

మహబూబాబాద్ జిల్లా మరిపెడ పూల బజార్‌కు చెందిన గోగునాథ్ గోపి, సునీత దంపతుల కుమార్తె అంజలి (21)ని భూపాలపల్లి జిల్లా చల్లగరిగె గ్రామానికి చెందిన అనంతరాంసింగ్ కుమారుడు నారాయణసింగ్ (23)కు ఇచ్చి ఈ ఏడాది మార్చి 9న వివాహం జరిపించారు. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండడంతో భార్యాభర్తలు అక్కడే ఉంటున్నారు. వారాంతం కావడంతో నవదంపతులు శుక్రవారం బైక్‌పై మరిపెడకు బయలుదేరారు. మార్గ మధ్యలో మరిపెడ సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ, వీరి ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పెళ్లయిన మూడు నెలలకే నవ దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఇరువురి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

జహీరాబాద్ బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

రైలు కింద పడి బలవన్మరణం ● భూ వివాదాలే కారణమా!


లక్ష్మారెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బీఆర్ఎస్ నేత దాసరి లక్ష్మారెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన దాసరి లక్ష్మారెడ్డి (67) కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని నిజాంపేట్‌లో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి 11.30 సమయంలో శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ముంబై ఎక్స్‌ప్రెస్‌కు అడ్డుగా నిలబడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం సమాచారం అందుకున్న వికారాబాద్ రైల్వే పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ఆస్పత్రి కి తరలించారు. ఆయన ఆత్మహత్యకు భూవివాదాలే కారణమని తెలుస్తోంది. లక్ష్మారెడ్డి జహీరాబాద్ డీసీఎంఎస్ డైరెక్టర్‌గా ఉన్నారు. గతంలో జహీరాబాద్ ఎంపీపీగా, మార్కెట్ కమిటీ చైర్మన్, జహీరాబాద్ మండలం అల్లీపురం గ్రామ సర్పంచ్‌గా రెండు సార్లు పనిచేశారు. ప్రస్తుతం జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తూ. పార్టీలో క్రియాశీలక, కీలక నేతగా ఉన్నారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి


ప్రశాంత్

లింగంపేట (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సురాయిపల్లి జగదాంబ తండాకు చెందిన బీటెక్ విద్యార్థి దెగావత్ ప్రశాంత్ (20) గుండెపోటుతో మృతి చెందాడు. ప్రశాంత్ ఇటీవలే బీటెక్ పూర్తి చేయడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. జాబ్ వచ్చిన సంతోషంలో కుటుంబ సభ్యులకు, తండా వాసులకు గురువారం స్వీట్లు పంచాడు. రాత్రి ఎప్పటిలాగే నిద్రపోయిన యువకుడికి నిద్రలోనే గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేతికి వచ్చిన కొడుకు మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పాస్‌వర్డ్ గుట్టు వీడలేదు!

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో తొలి చార్జిషీట్ దాఖలు
- మొత్తం 'క్వశ్చన్ పేపర్స్' దందా రూ. 1.63 కోట్లు
- ఇప్పటివరకు 49 మంది నిందితులు అరెస్టు
- ముగిసిన మాజీ ఏఈ పూల రమేష్ పోలీస్ కస్టడీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో (టీఎస్‌పీఎస్సీ) చోటుచేసుకున్న ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ అధికారులు శుక్రవారం తొలి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అరెస్టులు మొదలై 90 రోజులు కావస్తుండటంతో నాంపల్లి న్యాయస్థానంలో సప్లిమెంటరీ చార్జ్‌షీట్ వేశారు. ఇందులో 37 మందిపై అభియోగాలు మోపారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా మిగిలిన వారిపై అదనపు చార్జిషీట్లు దాఖలు చేయనున్నారు.

యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ చేతికి చిక్కిందెలా?

కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లో ఉన్న కంప్యూటర్ నుంచి మాస్టర్ ప్రశ్నపత్రాలను కమిషన్ మాజీ ఉద్యోగి పులిదిండి ప్రవీణ్ కుమార్, మాజీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అట్ల రాజశేఖర్ పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకోవడం ద్వారా చేజిక్కించుకున్నట్లు సిట్ నిర్ధారించింది. అయితే ఆ కంప్యూటర్‌లోకి చొరబడటానికి వాడిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వారి చేతికి ఎలా చిక్కిందనే అంశంపై మాత్రం ఇప్పటికీ స్పష్టత రాలేదు. నిందితులు పోలీసులకు చెప్పిన వివరాల ప్రకారం కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఇన్‌చార్జ్‌గా ఉన్న శంకరలక్ష్మి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను తన పుస్తకంలో రాసి పెట్టుకున్నారు. వాటిని ప్రవీణ్ నోట్ చేసుకొని రాజశేఖర్‌కు తెలిపాడని దర్యాప్తు అధికారులు చెప్పారు. ఆపై కంప్యూటర్‌ను నిందితులు హ్యాక్ చేశారనే ఆరోపణలు వచ్చినా దానికీ ఆధారాలు లభించలేదు.

50 మంది నిందితుల్లో చిక్కిన 49 మంది...

బేగంబజార్ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసు దర్యాప్తు నిమిత్తం సిట్‌కు బదిలీ అయింది. అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏసీపీ పి.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టిన ఈ కేసులో ఇప్పటివరకు 50 మందిని నిందితులుగా తేల్చి 49 మందిని అరెస్టు చేశామని సిట్ అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. న్యూజిలాండ్‌లో ఉన్న నిందితుడిని పట్టుకోవాల్సి ఉందన్నారు. 50 మందిలో 16 మంది పేపర్ల విక్రయంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన వాళ్లే. అక్రమంగా ఏఈఈ ప్రశ్నపత్రం పొంది పరీక్ష రాసిన వాళ్లు ఏడుగురు, ఏఈ ప్రశ్నపత్రం పొంది రాసిన వాళ్లు 13 మంది, డీఏఓ పేపర్ పొంది పరీక్ష రాసిన వాళ్లు ఎనిమిది మంది ఉన్నారు. అరెస్టు అయిన నిందితుల్లో ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌లతోపాటు షమీమ్, రమేష్ కుమార్‌లు కమిషన్ ఉద్యోగులు. వారిలో రాజశేఖర్ మినహా మిగిలిన ముగ్గురూ గ్రూప్-1 పరీక్ష రాశారు. టీఎస్‌పీఎస్సీగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసి మానేసిన సురేష్ సైతం గ్రూప్-1 పేపర్ పొంది పరీక్ష రాశాడు. ఇరిగేషన్ శాఖ మాజీ ఏఈ పూల రమేష్ సహకారంతో ఏఈఈ పరీక్షల్లో హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ముగ్గురినీ సిట్ అరెస్టు చేసింది. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన వివరాలను బట్టి ప్రశ్నపత్రాల క్రయవిక్రయాల్లో రూ.1.63 కోట్లు చేతులు మారినట్లు తేలింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్స్, ల్యాప్‌టాప్స్, హార్డ్‌డిస్కులతోపాటు ఫోన్లను విశ్లేషణ నిమిత్తం సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపారు. ఈ వివరాలన్నీ క్రోడీకరించి న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకున్నాక నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మరోవైపు లీకేజీ కేసులో అరెస్టు అయిన మాజీ ఏఈ పూల రమేష్ ఆరు రోజుల పోలీసు కస్టడీ శుక్రవారంతో ముగిసింది. దీంతో ఇతడికి వైద్య పరీక్షల అనంతరం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

'మూడు తరాల' మృత్యువాత!

- చిన్నారి అక్షరాభ్యాసానికి వెళ్లొస్తుండగా తాత, తల్లి, చెల్లి మృతి
- కారును ఢీకొట్టిన లారీ
- ఖమ్మం జిల్లాలో దుర్ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


అంజలి


అజ్మీరా రాంబాబు


శ్రీవల్లి

వైరారూరల్: ఖమ్మం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి సహా ముగ్గురు మృత్యువాత పడ్డారు. బాసరలో బాబుకు అక్షరాభ్యాసం చేయించి స్వస్థలానికి తిరిగి వస్తుండగా వారి ప్రయాణం మధ్యలోనే ముగిసింది. వైరా మండలం పినపాక స్టేజీ వద్ద జాతీయ రహదారిపై కారును ఎదురుగా వస్తున్న లారీ అతివేగంతో ఢీకొనడంతో అజ్మీరా రాంబాబు (52), ఆయన కుమార్తె బానోతు అంజలి (25), మనవరాలు బానోతు శ్రీవల్లి (18 నెలలు) మృతి చెందారు. ఇదే ఘటనలో బానోతు బాబు, రాణి, స్వాతి, ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బోడిమల్లె తండాకు చెందిన అజ్మీరా రాంబాబు, వాచ్యానాయక్ తండాకు చెందిన బానోతు బాబు వియ్యంకులు. బాబు, రాణి కుమారుడైన డెంటల్ డాక్టర్ నవీన్‌కుమార్‌తో రాంబాబు కుమార్తె అంజలికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు కార్తికేయ, 18 నెలల కుమార్తె శ్రీవల్లి ఉన్నారు. కార్తికేయకు బాసరలో అక్షరాభ్యాసం చేయించేందుకు బానోతు బాబు, రాణి దంపతులు వారి కుమారులు నవీన్, ప్రవీణ్, కోడళ్లు అంజలి, స్వాతి, మనవరాలు శ్రీవల్లిని తీసుకుని వియ్యంకుడు అజ్మీరా రాంబాబుతో కలసి బాసర వెళ్లారు. గురువారం రాత్రి తిరిగి ఖమ్మం చేరుకున్నారు. అక్కడే బంధువుల ఇంట్లో ఉండి శుక్రవారం మధ్యాహ్నం కారులో వాచ్యానాయక్ తండాకు బయలుదేరారు. కారు పినపాక స్టేజీ చేరుకుంటుండగా ఎదురుగా అతివేగంతో వచ్చిన లారీ ఢీకొనడంతో కారు ముందు భాగంగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో రాంబాబు, ఆయన మనవరాలు శ్రీవల్లి అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె అంజలిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. గాయపడిన వారిలో బాబు, ప్రవీణ్, స్వాతి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సమాచారం తెలుసుకున్న ఏసీపీ ఎం.ఎ.రెహమాన్, సీఐ తాటిపాముల సురేశ్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా...

మోదీ రాక కోసం ఎదురుచూస్తున్నాం

అమెరికా రక్షణ శాఖ వెల్లడి

వాషింగ్టన్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక కోసం తాము ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. మోదీ పర్యటన భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త ఒరవడిని నిర్దేశిస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేసింది. అంతేకాకుండా రక్షణ సహకారం, భారత్‌లో స్వదేశీ రక్షణ రంగ పారిశ్రామిక ప్రగతి విషయంలో భారీ, చరిత్రాత్మక, ఉత్తేజభరిత ప్రకటనలు వెలువడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ప్రధాని మోదీ ఈ నెల 21న అమెరికా పర్యటన ప్రారంభిస్తారు. నాలుగు రోజులపాటు అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ ఈ నెల 22న ఇచ్చే అధికారిక విందుకు మోదీ హాజరవుతారు. అధ్యక్షుడిగా బైడెన్ పగ్గాలు చేపట్టిన తర్వాత మోదీ అమెరికాలో అధికారికంగా పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి. మోదీ రాకవల్ల భారత్, అమెరికా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నట్లు అమెరికా రక్షణ శాఖ సహాయ మంత్రి (ఇండో–పసిఫిక్ భద్రతా వ్యవహారాలు) ఎలీ రట్నార్ చెప్పారు. ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక సందర్భం అవుతుందన్నారు.

సిద్ధూ దయవల్లే భగవంత్ మాన్‌కు సీఎం పోస్టు

నవజోత్ కౌర్ స్పష్టీకరణ

చండీగఢ్: తన భర్త నవజోత్‌సింగ్ సిద్ధూ దయవల్లే భగవంత్ మాన్ పంజాబ్ ముఖ్యమంత్రి అయ్యారని నవజోత్ కౌర్ పరోక్షంగా తేల్చి చెప్పారు. పంజాబ్ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేత భగవంత్ మాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ నవజోత్‌సింగ్ సిద్ధూ నడుమ మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఆమె తాజాగా ట్వీట్ చేశారు. 'ఆప్' జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒకదశలో తన భర్త సిద్ధూను పంజాబ్ సీఎంగా నియమించాలని కోరుకున్నారని తెలిపారు. వివిధ మార్గాల్లో సిద్ధూను సంప్రదించారని ఉద్ఘాటించారు. పార్టీని దృష్టిలో పెట్టుకొని చివరకు భగవంత్ మాన్‌ను సీఎంగా ఎంపిక చేశారని వెల్లడించారు. భగవంత్‌కు ముఖ్యమంత్రి పదవి సిద్ధూ ఇచ్చిన బహుమతి అని స్పష్టం చేశారు. సిద్ధూకు పంజాబ్ ప్రజల సంక్షేమమే ముఖ్యమని, అందుకోసం ఎలాంటి త్యాగాలైనా చేస్తారని పేర్కొన్నారు. స్వర్ణ పంజాబ్ అనేది సిద్ధూ కల అని వివరించారు. 2022 ఫిబ్రవరిలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు ఎవరైనా పదవి దిగిపోయిన వెంటనే తన అధీనంలో ఉన్న ప్రభుత్వ దాక్యుమెంట్లు జాతీయ ఆర్కీవ్స్ అండ్ రికార్డ్స్ ఏజెన్సీ (ఎన్ఏఆర్ఏ)కి అప్పగించాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఆ రహస్య పత్రాలన్నీ జాతి సంపదగా భావిస్తారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓటమి పాలైన కొద్ది నెలలకి అంటే 2021 మేలో ఎన్ఏఆర్ఏ ట్రంప్ రహస్య పత్రాలు పూర్తిగా ఇవ్వలేదని తొలిసారిగా బయటపెట్టింది. రెండు డజన్ల బాక్సుల్లో ఉండే పత్రాలు ఇవ్వలేదని పేర్కొంది. దీనిపై విచారణ మొదలై ట్రంప్ అధీనంలో ఉన్న రహస్య పత్రాలన్నీ ఆర్కీవ్స్‌కు ఇవ్వాలంటూ కోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 2021 జనవరిలో అధ్యక్షుడిగా గద్దె దిగిన ట్రంప్ వందలాది పత్రాలను తన అధీనంలోనే ఉంచుకున్నట్టుగా ఆరోపణలు వచ్చాయి. కోర్టు ఆదేశాలతో ట్రంప్ తరపు లాయర్లు మరో 30 పత్రాలు అందజేశారు. అంతకు మించి తమ దగ్గర ఏవీ లేవని స్పష్టం చేశారు. 2022 ఆగస్టులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) రంగంలోకి దిగి ఫ్లోరిడాలోని ట్రంప్ ప్రైవేటు ఎస్టేట్ మార్ ఎ లాగోలో సోదాలు చేపడితే 15 బాక్సుల్లో 184 కీలక పత్రాలు లభించాయి. ఇందులో 67 విశ్వసనీయ పత్రాలు, 92 రహస్య, 25 అత్యంత రహస్య పత్రాలు లభించినట్టుగా అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇదే తరహా రహస్య పత్రాల కేసులో ట్రంప్ హయాంలో ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన మైక్ పెన్స్, అంతకు ముందు ఉపాధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌పై కేసులు నమోదై ఉన్నాయి. వైట్ హౌస్ నుంచి అత్యంత కీలకమైన డాక్యుమెంట్లను ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే తీసుకువెళ్లారా ? గూఢచర్య చట్ట నిబంధనల్ని ట్రంప్ ఉల్లంఘించారా ? అన్న దిశగా ప్రాసిక్యూషన్ విచారణ సాగిస్తోంది.అయితే శ్వేతసౌధం ఖాళీ చేయడానికి తక్కువ సమయం ఇవ్వడంతో హడావుడిగా తీసుకువెళ్లిన సామాన్లలో పత్రాలు కూడా వచ్చి ఉంటాయని ట్రంప్ కార్యాలయం అప్పట్లో సమర్థించుకుంది.



ఏమిటీ రహస్య పత్రాల కేసు..?

ట్రంప్ ఎదుర్కొంటున్న కేసులు ఇవే..!

హష్ మనీ

అగ్రరాజ్యం చరిత్రలో నేరాభియోగాలు ఎదుర్కొన్న ఒక మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ హష్ మనీ కేసులో నిలిచారు. 2016 అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నప్పుడు తనతో లైంగిక సంబంధాలున్నాయని ఆరోపించిన పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్ నోరు మూయించడానికి 1.30 లక్షల డాలర్లను ముట్టజెప్పినట్టు అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో ట్రంప్ లాయర్ మైఖేల్ కోహెన్ ద్వారా సొమ్ములు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో ట్రంప్ మన్‌హట్టన్ క్రిమినల్ కోర్టుకు ఈ ఏడాది ఏప్రిల్ 4న హాజరయ్యారు.

ఎన్నికల్లో అక్రమాలు

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఎన్నికల తుది ఫలితాలు ప్రకటించడానికి ముందే జో బైడెన్‌పై గెలుపు తనదేనంటూ ట్రంప్ ప్రచారం చేయడంపై విచారణ జరుగుతోంది. జార్జియా రాష్ట్ర కార్యదర్శి బ్రాడ్ రాఫెన్స్‌పెర్గర్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుతూ జార్జియాలో జరిగిన రీకౌంట్‌లో తనకు అదనపు ఓట్లు లెక్కించాలంటూ మాట్లాడిన సంభాషణ బయటకు రావడంతో ఈ కేసు నమోదైంది. ఈ ఏడాది జులై–సెప్టెంబర్ మధ్య ఈ కేసులో నేరాభియోగాలు నమోదయ్యే అవకాశాలున్నాయి.

క్యాపిటల్‌పై దాడి

2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ట్రంప్ ఓటమి భారాన్ని తట్టుకోలేక క్యాపిటల్ భవనంపై దాడికి తన అనుచరుల్ని ఉసిగొల్పిన ఘటనకు సంబంధించిన కేసు కూడా పెండింగ్‌లో ఉంది. కొలంబియా జిల్లా కోర్టులో ట్రంప్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. అదే సమయంలో కొత్త అధ్యక్షుడిగా జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకోవాలని అప్పటి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌పై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలపై కూడా కేసు నమోదై ఉంది.



అక్రమ వ్యాపారాలు

డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లో చేసిన వ్యాపారాల్లో నిబంధనల్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడ్డారని, తన ఆస్తుల్ని కూడా తప్పుడుగా చూపించారంటూ న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్ కేసు నమోదు చేశారు. ట్రంప్ న్యూయార్క్ రాష్ట్రంలో వ్యాపార లావాదేవీలు కొనసాగించకుండా నిషేధం విధించాలంటూ ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంలో ఇప్పటికే ట్రంప్‌ను అటార్నీ జనరల్ తన కార్యాలయంలోనే కొన్ని గంటలు ప్రశ్నించారు. న్యాయస్థానంలో ఈ కేసు అక్టోబర్‌లో విచారణకు రానుంది.

కాలమిస్ట్‌పై అత్యాచారం

మూడు దశాబ్దాల క్రితం తనపై అత్యాచారం చేశారన్న ఆరోపణలతో కాలమిస్ట్ జీన్ కరోల్ వేసిన కేసులో డొనాల్డ్ ట్రంప్‌ను న్యూయార్క్ కోర్టు మే 9న దోషిగా తేల్చింది. 1990లో మన్‌హటన్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో ట్రంప్ తనపై అత్యాచారం చేశారంటూ 2019లో న్యూయార్క్ కోర్టులో ఆమె పిటిషన్ వేశారు. ఏప్రిల్ 25న దీనిపై విచారణ మొదలైంది. కరోల్‌ను అబద్ధాల కోరుగా ప్రచారం చేసి ఆమె పరువుని బజారుకీడ్చినందుకు నష్టపరిహారంగా 50 లక్షల డాలర్లు చెల్లించాలంటూ న్యూయార్క్ కోర్టు తీర్పు చెప్పింది. దీనిపై ట్రంప్ న్యాయనిపుణుల బృందం పై కోర్టుకు వెళ్లనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌పై నేరాభియోగాలు

నమోదు చేసిన ఫెడరల్ జ్యూరీ
- మాజీ అధ్యక్షుడిపై నేరుగా అభియోగాలు నమోదు చేయడం చరిత్రలో తొలిసారి
- ఏడు ఆరోపణలతో కేసు నమోదు

మియామి: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చుట్టూ ఒకదాని తర్వాత మరొకటి కేసుల ఉచ్చు బిగుస్తోంది. ప్రభుత్వానికి చెందిన అత్యంత రహస్య పత్రాల కేసులో ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. ఒక మాజీ అధ్యక్షుడిపై ఫెడరల్ జ్యూరీ నేరుగా అభియోగాలు నమోదు చేయడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ కేసులో 13 తేదీ మంగళవారం మియామి కోర్టుకు హాజరు కావాలని సమన్లు కూడా అందాయి. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఒక మాజీ అధ్యక్షుడికి దేశంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని తాను ఎన్నడూ ఊహించలేదన్నారు. అమెరికా చరిత్రలో ఇదో చీకటి రోజుగా అభివర్ణించారు. దేశం ఎంతగా దిగజారిపోతున్నా, అందరం కలిసి అమెరికా గ్రేట్ ఎగైన్ అని నిరూపిద్దామని తన అభిమానులకి పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి జరుగుతున్న పోరులో ముందంజలో ఉన్న ట్రంప్ చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తూ ఉండడం రాజకీయంగా ఆయనకి గట్టి ఎదురు దెబ్బగానే చెప్పాలి. నిన్నటికి నిన్న పోర్న్ స్టార్‌కి ముడుపులు చెల్లించిన కేసులో నేరాభియోగాలు ఎదుర్కొన్న ట్రంప్ ఈ సారి ఏకంగా ఫెడరల్ జ్యూరీ అభియోగాలనే నేరుగా ఎదుర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా 2021లో గద్దె దిగిన తర్వాత ప్రభుత్వానికి సంబంధించిన రహస్య పత్రాలను ఆర్కీవ్స్‌కు అప్పగించకుండా ఫ్లోరిడాలో తన ఎస్టేట్‌కు తరలించారని ట్రంప్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే

రుజువైతే వందేళ్లు జైలు

రహస్య పత్రాల కేసులో గూఢచర్య చట్టం కింద డొనాల్డ్ ట్రంప్‌పై ఏడు అంశాల్లో అభియోగాలు నమోదయ్యాయి. ప్రభుత్వానికి చెందిన రహస్య పత్రాలను ఉద్దేశపూర్వకంగా తన దగ్గర ఉంచుకోవడం, న్యాయ ప్రక్రియను అడ్డుకోవడానికి కుట్ర, నిజాయితీ లేకుండా డాక్యుమెంట్లను దాచిపెట్టడం, తన గుట్టు బయటపడకుండా పథక రచన, తప్పుడు ప్రకటనలు జారీ చేయడం వంటి అంశాల్లో అభియోగాలు నమోదయ్యాయి. ఇవి రుజువైతే ట్రంప్‌కి గరిష్ఠంగా వందేళ్లు జైలు శిక్ష పడే అవకాశాలున్నాయి. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ అభియోగాలు ఎలాంటి అడ్డంకి కాకపోయినప్పటికీ రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ అభ్యర్థిత్వానికి ఎంత మద్దతు లభిస్తుందా అన్న అనుమానాలైతే ఉన్నాయి.



ఈయన పేరు డాక్టర్ జో డిటూరి. యూఎస్ నేవీ రిటైర్డ్ డైవర్, శాస్త్రవేత్త.. నీటి అడుగున దీర్ఘకాలం జీవించే మనిషి శరీరంపై ఒత్తిడి ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయం తెలుసుకోవాలనుకున్నారు జో. ఇందుకోసం ఫ్లోరిడా సమీపంలోని సముద్రంలో 22 అడుగుల లోతైన జూల్స్ అండర్ సీ లాడ్జి గదిలోకి మార్చి ఒకటో తేదీన అడుగుపెట్టారు. శుక్రవారం బయటకు వచ్చారు. ఏకబిగిన 100 రోజులు ఒకే వాతావరణంలో నీటి అడుగున గడిపి ఇప్పటిదాకా ఉన్న 73 రోజుల రికార్డును బద్దలు కొట్టారు.

శరద్ పవార్‌ను చంపుతామంటూ బెదిరింపు

- ముంబై పోలీసులకు ఎన్సీపీ ఫిర్యాదు
- బెదిరింపులతో గొంతు నొక్కలేరు: పవార్



ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్(82)ను చంపుతామంటూ సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వస్తున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. ఎన్సీపీ ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు దక్షిణ ప్రాంత సైబర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌కు బెదిరింపులపై సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. పవార్‌ను గౌరవనీయుడైన సీనియర్ నేత అంటూ ఆయన..బెదిరింపు హెచ్చరికల అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, దర్యాప్తు జరపాలంటూ ఆదేశాలిచ్చామని చెప్పారు. అవసరమైతే పవార్‌కు భద్రత పెంచాలని అధికారులను కోరామన్నారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలు రాజేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం షిండే ఆరోపించారు. శరద్ పవార్ కూతురు, లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలె ఆధ్వర్యంలో ఎన్సీపీ నేతలు శుక్రవారం ముంబై పోలీస్ చీఫ్ వివేక్ ఫన్సాల్కర్‌ను కలిసి, చర్యలు తీసుకోవాలని కోరారు. 'నరేంద్ర దభోల్కర్‌కు పట్టిన గతే శరద్ పవార్‌కు పడుతుంది' అంటూ సామాజిక మాధ్యమం ద్వారా వచ్చిన మెసేజీ స్క్రీన్ షాట్ ప్రింటవుట్లను ఆయనకు అందజేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి చర్య తీసుకుంటామని అధికారులు తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న నరేంద్ర దభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఇలా ఉండగా, శరద్ పవార్‌కు బెదిరింపు మెసేజీ పంపిన సౌరవ్ పింపాల్కర్ బీజేపీ మద్దతుదారని అతడి సోషల్ మీడియా ప్రొఫైల్‌ను బట్టి తెలుస్తోందని ఎన్సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ ఆరోపించారు. సిద్ధాంతపరమైన విభేదాలపై హుందాగా పోరాడాలే తప్ప, భావ ప్రకటన స్వేచ్ఛను ఈ విధంగా దుర్వినియోగం చేయరాదని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సంయమనం పాటించాలని, అందరూ ప్రశాంతంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఎన్సీపీ విజ్ఞప్తి చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం లౌకికవాదాన్ని ప్రోత్సహించి, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందో లేక దభోల్కర్ హంతకులను విడిచిపెడుతుందో లేదో వేచి చూస్తామని వ్యాఖ్యానించింది.

బెదిరింపులతో గొంతు నొక్కాలనుకోవడం భ్రమే: శరద్ పవార్

బెదిరింపులతో గొంతు నొక్కాలని ఎవరైనా అనుకుంటే అది భ్రమేనని శరద్ పవార్ వ్యాఖ్యానించారు. తనకు వచ్చిన బెదిరింపులపై ఆయన ఈ మేరకు స్పందించారు. మహారాష్ట్ర పోలీసులపై తనకు పూర్తి నమ్మకం ఉందని, అందుకే బెదిరింపులపై తాను భయపడటం లేదని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకోజాలదన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురి కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలో భద్రతా బలగాల దుస్తుల్లో వచ్చిన సాయుధులు ఖోకెన్ అనే గ్రామంలోకి ప్రవేశించి ముగ్గురిని కాల్చి చంపారు. జవాన్లు అక్కడికి వచ్చే సరికే వారు పరారయ్యారు. దుండగులు మెయిటీ వర్గం వారై ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటన అనంతరం మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్, ఆర్మీ ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఆర్మీ చేపట్టిన కూంబింగ్‌లో బుధవారం ఆటోమేటిక్, మోర్టార్లు, హ్యాండ్ గ్రనేడ్లు వంటివాటితో పాటు చిన్న ఆయుధాలు కలిపి 29 వరకు దొరకగా, గురువారం మరో 35 ఆయుధాలతోపాటు మందుగుండు సామగ్రిని కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. మే 3నుంచి కొనసాగుతున్న అల్లర్లలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

చెన్నైలో పట్టాలు తప్పిన జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని బేషిన్ బ్రిడ్జి యార్డ్ సమీపంలో జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. రెండు బోగీలు ట్రాక్ నుంచి కిందకు దిగాయి. ఆ సమయంలో రైలులో ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అధికారుల సమాచారం ప్రకారం.. జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ గురువారం అర్ధరాత్రి విజయవాడ నుంచి చెన్నైకి చేరుకుంది. ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులంతా వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం ఇదే రైలు విజయవాడకు బయలుదేరాల్సి ఉంది. శుభ్రం చేయడానికి సమీపంలోని బేషిన్ బ్రిడ్జి యార్డ్‌కు తీసుకెళ్తుండగా హఠాత్తుగా ఒక బోగీ పట్టాలు తప్పింది. వెంటనే మరో బోగీ పట్టాలు తప్పింది. ఈ రెండు బోగీలను రైల్వే సిబ్బంది మళ్లీ ట్రాక్‌పైకి చేర్చారు. అన్ని రకాల తనిఖీల అనంతరం శుక్రవారం ఉదయం మళ్లీ సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఉదయం 7.20 గంటలకు ఈ రైలు విజయవాడకు బయలుదేరి వెళ్లింది.

భూగోళం.. అగ్నిగుండం

- రికార్డు స్థాయికి చేరిన గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు
- వేగంగా వేడెక్కుతున్న భూమి
- 50 మంది సైంటిస్టుల ఉమ్మడి నివేదిక



లండన్: శిలాజ ఇంధనాల వాడకం, కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, ప్రకృతి విపత్తులు.. వీటి గురించి తరచుగా వింటూనే ఉన్నాం. అయినప్పటికీ ప్రపంచ దేశాలు నష్టనివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. ప్రమాదకరమైన గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారం గరిష్ట స్థాయికి చేరినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిఏటా వెలువడుతున్న గ్రీన్‌హౌజ్ వాయువులు 54 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌తో సమానమని తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా 50 మంది అగ్రశ్రేణి శాస్త్రవేత్తలు భూ ఉష్ణోగ్రతలపై విస్తృత అధ్యయనం నిర్వహించి, ఉమ్మడిగా నివేదిక విడుదల చేశారు. మానవ చర్యలు, గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారం భూతాపం, వాతావరణ మార్పులకు కారణమవుతున్నట్టు పేర్కొన్నారు. జీవజాలానికి ఇన్నాళ్లూ ఆవాసయోగ్యంగా ఉంటూ వస్తున్న భూగోళం క్రమంగా అగ్నిగుండంగా మారిపోతోందని హెచ్చరించారు. సైంటిస్టులు తమ నివేదికలో ఇంకా ఏం చెప్పారంటే..

- 1800వ సంవత్సరంతో పోలిస్తే భూఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పుడు 1.14 డిగ్రీలు పెరిగాయి.
- ఉష్ణోగ్రత ప్రతి పదేళ్లకు రికార్డు స్థాయిలో 0.2 డిగ్రీల చొప్పున పెరుగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూతాపం మానవాళిని కబళించడం ఖాయం.
- గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని యథాతథంగా కొనసాగిస్తే భూ ఉపరితల ఉష్ణోగ్రత సమీప భవిష్యత్తులోనే 2 డిగ్రీలు పెరిగిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం.
- పారిశ్రామిక విప్లవం ముందునాటి సగటు కంటే ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీలకు మించి పెరగనివ్వరాదన్న పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని సాధించడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలి. మునుపెన్నడూ లేనిస్థాయిలో తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలి.
- భూతాపం ముప్పు నుంచి మానవళి బయటపడాలంటే 2035 నాటికి ప్రపంచదేశాలు తమ గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను 60 శాతానికి తగ్గించుకోవాలని సైంటిస్టు పియర్స్ ఫాస్టర్ చెప్పారు.

సరస్వతిని చంపలేదు.. ఆత్మహత్య చేసుకుంది

- దారుణ హత్య కేసు నిందితుడు మనోజ్ సానె వెల్లడి
- వారిది సహజీవనం కాదు, పెళ్లేనంటున్న ముంబై పోలీసులు



ముంబై: ముంబైలో మహిళ దారుణ హత్య ఘటనలో నిందితుడు మనోజ్ సానె(56) విచారణ సందర్భంగా పోలీసులకు పలు విషయాలు వెల్లడించాడు. తనతోపాటు ఉంటున్న సరస్వతీ వైద్య(36) ఈ నెల 3న ఉదయం విషం తాగి ఆత్మహత్య చేసుకుందని మనోజ్ చెప్పాడు. 'ఆమె నోటి నుంచి తెల్లటి నురగ వచ్చింది. అయితే ఆ నేరం నాపైకి వస్తుందని భయంతోనే మృతదేహాన్ని ముక్కలుగా చేసి, పారేశాను. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా. నేను హెచ్ఐవీ పాజిటివ్ అయినందున ఆమెతో ఎటువంటి శారీరక సంబంధం పెట్టుకోలేదు' అని పోలీసులకు తెలిపాడు. అయితే, మనోజ్ తమను తప్పుదోవ పట్టించేందుకు అవకాశాలున్నాయని పోలీసులు అంటున్నారు. అతడు చెప్పిన దాంట్లో నిజానిజాలను కనుగొనేందుకు విచారణ ముమ్మరం చేశారు. ఈ నేరం వెనుక కారణాలు స్పష్టంగా తెలియడం లేదని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. మనోజ్ సానెపై పోలీసులు హత్య, సాక్ష్యాలను నాశనం చేసిన నేరాలపై కేసులు నమోదు చేశారు. అతడికి కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది.

సరస్వతి తోబుట్టువులు ఏం చెప్పారంటే..

మృతురాలు సరస్వతి వైద్య ముగ్గురు సోదరీమణులను కూడా పోలీసులు ప్రశ్నించారు. వారు చెప్పిందాన్ని బట్టి..మనోజ్ సానె, సరస్వతీ వైద్యది సహజీవనం కాదు..వారు భార్యాభర్తలు. ఇద్దరూ గుళ్లో పెళ్లి చేసుకున్నారు. అయితే, వయస్సు రీత్యా అంతరం ఎక్కువగా ఉండటంతో తన తోబుట్టువులకు మాత్రమే ఈ విషయం చెప్పారు. ఇతరులకు తెలియకుండా రహస్యంగా ఉంచారు. సరస్వతి, తోబుట్టువులు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి వారిని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో అనాథాశ్రమంలో పెరిగారు. 18 ఏళ్లు నిండాక సరస్వతి ముంబైకి వచ్చింది. సరస్వతికి సేల్స్‌పర్సన్ ఉద్యోగం ఇప్పించింది మనోజ్ సానెనే. ముంబై శివారు నయానగర్ ఏరియాలో ఓ అపార్టుమెంట్ ఫ్లాట్‌లో మనోజ్ సానె, సరస్వతి మూడేళ్లుగా ఉంటున్నారు. ఈ నెల 4న సరస్వతి చనిపోగా, ఆ ఫ్లాట్ నుంచి భరించలేని దుర్గంధం వస్తోందంటూ 7న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూసేసరికి మహిళ శరీర భాగాలు కనిపించాయి. కొన్నిటిని కుక్కర్‌లో ఉడికించి, కొన్ని వేయించినట్లుగా పోలీసులు గుర్తించారు. మరికొన్ని శరీర భాగాలను మురుగు కాల్వలో పడేయగా, కొన్నిటిని వీధి కుక్కలకు ఆహారంగా వేసినట్లు తెలిసింది. ఈ భయానక ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన శ్రద్ధావాకర్ దారుణ హత్య కేసును గుర్తుకు తెచ్చింది.

పాఠ్యపుస్తకాల సలహాదారులుగా కొనసాగలేం

ఎన్సీఈఆర్‌టీకి సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ లేఖ

న్యూఢిల్లీ: నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్సీఈఆర్‌టీ) పాఠ్య పుస్తకాల సిలబస్‌లో కోతలపై ప్రధాన సలహాదారులుగా వ్యవహరిస్తున్న సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 9 నుంచి 12వ తరగతి వరకు పొలిటికల్ సైన్స్ పాఠ్య పుస్తకాల సిలబస్ నుంచి కొన్ని అంశాల తొలగింపు ఏకపక్షంగా, అహేతుకంగా ఉందని వారు పేర్కొన్నారు. హేతుబద్ధీకరణ అంటూ పాఠ్యాంశాలను వికృతీకరించి, వాటిని విద్యాపరంగా పనికిరానివిగా మార్చారని ఆరోపించారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, అభిప్రాయం తెలుసుకోకుండా ఎన్సీఈఆర్‌టీ తీసుకున్న ఈ చర్య ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఆయా పాఠ్యపుస్తకాల్లో ప్రధాన సలహాదారుల జాబితాలో ఉన్న తమ పేర్లను వెంటనే తొలగించాలని కోరుతూ ఎన్సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ సక్లానీకి లేఖ రాశారు. మహాత్మాగాంధీ మరణం దేశంలో మత సామరస్యతపై చూపిన సానుకూల ప్రభావం, ఆర్ఎస్ఎస్‌పై కొంతకాలం నిషేధం, 2002లో గుజరాత్ అల్లర్లు వంటి విషయాలను సిలబస్ నుంచి తొలగిస్తూ గత నెలలో ఎన్సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. 2006–07లో ముద్రించిన ఎన్సీఈఆర్‌టీ 9 నుంచి 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాలకు వీరిద్దరూ ప్రధాన సలహాదారులుగా ఉన్నారు. పల్షికర్, యోగేంద్ర యాదవ్ రాజనీతి శాస్త్ర నిపుణులు. కాగా, యోగేంద్ర యాదవ్ స్వరాజ్ ఇండియా అనే సంస్థను నడుపుతున్నారు.

విదేశాల్లోని భారతీయులకు ఓటు హక్కు!

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసించే భారతీయులకు సైతం మన దేశంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించాల్సిన సమయం వచ్చిందని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ చెప్పారు. ఇందుకోసం ఈ–పోస్టల్ బ్యాలెట్ వంటి టెక్నాలజీ ఆధారిత ఆధునిక విధానాలను ఉపయోగించాలని అన్నారు. మన దేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు. రాజీవ్ కుమార్ శుక్రవారం నిర్వాచన్ సదన్‌లో 'భారత్–ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి, భారత ఎన్నికల సంఘం పాత్ర' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో 2022 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారుల(ట్రైనీలు)ను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవలి కాలంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఫలితాలపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, కుట్రపూరిత ప్రచారం సాగుతున్నాయని అన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులకు ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్(ఈటీబీపీఎస్) ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం గతంలోనే ప్రతిపాదించింది. విదేశాల్లోని భారతీయుల్లో 1.15 లక్షల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు అంచనా.

శవాలు భద్రపర్చిన బహనాగ పాఠశాల భవనం కూల్చివేత

భువనేశ్వర్: ఒడిశాలో 65 సంవత్సరాల చరిత్ర కలిగిన బహనాగ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం కూల్చివేత పనులను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘోర రైలు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ దుర్ఘటనలో మరణించిన వారి మృతదేహాలను ఇదే పాఠశాలలో భద్రపర్చారు. తాత్కాలిక మార్చురీగా ఉపయోగించారు. శవాలను భద్రపర్చిన పాఠశాలలో తరగతులకు హాజరయ్యేందుకు విద్యార్థులు ఇష్టపడడం లేదని, అందుకే కూల్చివేయాలని నిర్ణయించినట్లు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తెలియజేసింది. అంతేకాకుండా ఈ స్కూల్ భవనం చాలా పాతదని, శిథిలావస్థకు చేరిందని అన్నారు. నేలమట్టం చేయాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా డిమాండ్ చేశారని వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంబంధిత అధికారులతో చర్చించారు. బహనాగ స్కూల్ భవనం కూల్చివేతకు అనుమతిచ్చారు. దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆధునిక వసతులతో మోడ్రన్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ నెల 2న జరిగిన రైలు ప్రమాదంలో 288 మంది ప్రయాణికులు మరణించిన సంగతి తెలిసిందే.

కోర్టు మార్షల్‌కు సమయం దగ్గరపడింది

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్



ఇస్లామాబాద్: సైనిక న్యాయస్థానంలో తనపై విచారణ జరిపేందుకు సమయం దగ్గరపడిందని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. మే 9వ తేదీన ఇమ్రాన్ అరెస్టు సందర్భంగా జరిగిన అల్లర్లకు కుట్ర పన్నిన వారిని మిలటరీ కోర్టుల్లో విచారణ జరిపిస్తామంటూ ఆర్మీ ప్రకటించడం, ఆ హింసాత్మక ఘటనలకు సూత్రధారి ఇమ్రానే అంటూ గురువారం మంత్రి సనావుల్లా పేర్కొన్న నేపథ్యంలో ఇమ్రాన్ ఈ వ్యాఖ్య చేశారు. తనపై నమోదైన 10 కేసుల విచారణకు గాను గురువారం ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్..అనంతరం మీడియాతో మాట్లాడారు. 'మిలటరీ కోర్టులో పౌర విచారణ, చాలా అన్యాయం. ఇది దేశంలో ప్రజాస్వామ్యానికి, న్యాయానికి ముగింపు' అని ఆయన పేర్కొన్నారు. తనపై నమోదైన 150 కేసులు బోగస్‌వేనని తెలిపారు. పౌర న్యాయస్థానాల్లో ఇవి నిలవవు కాబట్టే కోర్టు మార్షల్‌కు నిర్ణయించారని ఆరోపించారు. మే 9 నాటి ఘటనలపై ఇప్పటికే మిలటరీ కోర్టుల్లో విచారణ మొదలైంది. ఇలా ఉండగా, ఇమ్రాన్ ఖాన్‌పై అసంతృప్తితో ఉన్న పాకిస్తాన్–తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ)కు చెందిన కొందరు నేతలు వేరుకుంపటి పెట్టుకున్నారు. బడా చక్కెర వ్యాపారి, ఇమ్రాన్ సన్నిహితుడిగా పేరున్న జహంగీర్ ఖాన్ తరీన్ నేతృత్వంలో గురువారం పీటీఐ నేతలు ఇస్తెఖామ్–ఇ–పాకిస్తాన్(ఐపీపీ) పేరుతో కొత్త పార్టీని ప్రకటించారు.



కోటిన్నర కొట్టేశారు..

సైబర్ నేరగాళ్లు పెట్టుబడి, ట్రేడింగ్‌ల పేరుతో నగరవాసులను నమ్మించి నట్టేట ముంచుతున్నారు. దాదాపు కోటిన్నర రూపాయల వరకు ఇటీవల కొట్టేశారు. -8లో



సోదరితో గొడవ పడుతున్నాడని..

సోదరితో తరుచూ గొడవ పడుతున్నాడని ఓ యువకుడు తన బావను గొంతు కోసి హత్య చేశాడు. ఈ సంఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. -8లో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
39.7°	27.0°





చేపప్రసాదానికి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు తరలివచ్చిన జనం

80 వేల మందికి పైనే..

చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం

- కిటకిటలాడిన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన జనం



బాలుడికి చేప ప్రసాదం వేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: ఆస్తమా రోగులు ఎంతగానో ఎదురుచూసే చేప ప్రసాదం పంపిణీ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. తొలిరోజు రాత్రి పొద్దు పోయే వరకు దాదాపు 80 వేల మందికి చేప ప్రసాదం ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకు పంపిణీ ఉంటుందన్నారు. కాగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మొదట బత్తిని కుటుంబ సభ్యుల చేపప్రసాదం పంపిణీని శుక్రవారం ఉదయం 8 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా చేప ప్రసాదం వేసి ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆస్తమా రోగులు, సామాన్య ప్రజలు కూడా వేలాదిమంది తరలివచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్, మత్స్యశాఖ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వాటర్‌బోర్డు, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు పలు శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు పలు శాఖల ఉన్నతాధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఉండి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతకు ముందు దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలోనూ మొదట చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు.

మంత్రి స్వయంగా పర్యవేక్షణ

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా శుక్రవారం రోజంతా పర్యవేక్షించారు. ఉదయం ప్రారంభించిన మంత్రి రాత్రి వరకు పలుమార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా



చర్యలు చేపట్టారు. వాటర్‌బోర్డు, బద్రి విశాల్ వంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచినీరు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ఇక నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, నగర కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దాదాపు 90 వేల చేప పిల్లలను విక్రయించినట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాథోడ్ తెలిపారు. శనివారం ఉదయం వరకు ప్రజలకు అవసరమైనన్ని చేపపిల్లలను అందుబాటులో ఉంచామన్నారు. రాత్రంతా చేపమందు ప్రసాదం పంపిణీ కొనసాగుతుందని, చేపపిల్లల విక్రయం కూడా కొనసాగుతుందన్నారు.

32 కేంద్రాల ద్వారా పంపిణీ

చేప ప్రసాదాన్ని 32 కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. బత్తిని కుటుంబానికి చెందిన 250 మంది కుటుంబ సభ్యులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నాయకులు వాలంటీర్లుగా సేవలందించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్వినిమార్గం, మాజీ కార్యదర్శి వినయ్‌కుమార్ ముదిరాజ్‌తో పాటు పలువురు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు చేపప్రసాదం పంపిణీకి చేయూతనందించారు. దాదాపు 1000 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టారు. 75 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా నిర్వహించారు.



ఆర్టీసీలో కాలనీ ఆఫీసర్లు

ప్రయాణికులు, బస్సుల నిర్వహణకు నడుమ సమన్వయం

- ఫిర్యాదులు, సలహాలు, సూచనలపై సత్వర చర్యలు
- ఆర్టీసీ ఉద్యోగులే కాలనీ ఆఫీసర్లు...
- 80 కాలనీల్లో ఏర్పాటు
- దశలవారీగా అన్ని ప్రాంతాలకు విస్తరణ



రెతిఫైల్ బస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఆర్ఎం వెంకన్న

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ మరో వినూత్నమైన పథకానికి శ్రీకారం చుట్టింది. సిటీ బస్సులను ప్రయాణికులకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు మెరుగైన ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు వినూత్నంగా 'కాలనీ ఆఫీసర్‌లు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఆర్టీసీలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులే కాలనీ ఆఫీసర్‌లుగా వ్యవహరిస్తారు. తాము నివాసం ఉంటున్న కాలనీలతో పాటు నచ్చిన ప్రాంతాలను ఎంపిక చేసుకొని అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సుల నిర్వహణ ఉండేవిధంగా అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తారు. ప్రయాణికులకు, ఆర్టీసీ అధికారులకు మధ్య కాలనీ ఆఫీసర్లు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం సికింద్రాబాద్ రీజియన్‌లోని 80 కాలనీల్లో ఈ తరహా కాలనీ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజర్ వెంకన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రెతిఫైల్ బస్‌స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించడంతో పాటు ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తారు. అంతేకాకుండా ఆర్టీసీ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ యంత్రాంగం పని చేస్తుందని వెంకన్న పేర్కొన్నారు.

సమన్వయకర్తలుగా విధినిర్వహణ..

మెట్రో రైళ్లు అందుబాటులోలేని వందలాది కాలనీలు, బస్తీలు, శివారు ప్రాంతాలు సిటీ బస్సులపైనే ఆధారపడి ఉన్నాయి. గతంలో ఎల్‌బీనగర్ నుంచి పటాన్‌చెరు వరకు నేరుగా సిటీ బస్సులు నడిచేవి. ఆ రూట్‌లో మెట్రో అందుబాటులోకి వచ్చిన తరువాత సిటీ బస్సులకు డిమాండ్ తగ్గింది. అదేవిధంగా ఉప్పల్, నాగోల్, తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, అమీర్‌పేట్ నుంచి ఏకంగా రాయదుర్గం వరకు మెట్రో రావడంతో ఈ రూట్‌లో బస్సుల సంఖ్యను తగ్గించి ఇతర ప్రాంతాలకు తరలించారు.కాలనీలకు బస్సులు నడుస్తున్నప్పటికీ సకాలంలో అందుబాటులో లేకపోవడం, ట్రిప్పుల రద్దు, కాలనీల విస్తరణకు అనుగుణంగా బస్సుల రూట్‌లను పొడిగించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఈ క్రమంలో కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీ ఆఫీసర్లు నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆర్ఎం చెప్పారు.

పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు..

ఇటీవల కాలంలో ఆర్టీసీ అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టింది. వివిధ రకాల టిక్కెట్‌లలో రాయితీ సదుపాయాన్ని కల్పించింది. కానీ ఈ సదుపాయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తగిన యంత్రాంగం లేదు. ప్రస్తుతం కాలనీ ఆఫీసర్లు ఆర్టీసీ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరిస్తారు. సీనియర్ సిటీజన్‌లు,మహిళలు, విద్యార్థులు, దివ్యాంగులకు ఇచ్చే రాయితీలపైన అవగాహన కల్పిస్తారు. దివ్యాంగుల కోసం బస్‌పాస్ మేళాలు ఏర్పాటు చేస్తున్నారు.విద్యార్థులకు ఒకస్థాయి వరకు ఉచిత బస్‌పాస్ సదుపాయం ఉంది. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలకు పరిచయం చేసేందుకు కాలనీ ఆఫీసర్లు పని చేస్తారు.

రెతిఫైల్ బస్‌స్టేషన్‌లో ప్రారంభం..

శుక్రవారం రాణిగంజ్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ గంగారెడ్డి, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకన్నలు ఈ పథకాన్ని ప్రారంభించారు. కాలనీ ఆఫీసర్‌ల విధివిధానాలపైన ఏర్పాటు చేసిన కిట్‌లను అందజేశారు. ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, వారి అవసరాలను వెంటనే డిపోమేనేజర్‌లకు తెలియజేయాలని వెంకన్న ఈ సందర్భంగా కాలనీ ఆఫీసర్లకు ఉద్బోధించారు.

కొండెక్కిన కోడి..

- చికెన్ ధరలకు రెక్కలు
- కిలో చికెన్ రూ.310 వరకు...
- రికార్డు స్థాయిలో ధరల నమోదు

సాక్షి,సిటీ బ్యూరో : కోడి కొండెక్కింది. రికార్డు స్థాయిలో చికెన్ ధర పలుకుతోంది. మండు టెండలో సాధారణంగా తగ్గే చికెన్ ధర ఈసారి ఏకంగా కేజీ రూ.310 చేరింది. గణనీయంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో కోళ్లు చనిపోవడం.., డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం, దాణా ధరలు పెరగడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. దీనికి తోడు గత రెండు రోజులుగా మృగశిర కార్తె నేపథ్యంలో చికెన్‌కు గిరాకీ పెరగడం కూడా రేట్లు పైకి ఎగబాకడానికి కారణంగా కనిపిస్తోంది. వేసవి కావడంతో ఫంక్షన్లు, వివాహాలు పెరిగిపోవడంతో చికెన్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. శుక్రవారం రిటైల్ మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ.310 పలుకగా..కాలనీలు, బస్తీల్లో ఈ రేట్లు మరింత మండిపోతున్నాయి. ఇక స్కిన్‌తో ఉన్న చికెన్ కూడా రూ.260–280 వరకు అమ్ముతున్నారు. గత వారం రోజుల్లో కిలో చికెన్ ధర రూ.50 నుంచి 60 వరకు పెరిగింది. లైవ్ బర్డ్ కిలో రూ.188 వరకు విక్రయించారు. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సగటున రోజుకు 5 లక్షల నుంచి 7 లక్షల కేజీల చికెన్ విక్రయిస్తుండగా.. గత ఆదివారం ఏకంగా 50 లక్షల కేజీల చికెన్ అమ్మకాలు జరిగినట్లు స్టార్ బ్రాయిలర్ అండ్ లేయర్ హోల్‌సేల్ డీలర్స్ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్ అఫ్రోజ్ 'సాక్షి'కి తెలిపారు.

ఎవరు ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు

- కారు స్టీరింగ్ మా చేతుల్లో లేదు
- అసదుద్దీన్ ఓవైసీ...

మోతీనగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉర్దూకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ఎక్కడ ఉర్దూ పోస్టర్లు, ప్రకటనలు లేవని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. గురువారం రాత్రి అల్లాపూర్‌లో నిర్వహించిన గెల్సా యాదే పక్రే మిలాత్ మౌలానా అబ్దుల్ ఓవైసీ సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్సిటీలు, పెద్ద విద్యా సంస్థల్లో ముస్లింలకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించారు. కారు స్టీరింగ్ తమ చేతిలో ఉందనే వాళ్లు దీనిని గమనించాలని సూచించారు. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ప్రజల ఆదరణతో తామే మళ్లీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కొందరు నాయకులు విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎంఐఎం పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అనంతరం 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు పతకాలు, మెమొంటోలు అందజేశారు.


మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

జమ చేస్తాడు.. దోచేస్తాడు

నాగోలు: ఏటీఎంలో డబ్బులు జమ చేసి, ఆ తర్వాత కొద్ది గంటల్లోనే తనకు తెలిసిన పాస్‌వర్డ్‌తో అందులోంచి నగదు దోచేస్తున్న వ్యక్తిపై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లిలో సెక్యూర్ వాల్యూస్ సర్వీసెస్ సంస్థలో శ్రీశైలం అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం కేంద్రాల్లో నగదు లోడ్ చేసే బాధ్యతలు నిర్వర్తిస్తుంది. అతడి వద్ద 50 మంది పని చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంలో డబ్బులు లోడ్ చేసేందుకు ప్రణయ్ అనే వ్యక్తితో పాటు మరొకరిని నియమించారు. వరంగల్ జిల్లాకు చెందిన ప్రణయ్ ప్రస్తుతం లోతుకుంటలో నివాసముంటున్నాడు. ఏటీఎంలో నిరంతరం డబ్బులు జమ చేస్తున్న ప్రణయ్ వాటిని కాజేయాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా ఒక ఏటీఎంకు చెందిన పాస్‌వర్డ్ ద్వారా నగదు జమ చేసే అతను ఆ తర్వాత కొద్ది సేపటికి మళ్లీ అక్కడికి వచ్చి తన వద్ద ఉన్న పాస్‌వర్డ్‌తో నగదు చోరీ చేసేవాడు. తరచూ ఏటీఎంలో డబ్బులు మాయమవుతున్నట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు ఆయా ఏటీఎంలలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ప్రణయ్‌ని నిందితుడిగా గుర్తించి సదరు సంస్థకు సమాచారం అందించారు. దీంతో సూపర్‌వైజర్ శ్రీశైలం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు ప్రణయ్‌ను ఈ నెల 2న అరెస్టు చేశారు. అతను మీర్‌పేట్, ఉప్పల్, మేడిపల్లి, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని పలు ఐసీఐసీ ఏటీఎంల నుంచి రూ. 65 లక్షలు కాజేసినట్లు గుర్తించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. ఆనంద్‌నగర్ ఏటీఎం నుంచి కూడా అతను దాదాపు రూ. 11 లక్షలు కాజేసినట్లు వెల్లడైనందున అతడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి విచారించనున్నట్లు ఎల్‌బీనగర్ పోలీసులు పేర్కొన్నారు.

'స్టార్ మా'లో సెలబ్రిటీ కపుల్స్ డ్యాన్స్ షో

సాక్షి, సిటీబ్యూరో: స్టార్ మా చానెల్‌లో 'నీతోనే డ్యాన్స్' పేరుతో సెలబ్రిటీ కపుల్స్‌తో కూడిన డ్యాన్స్ షో ఆదివారం నుంచి ప్రసారం కానుంది. ఇందుకోసం పలువురు భార్యాభర్తలైన టీవీ నటులు ప్రత్యేకంగా డ్యాన్స్ నేర్చుకున్నారు. మొత్తం 8 జంటలు పోటీ పడుతున్న ఈ కాంటెస్ట్ పోటాపోటీగా సాగనుంది. తమది వైవాహిక బంధం మాత్రమే కాదు విజయాల పథం కూడా అని నిరూపించేందుకు ఈ జంటలు..నగరంలోని శ్రీనగర్ కాలనీ, బంజారాహిల్స్, మణికొండ...తదితర ప్రాంతాల్లోని నృత్య శిక్షణా సంస్థల్లో ప్రముఖ కొరియోగ్రాఫర్ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

'ఉస్మానియా' ఉద్యోగుల జీతాలు స్వాహా

- దైరతుల్ మారిఫిల్ ఉస్మానియాలో ఉదంతం
- రూ.1.12 కోట్లు కాజేసిన ముగ్గురు ఉద్యోగులు
- తొలుత ఓయూ ఠాణాలో వీరిపై కేసు నమోదు
- దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ
- రీ–రిజిస్టర్ చేసిన రంగంలోకి దిగిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలోని దైరతుల్ మారిఫిల్ ఉస్మానియా విభాగంలో జీతాల కుంభకోణం చోటు చేసుకుంది. సిబ్బందికి ఇవ్వాల్సిన రూ.1.12 కోట్ల వేతనాల సొమ్మును ముగ్గురు ఇంటి దొంగలు కాజేశారు. ఆలస్యంగా ఈ విషయం గుర్తించిన రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు ఓయూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా దర్యాప్తు బాధ్యతలను సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు (సీసీఎస్) అప్పగిస్తూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఈ కేసును రీ–రిజిస్టర్ చేసిన సీసీఎస్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దైరతుల్ మారిఫిల్ ఉస్మానియా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషల్లోని సాహిత్యంపై పరిశోధన, తర్జుమా బాధ్యతలను నిర్వర్తిస్తుంది. ఈ విభాగంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు తమకు కొన్ని నెలలుగా జీతాలు అందట్లేదంటూ సంబంధిత విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వర్సిటీ ఫైనాన్స్ విభాగంలో ఆరా తీశారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాము పంపిన ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అక్కడి సిబ్బంది స్పష్టం చేశారు. దీంతో రిజిస్ట్రార్‌కు దైరతుల్ విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ మెహజబీన్ అక్తర్, సూపరింటెండెంట్ సయ్యద్ సయీదుద్దీన్, అకౌంటెంట్ మహ్మద్ జహీరుద్దీన్ పాత్రలపై అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. దీంతో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జీతాలు సహా వివిధ ఖర్చులకు సంబంధించి దైరతుల్ ఖాతాలో ప్రభుత్వ నిధుల నుంచి 2021 సెప్టెంబర్ 29న రూ.1,12,50,000 జమయ్యాయి. అదే ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వివిధ దఫాల్లో ఆ మొత్తాన్ని కాజేసిన ఆ ముగ్గురూ సొంతం చేసుకున్నారని తేలింది. దైరతుల్ నిధులను డ్రా చేసే అధికారం ఉన్న డైరెక్టర్ అప్పటి డైరెక్టర్ అక్తర్, సూపరింటెండెంట్, అకౌంటెంట్ కుమ్మక్కై ఈ మొత్తం స్వాహా చేసినట్లు తేల్చారు. దీనిపై ఓయూ రిజిస్ట్రార్ ఈ ఏడాది జనవరిలోనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీలోని 406, 420 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ కేసుకు ఉన్న ప్రాధాన్యం, స్వాహా చేసిన మొత్తం తదితరాలను పరిగణలోకి తీసుకున్న సీపీ దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. కేసు ఫైల్ అందుకున్న సీసీఎస్ పోలీసులు గత నెల 30న అవే సెక్షన్ల కింద కేసు రీ–రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భవనంపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య


సౌందర్య (ఫైల్)

శంషాబాద్: మానసిక ఒత్తిడికి గురైన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆరంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సౌందర్య (28) భర్త అభినవ్ కుటుంబ సభ్యులతో కలిసి కొండాపూర్‌లో నివాసముంటోంది. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లాల్సిన సమయంలో భర్త తండ్రి (మామ)కు ఫోన్ చేసి తాను హైదరాబాద్‌ను విడిచి దూరంగా వెళుతున్నానని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికి మళ్లీ ఫోన్ చేసి శంషాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు, పోలీసులు ఆస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నిర్మాత బెల్లంకొండ కారు అద్దాలు ధ్వంసం

ఖరీదైన మద్యం బాటిళ్లు చోరీ


మద్యం సీసాలు చోరీకి గురైన కారు

బంజారాహిల్స్: ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ బెంజికారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న ఖరీదైన మద్యం సీసాలతో పాటు నగదు తస్కరించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం 70లోని జర్నలిస్టు కాలనీలో ఉంటున్న నిర్మాత బెల్లంకొండ సురేష్ తన ఇంటి ముందు టీఎస్ 09 ఈసీ 3033 నెంబర్ బెంజి కారును పార్కింగ్ చేశాడు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి కారు అద్దాలు ధ్వంసమై ఉన్నాయి. అందులో ఉండాల్సిన 11 రాయల్ సెల్యూట్ లిక్కర్ బాటిళ్లు(ఒక్క బాటిల్ ధర రూ. 28 వేలు), రూ. 50 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు డయల్ 100కు ఫిర్యాదు చేయగా జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బెంజి కారు వెనుకాల అద్దం పగలగొట్టిన ఆగంతకులు డిక్కీలో ఉన్న మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కారులో మద్యం బాటిళ్లు ఉన్నట్లు తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి వద్ద అనుమతి లేకుండా ఆరు కంటే ఎక్కువ మద్యం సీసాలు ఉండకూడదు. అయితే నిర్మాత బెల్లంకొండ సురేష్ కారులో 11 మద్యం సీసాలు ఎందుకు ఉన్నాయన్న దానిపై ఆరా తీస్తున్నారు. డయల్ 100కు ఫోన్ చేసినప్పుడు 11 సీసాలు చోరీకి గురైనట్లు చెప్పగా ఫిర్యాదులో మాత్రం ఐదు బాటిళ్లు చోరీ అయ్యాయంటూ మాట మార్చిన విషయాన్ని పోలీసులు గమనించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోదరితో గొడవ పడుతున్నాడని..

బావ గొంతు కోసి హత్య చేసిన బామ్మర్ది


మహ్మద్ నయీం (ఫైల్)

సంతోష్‌నగర్: సోదరితో తరుచూ గొడవ పడుతున్నాడని ఓ యువకుడు తన బావను గొంతు కోసి హత్య చేసిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్ జమాల్ కాలనీకి చెందిన మహ్మద్ నయీం (33), సబా బేగంకు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా గత కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నయీం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ విషయమై చర్చిస్తున్నారు. ఇందులో భాగంగా సబా బేగం తన సోదరుడు సులేమాన్ అహ్మద్ అలియాస్ సోఫీకి ఫోన్ చేసి సమాచారం అందించింది. దీంతో మధ్యాహ్నం మేనమామ రౌషన్‌తో కలిసి ఇంటికి వచ్చిన సులేమాన్ కత్తితో తన బావ మహ్మద్ నయీం గొంతు కోసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ రమేశ్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నయీం సోదరుడు మహ్మద్ హకీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియన్ అరెస్టు


నిందితుడు అరింజ్

అమీర్‌పేట: మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న నైజీరియన్ దేశస్తుడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట డివిజన్ బీకేగూడ పార్కు గ్రంథాలయం సమీపంలో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు నైజీరియాకు చెందిన అరింజ్ రాబిన్‌సన్ అలియాస్ అరింజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 2 గ్రాముల కొకైన్, 11 గ్రాములు ఎండీఎంఏ మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన అరింజ్ 2013లో గోవాకు వచ్చి ఓ ఫుడ్ కోర్టులో పనిచేసేవాడు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన అతను హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత మాదక ద్రవ్యాలను విక్రయిస్తుండగా 2022 డిసెంబర్‌లో గోవా పోలీసులు మరో సారి అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలులో అతడికి డ్రగ్స్ సరఫరాదారుడైన ఉచే జోయ్ ఒకాఫర్ అలియాస్ ఉచేతో పరిచయం ఏర్పడింది. తాను సరఫరా చేసే మాదవ ద్రవ్యాలను విక్రయిస్తే కమీషన్ ఇస్తానని చెప్పడంతో జైలు నుంచి బయటికి వచ్చాక అరింజ్ దేశ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం బీకేగూడ వద్ద కె.వెంకటనారాయణ, వర్మ అనే వ్యక్తులకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి మాదక ద్రవ్యాలతో పాటు వెయింగ్ మెషిన్, ప్యాకింగ్ వస్తువులు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులతో పాటు డ్రగ్స్ సరఫరా చేసిన ఉచే జోయ్, ఫ్రాంక్లిన్, చిమ్‌జేలు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాష్ట్రంలో ప్రగతి పథంలో పారిశ్రామిక రంగం

ఎన్‌ఐసీ డైరెక్టర్ కార్తికేయ



సాక్షి, సిటీబ్యూరో: పారిశ్రామిక రంగంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని, మరింత అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు, నిర్ణయాలు తీసుకోవడానికి భారత ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఐసీ) నిబద్ధతతో పనిచేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ కార్తికేయ సిన్హా అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సంస్థ బ్రాంచ్‌ల కార్యక్రమాల సమీక్ష కోసం శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన వివిధ పారిశ్రామిక సంస్థల సమావేశంలో డైరెక్టర్ కార్తికేయ సిన్హా కార్యక్రమాల విధివిధానాలను వివరించారు. సమావేశంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్, ద ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లగు ఉద్యోగ్ భారతి, జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్, బాలానగర్ మైక్రో అండ్ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఉభయ రాష్ట్రాల్లోని చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జోనల్ హెడ్ కె. శ్రీనివాస్, సీనియర్ బ్రాంచ్ మానేజర్ ఎస్. సురేష్, వీరభద్రరావు, సోమశేఖర్, అశ్విని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటిన్నర కొట్టేశారు..

- బంగారం ట్రేడింగ్ పేరుతో టోకరా
- ఉన్నదంతా ఊడ్చేసి, వేధింపులు
- రైల్వే ఇన్‌స్ట్రక్టర్ నుంచి రూ.73లక్షలు
- యూట్యూబ్ లైక్స్‌లో రూ.70లక్షలు
- మరో ఇద్దరి నుంచి రూ.10లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు పెట్టుబడి, ట్రేడింగ్‌ల పేరుతో నగరవాసులను నమ్మించి నట్టేట ముంచుతున్నారు. శుక్రవారం నగరానికి చెందిన పలువురు వ్యక్తులు భారీగా మోసపోయి న్యాయం కావాలంటూ సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సౌత్‌సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ జోన్‌లో రైల్వే ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న అధికారికి టెలిగ్రామ్ ద్వారా ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. 'గోల్డ్ షార్ట్ టర్మ్ ట్రేడింగ్' చేస్తుంటానంటూ మాట కలిపాడు. తొలుత రూ.50వేలతో గోల్డ్ ట్రేడింగ్ చేస్తే ఒకే రోజులో రూ.2లక్షలు లాభం పొందొచ్చన్నారు. తొలిసారి సదరు అధికారికి రూ.2 లక్షలు లాభం ఇచ్చి నమ్మకాన్ని కలిగించారు. ఆ తర్వాత అత్యాశకు పోయిన అతడి నుంచి అందిన కాడికి దోచేశారు. పలు దఫాలుగా రూ.73లక్షలు ట్రేడింగ్ చేపించి ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా రూ.73లక్షలు రావాలంటే టాస్కులు అధిగమించాలని మరిన్ని లక్షలు పెట్టాలంటూ ఒత్తిడి చేయడంతో పోలీసులను ఆశ్రయించాడు.

అమీర్‌పేటకు చెందిన మరో వ్యక్తికి యూట్యూబ్ లైక్స్, కామెంట్, షేర్, సబ్‌స్క్రిప్షన్ చేస్తే ప్రతిరోజూ రూ.30వేల నుంచి రూ.50వేలు సంపాదించొచ్చని మరో వ్యక్తి వల వేశాడు. ఖాళీగా ఉంటూ ఫోన్ ద్వారానే కదా అని ఆశపడ్డ అతను లైక్స్, షేర్, సబ్‌స్క్రిప్షన్, కామెంట్‌లు చేశాడు. ఇందుకు రెండు పర్యాయాలు డబ్బు ఇచ్చారు. నమ్మకం కలగడంతో ఆ తర్వాత 'క్యూ కాయిన్ సిటీ డాట్ టాప్' అనే యాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయించారు. వారు చెప్పిన విధంగా రూ.70లక్షలు పెట్టి ఒక్క రూపాయి కూడా లాభం పొందలేదు. ఇదే తరహాలో మోసపోయిన మరో ఇద్దరు కూడా సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు.

సంక్షేమ రారాజు కేసీఆర్

ఎమ్మెల్యే దానం నాగేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేందర్

బంజారాహిల్స్: గత ప్రభుత్వాల హయాంలో రూ.100 కోట్లు మంజూరు కావాలంటే ఎన్నో ఇబ్బందులు పొడాల్సి వచ్చేదని, పాలసీ మ్యాటర్ అని తిప్పేవారని, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజల కోసం వేలాది కోట్లను మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బంజారాహిల్స్‌రోడ్ నం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దానం నాగేందర్ మాట్లాడుతూ, తాజాగా బీసీ బంధు పథకం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారని, రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నారని అన్నారు. అర్హులను గుర్తించే బాధ్యత బీఆర్ఎస్ నేతలపై ఉందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ రారాజు అని, నిరంతరం ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తూ ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆలోచిస్తున్నారన్నారు. ఈ ముఖ్యమంత్రిని మనం కాపాడుకుంటేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు వర్ధిల్లుతాయని, మరోసారి ముఖ్యమంత్రిగా ఆయన హ్యాట్రిక్ సాధించాలని, ఖైరతాబాద్‌లో మూడోసారి తాను గెలిచి హ్యాట్రిక్ సాధించే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఆరు నెలల ముందు కొన్ని పార్టీలకు ప్రజలు గుర్తుకు వస్తారని, వారిని ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వచ్చారని నిలదీయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులతో పాటు కార్పొరేటర్లు కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: కార్మికనగర్ బస్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగాం జిల్లాకు చెందిన డప్పు కళాకారుల ఆటాపాటా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు రవిశంకర్, డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎండీ నజీర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, లింగరాజు, ధనూజ, స్రవంతి, విశాల్, కుమార్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం గొప్ప విషయం: ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్ : నూతనంగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడం చాలా గొప్ప విషయమని, ఆయన ఆశయాలను నెరవేర్చడానికే సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యూసుఫ్‌గూడ బస్తీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన కార్పొరేటర్లు,, దళితబంధు లబ్దిదారులతో కలిసి ఆవిష్కరించారు. కులాంతర వివాహం చేసుకున్న రెండు జంటలకు రూ2.5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య విజయ్, సీఎన్.రెడ్డిలతో పాటు ఆయా డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు సంతోష్, కృష్ణమోహన్, విజయ్‌కుమార్, నర్సింగ్‌దాస్, విజయ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సామగ్రి



ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చి ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇందిరానగర్‌లో నివాసముండే రమేష్ ఇంట్లో గురువారం రాత్రి సమయంలో ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు అంటుకొని సామగ్రి కాలిపోయింది. వెంటనే మంటల్ని గమనించిన రమేష్ కుటుంబ సభ్యులు బయటకు వెళ్లడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. ఈ నీళ్లను తాగేదెలా?



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ దీన్‌దయాల్ నగర్ బస్తీలో గత 15 రోజులుగా రంగుమారిన కలుషిత నీళ్లు వస్తున్నాయని చెప్పినా కూడా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. పూర్తిగా రంగుమారిన నీళ్లు కనీసం వాడుకోవడానికి కూడా పనికి రావడం లేదని, దుర్వాసన వస్తున్నాయని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక లైన్‌మెన్లకు, సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ నీళ్లను సీసాల్లో నింపి ఫొటోలు పంపించినా స్పందించడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్తీలో కలుషిత నీటి సరఫరాకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెబుతాం

- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

లిబర్టీ: ప్రతిపక్షాలన్నీ ఐక్యత చాటుతున్నాయని, దీంతో దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకోనున్నాయని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, జాతీయ లౌకిక ప్రజాస్వామ్య కూటమి జాతీయ కన్వీనర్ వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. ప్రధాన రాజకీయ పక్షాలకు ధీటుగా తమ పార్టీ కూటములతో ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించనుందని తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంగా ప్రతిపక్షాలన్నింటినీ ఐక్యం చేసి ఎన్నికల పోరాటం చేస్తామన్నారు.

ముదిరాజ్‌లపై వివక్ష తగదు

సనత్‌నగర్: బీసీలకు రూ. లక్ష రుణం ఇస్తున్నట్లు ప్రకటించిన తెలంగాణ సర్కార్.. ఆ జాబితాలో ముదిరాజ్‌లను చేర్చకపోవడం విచారకరమని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముదిరాజ్‌ల పట్ల ప్రభుత్వం ఎందుకంత వివక్ష చూపుతుందో సమాధానం చెప్పాలన్నారు. చేపల పంపిణీలోనూ ముదిరాజ్‌లకు వివక్ష ఎదురైందని రుణాలకు దరఖాస్తు చేసుకునే సమయాన్ని తక్కువగా ఇచ్చి బహుజనులను అవమానించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రైల్లో నుంచి పడి రైతు మృతి

సికింద్రాబాద్: చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా ఆదిలాబాద్ జిల్లా బ్రహ్మంగావ్ గ్రామానికి చెందిన రైతు నడికుడ గంగాధర్ (48)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

క్లుప్తంగా

ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ కృష్ణా వేదికగా మూడు రోజుల పాటు కొనసాగే ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు.

నిమ్స్ ప్రగతిలో మేము సైతం..


నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను సత్కరిస్తున్న వైద్యులు

లక్డీకాపూల్: నిమ్స్ ప్రగతికి తమ వంతు కృషి చేస్తామని ఫ్యాకల్టీ, రెసిడెంట్ సంఘాలు పేర్కొన్నాయి. శుక్రవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ గా డాక్టర్ నగరి బీరప్ప పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను నిమ్స్ సీనియర్ ఫ్యాకల్టీ, రెసిడెన్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, నిమ్స్ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన బీరప్పని నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. డాక్టర్ బీరప్పకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ నిమ్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు.తెలంగాణ ఉద్యోగుల సంఘం సభ్యులు వైవీ రాధిక, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

చేనేత బంధు ప్రకటించాలి

పంజగుట్ట: చేనేత వృత్తిలో బతుకు భారంగా లాగిస్తున్న వారికి, చేనేత వృత్తి కోల్పోవడంవల్ల ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను ఎంచుకున్న వారికి చేనేతబంధు ప్రకటించి ఆర్థిక సాయం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి, అఖిలభారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. బీసీ కులవృత్తులకు ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ అందులో చేనేతవృత్తులను, చేనేత కార్మికులను విస్మరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి చేనేతబంధు పథకం కింద అర్హులకు రూ. 10 లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మీడియా ఇన్‌చార్జి అమరేందర్, రఘురామ్, వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ డిక్లరేషన్ సమావేశం

పంజగుట్ట: బీసీల సాధికారత కోసం రాజకీయ, ఆర్థిక తదితర రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న బీసీ డిక్లరేషన్ పేరుతో జాతీయస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు సమావేశ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ దేవళ్ల సమ్మయ్య తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశ కరపత్రాన్ని కో కన్వీనర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, ఎ.లక్ష్మణ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 11న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు.

మైనార్టీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి


మైనార్టీ గురుకులాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్‌లు బ్రహ్మాండమైన ఉత్తీర్ణత శాతంతో నడుస్తున్నాయని, అర్హులైన ముస్లిం, క్రిస్టియన్ సోదరులంతా తమ పిల్లలను ఈ పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్పించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. శుక్రవారం మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పోస్టర్లు, బ్యానర్లను మైనార్టీ విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు ఉన్నాయని పిల్లలను వీటిల్లో చేర్పాలన్నారు. ఇక్కడ నాణ్యమైన భోజనంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతున్నదన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్టూడెంట్ స్కాలర్‌షిప్‌లు, చీఫ్ మినిస్టర్స్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, షాదీముబారక్, నేషనల్ స్కాలర్‌షిప్, పోస్ట్‌మెట్రిక్ మైనార్టీస్ బాయ్స్ హాస్టళ్లు, గురుకులు పాఠశాలలు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు, రంజాన్, క్రిస్మస్ కానుకలు... ఇలా ఎన్నో పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఇది కేవలం కేసీఆర్ ప్రభుత్వంలో మాత్రమే అమలవుతున్నదని, దేశంలో మరెక్కడా లేదన్నారు. ప్రతి ఒక్కరూ మైనార్టీ స్కూళ్లను, కాలేజీలను వినియోగించుకొని తమ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు.

చేనేత కళాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలి


వస్త్రప్రదర్శనలోని చీరలను తిలకిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి, బీనామెహతా

శ్రీనగర్‌కాలనీ: చేనేత కళాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించి వారి వస్త్రాలను ధరించి తోడ్పాటు అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె సోషలైట్, సంఘిని క్లబ్ ప్రతినిధి బీనా మెహతాతో కలిసి ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాళ్లలో అందుబాటులో ఉంచారు. ఈనెల 14 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు యలమంచిలి శ్రీలత తెలిపారు.

హాట్ టాపిక్‌గా ఇంద్రసేన్‌రెడ్డి బస్తీ పర్యటన


దీన్‌దయాల్ నగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి

ఫిలింనగర్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బూత్ దర్శన్ పేరుతో ఒకవైపు బస్తీల్లో పర్యటిస్తుండగా...మరో వైపు కొత్తగా పార్టీలో చేరిన బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి బస్తీ పర్యటన చేపట్టడం ఖైరతాబాద్ బీజేపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఏ నేతతో తిరగాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. తాజాగా శుక్రవారం ఇంద్రసేన్‌రెడ్డి జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీలో పాదయాత్ర చేపట్టారు. స్థానికులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖైరతాబాద్ బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఇంద్రసేన్‌రెడ్డి పర్యటనకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఆయనను ఇంటింటికీ ఆహ్వానించి ప్రజలు తమ సమస్యలను వెల్లబోసుకున్నారు. అయితే ఇంద్రసేన్‌రెడ్డి పర్యటన చింతలకు తెలిసే జరిగిందా లేదా అన్నదానిపై సందేహాలు నెలకొన్నాయి. ఓ యువకుడు ముందుకు వచ్చి పార్టీలో సీనియర్ నాయకులకు తెలియకుండా ఎలా బస్తీ పర్యటనలు చేస్తారంటూ నిలదీశారు.

బ్రిజ్ భూషణ్‌కు కొమ్ముకాస్తున్న బీజేపీ

పంజగుట్ట: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషన్‌కు బీజేపీ ఎందుకు కొమ్ముకాస్తున్నదని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం ప్రశ్నించారు. రెజ్లర్లకు మద్దతుగా ఈ నెల 15న అన్ని కుల, ప్రజా సంఘాలతో కలిసి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన రెజ్లర్లు గత 40 రోజులుగా తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడుతుంటే బీజేపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వెంగళరావునగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...యూసుఫ్‌గూడ బస్టాప్ సమీపంలో శుక్రవారం వ్యక్తి మృతదేహం పడి ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వివరాలు తెలుసుకొనేందుకు స్థానికులను విచారించగా, ఎవ్వరూ గుర్తుపట్టలేదు. మృతుడి వయసు 40 నుంచి 45 మధ్య ఉంటుందని, మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలియజేశారు. ఎస్‌ఐ యుగంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇలా తవ్వేసి వదిలేస్తే ఎలా?

- డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్వకం
- పనులు పూర్తయ్యాక మరమ్మతు చేపట్టని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

వెంకటేశ్వరకాలనీ: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ నిర్వాకం ప్రజలకు శాపంగా మారింది. వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం .14 ఇందో బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వెనుక నందినగర్ బస్తీలో రెండు నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత తిరిగి రోడ్డుకు మరమ్మతు చేయాల్సిన కాంట్రాక్టర్ చేతులెత్తేసి జారుకున్నాడు. అధికారులు కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవంతో బస్తీ రోడ్డుతో పాటు బ్రహ్మకుమారీస్ రోడ్డును కూడా తవ్వేయడంతో ఆ రహదారి కూడా అస్తవ్యస్తంగా తయారైంది. అసలే లోతట్టు ప్రాంతమైన ఈ ప్రాంతంలో చిన్నపాటి చినుకుపడితే పూర్తిగా జలమయం అవుతోంది. బస్తీలో ఉన్న రోడ్డు కింద రెండు డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. ఒకటి బస్తీవాసులది కాగా రెండోది బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి చెందింది. ఆస్పత్రి లైన్ కూడా కొంత దూరం వెళ్లిన తర్వాత బస్తీ డ్రైనేజీ పైప్‌లైన్‌లోనే కలిపివేయడంతో అది సామర్థ్యాన్ని తట్టుకోలేకపోతోంది. దీంతో బస్తీలో ఎప్పటికప్పుడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతూ స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ ఏర్పాటు చేసిన వరద నీటి కాల్వను జీహెచ్‌ఎంసీ పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో వర్షాకాలంలో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పైప్‌లైన్ నిర్మించేందుకు తవ్విన రోడ్డును అయినా బాగు చేస్తారో లేదో చూడాల్సి ఉంది.


నందినగర్ బస్తీలో రోడ్డు తవ్వి మరమ్మతు చేపట్టకుండా వదిలేసిన దృశ్యం

క్లుప్తంగా...

ఎన్నికలపై ప్రభుత్వ సిబ్బందికి శిక్షణ

- పక్కా ప్రణాళిక, శిక్షణతోనే సజావుగా ఎన్నికలు
- సీఈవో వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల సందర్భంగా సజావుగా విధుల నిర్వహణపై అవగాహన కల్పించడంలో భాగంగా ప్రభుత్వ సిబ్బందికి కేంద్ర ఎన్నికల సంఘం శిక్షణనిచ్చింది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఈనెల 5వ తేదీ నుంచి 9 వరకు ఢిల్లీకి చెందిన ఇండియన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ల (ఎస్‌ఎల్‌ఎంటీ)కు ఈ శిక్షణనిచ్చారు. అభ్యర్థుల అర్హత, అనర్హత, నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణ ప్రణాళిక, పోలింగ్ రోజు ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, విలేకరులకు అవసరమైన అంశాలు, పెయిడ్ న్యూస్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సోషల్‌మీడియా, ఖర్చు పర్యవేక్షణ, ఈవీఎం, వీవీప్యాట్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, పోస్టల్ బ్యాలెట్లు తదితర అంశాలపై రాష్ట్ర స్థాయిలో శిక్షణనిచ్చారు. శిక్షణ తీసుకున్న సిబ్బంది జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వనుండగా, జిల్లా ట్రైనర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. కాగా, శిక్షణ చివరి రోజైన శుక్రవారం కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ.. పక్కా ప్రణాళిక, శిక్షణ ద్వారానే సజావుగా ఎన్నికల నిర్వహణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

ఖాదీ ఉత్పత్తుల అమ్మకాల్లో 332% వృద్ధి

కేవీఐసీ చైర్మన్ మనోజ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ నేతృత్వంలోని 'ఆత్మనిర్భర్ భారత్'ద్వారా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (ద ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కేవీఐసీ).. పటిష్టమైన భారత ప్రశాంత చిత్రాన్ని ప్రపంచం ముందుంచిందని కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే మొట్టమొదటిసారి కేవీఐసీ ఉత్పత్తులు 1.34 లక్షల కోట్ల టర్నోవర్‌ను సాధించాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులు తయారు చేసిన ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలు తొమ్మిదేళ్లలో 332 శాతం వృద్ధి సాధించాయన్నారు. 2013–14లో 31,154 కోట్లున్న కేవీఐసీ టర్నోవర్ 2022–23 నాటికి 1,34,630 కోట్లకు చేరిందని వివరించారు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో 9,54,899 మందికి ఉపాధి కల్పిస్తూ.. కేవీఐసీ కొత్త మైలురాయిని నెలకొల్పిందని వెల్లడించారు.

కుంగుతున్నది రామోజీ బుద్ధే

సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారమే గైడ్ బండ్ నిర్మాణం

- రిటైనింగ్ వాల్ స్టోన్ కాలమ్స్ ఓ చోట వంగడంతో కొంత మేర జారిన గైడ్ బండ్
- ఇలా ఎందుకు జారిందో ఈ నెల 16లోగా తేల్చనున్న సీడబ్ల్యూసీ కమిటీ
- ఆ కమిటీ నివేదిక ఆధారంగా గైడ్ బండ్ సరిదిద్దే పనులు
- వాటిని అధిగమిస్తూ చకచకా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న సీఎం జగన్
- ఈ చిన్న సమస్య పెను విపత్తన్నట్లు 'ఈనాడు' విషపు రాతలు
- గతంలో చంద్రబాబు, నవయుగ తప్పిదాలతో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- దానిని చక్కదిద్దడానికి అదనంగా రూ.2020.05 కోట్లు వ్యయం
- డీపీటీ విధానంలో దోచుకున్నారు కాబట్టి ఇది రామోజీకి కనిపించదు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ చకచకా పూర్తి చేస్తుండటంతో రాజకీయంగా చంద్రబాబుకు నూకలు చెల్లడం ఖాయమనే భయం.. వియ్యంకుడిని కాంట్రాక్టర్‌గా తప్పించడంతో తమ దోపిడీకి అడ్డుకట్ట పడిందనే అక్కసుతో రామోజీరావు పదే పదే విషం చిమ్ముతున్నారు. గైడ్ బండ్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తుగా చూపిస్తూ.. విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజినీర్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్, కీలక ఇంజినీరింగ్ అధికారి అంటూ.. వారి పేర్లు ప్రస్తావించకుండా.. ఆ ముసుగులో తన అభిప్రాయాలనే వారి అభిప్రాయాలుగా 'ఈనాడు'లో రోతరాతలు అచ్చేశారు. టీడీపీ సర్కార్ హయాంలో చంద్రబాబు, నవయుగ చేసిన తప్పిదం వల్ల గోదావరి వరదల ఉధృతికి పోలవరం ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. వీటిని చక్కదిద్దడానికి రూ.2020.05 కోట్లు అదనంగా వ్యయం చేయాలని సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) తేల్చింది. ఈ విపత్తుకు చంద్రబాబు చేసిన మానవ తప్పిదమే కారణమని ఐఐటీ(హైదరాబాద్), డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ నిపుణులు తేల్చిచెప్పారు. ఇవన్నీ తన బాబు సీఎం కుర్చీలో లేరని కుంగిపోతున్న రామోజీరావుకు కన్పించవు. ఎందుకంటే.. చంద్రబాబు, వియ్యంకుడి సంస్థ నవయుగతో కలిసి పోలవరంలో రామోజీరావు డీపీటీ (దోచుకో పంచుకో తినుకో) పద్ధతిలో దోచుకున్నారు కాబట్టి. ఆ పెను విపత్తును కప్పిపెడుతూ.. గైడ్ బండ్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తుగా చిత్రీకరిస్తూ శుక్రవారం 'మెగా వైఫల్యం' శీర్షికన ప్రచురించిన కథనంలో వీసమెత్తు వాస్తవం లేదు.

ఆరోపణ: రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ పూర్తిగా కుంగిపోయి ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది.

వాస్తవం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌కు తగ్గట్టుగానే గైడ్ బండ్ నిర్మాణం జరిగింది. రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ నిర్మాణానికి ముందు.. దాని నిర్మాణ ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్ కాలమ్స్‌తో భూమిని అభివృద్ధి చేశారు. జీఎస్ఐ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) శాస్త్రవేత్తలు ఆ ప్రాంతాన్ని పరిశీలించి అనుమతి ఇచ్చాకే రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ నిర్మాణం చేపట్టారు. డిజైన్ ప్రకారం నిర్మించకపోయి ఉంటే.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన జీఎస్ఐ, వ్యాప్కోస్, సీఎస్ఎంఆర్ఎస్, పీపీఏలు మౌనంగా ఉండవు. వీటిని పరిశీలిస్తే.. డిజైన్‌లోనూ లోపం లేదు. నిర్మాణంలోనూ లోపం లేదన్నది స్పష్టమవుతోంది. ఇక గైడ్ బండ్ పూర్తిగా కుంగిపోయిందనడం అవాస్తవం. రిటైనింగ్ వాల్‌లో ఒక చోట స్టోన్ కాలమ్స్ కాస్త ఒంగిపోవడం వల్ల గైడ్ బండ్‌లో 134 మీటర్ల మేర కొంత జారింది. దీనిని సరిచేయడంలో నిపుణులు నిమగ్నమయ్యారు.

ఆరోపణ: కుంగిపోయిన గైడ్ బండ్ స్థానంలో మళ్లీ మొదటి నుంచి నిర్మించాల్సి వస్తుందేమోనని ఇంజినీర్లు చెబుతుంటే.. సాక్షాత్తు సీఎం జగన్ దీన్ని చిన్న అంశంగా తేల్చి పారేయడం విస్మయం కలిగించింది.

వాస్తవం: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడబ్ల్యూసీ, పీపీఏ, సీఎస్ఆర్ఎంఎస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, వ్యాప్కోస్, జీఎస్ఐ వంటి సంస్థల అధికారుల పర్యవేక్షణలో పోలవరం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను చాకచక్యంగా పరిష్కరించుకుని.. చకచకా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ సదుద్దేశం. గైడ్ బండ్ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. సమీక్షించి.. జారడానికి గల కారణాలను మదింపు చేసి నివేదిక ఇవ్వడానికి సీడబ్ల్యూసీ ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 16లోగా నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా గైడ్ బండ్‌ను చక్కదిద్దుతారు. ఈ చిన్న సమస్యను సాకుగా చూపి ప్రాజెక్టు నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తోన్న అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం, నిర్మాణ సంస్థ సమర్థతను ప్రశ్నించడం అవివేకమే అవుతుంది.

ఆరోపణ: గైడ్ బండ్‌లో రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణ శైలిని 2:1 నిష్పత్తిలో కాకుండా.. 3:1 నిష్పత్తిలో నిర్మించి ఉంటే కుంగిపోయేది కాదు. (విశ్రాంత ఇంజినీర్ పేరుతో రామోజీ మనసులోని మాట ఇది)

వాస్తవం: డిజైన్ల రూపకల్పన, ఖరారులో సీడబ్ల్యూసీ అత్యున్నత సంస్థ. ఆ సంస్థ ఆమోదించిన డిజైన్ ప్రకారం సైడ్ స్లోప్ 2:1 నిష్పత్తితోనే గైడ్ వాల్ నిర్మించారు. స్పిల్ వేకు ఎగువన సుడిగుండాలను నియంత్రించి.. స్పిల్ వేపై ఒత్తిడి తగ్గించడానికి నిర్మించిందే గైడ్ బండ్. సముద్ర తీర ప్రాంతాలు కోతకు గురవకుండా గేబియన్లు వేస్తారు. గైడ్ బండ్‌కు అలాంటివి వేయరు. ఇది రామోజీరావు వంటి విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌కు తెలియదేమో? సుడిగుండాలను నియంత్రించడం, స్పిల్ వేపై ఒత్తిడిని తగ్గించడానికి.. వరద సులభంగా దిగువకు వెళ్లడానికి వీలుగా.. స్పిల్ వేకు ఎగువన ఎడమ గట్టు కొండకు సమాంతరంగా 500 మీటర్ల పొడవుతో గైడ్ బండ్ నిర్మించాలన్న సూచన మేరకు రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్‌ను నిర్మించారు.

ప్రీతి కేసులో నిందితుడు సైఫ్‌పై వేటు

- కేఎంసీ నుంచి ఏడాదిపాటు సస్పెన్షన్

సాక్షి, వరంగల్/ఎంజీఎం: వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతిని మానసికంగా హింసించి ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో సీనియర్ అనస్థీషియా విద్యార్థి డాక్టర్ ఎంఏ సైఫ్ అలీని ఏడాది పాటు సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మార్చి నాలుగు నుంచి ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ప్రిన్సిపల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మార్చి 4వ తేదీ నుంచి అనస్తీషియాలజీ పీజీ నుంచి ఏడాదిపాటు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ చేయడం, మానసికంగా హింసించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని అర్థం చేసుకోవడంతో పాటు.. విచారణ జరిపిన యాంటీ ర్యాగింగ్ కమిటీ ఈ ప్రతిపాదనలు చేయడంతో సస్పెండ్ చేశామని వివరించారు. ఇప్పటికే జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన సైఫ్ తనను తరగతులకు అనుమతించాలని, తాను నిందితుడా, కాదా అన్నది కోర్టు తేలుస్తుందని కేఎంసీకి కొద్దిరోజుల క్రితమే లేఖ రాశారు. తాజాగా మళ్లీ లేఖ రాయడంతో ఏడాదిపాటు తరగతులకు హాజరుకావొద్దంటూ సస్పెండ్ చేశారు.



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

మీరు బాగుంటేనే ప్రజలు బాగు

ఉద్యోగులకు మంచి చేయాలన్నదే మా ఉద్దేశం: ఏపీ సీఎం జగన్

- జీపీఎస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఉద్యోగ సంఘాల హర్షం
- ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆయా సంఘాల ప్రతినిధులు
- భవిష్యత్‌లోనూ మేలు జరగాలనే దిశగా అడుగులేశామన్న సీఎం

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా సరే చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని, వారంతా చిరునవ్వుతో ఉండేలా చూస్తామని అన్నారు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని విశ్వసించిన ప్రభుత్వం మనదని, ఉద్యోగుల మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొత్తగా జీపీఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీం) తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా పలు అంశాలపై ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సదర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి సీఎం ఏమన్నారంటే..

పరిష్కారాల కోసం తపనపడ్డాం

- ఉద్యోగుల మనసు కష్టపెట్టకూడదనే ఉద్దేశంతోనే పెన్షన్ సహా కొన్ని సమస్యల పరిష్కారాల కోసం రెండేళ్లుగా తపన పడ్డాం. గతంలో ఎవరూ కూడా ఒక పరిష్కారం కోసం ఇంతగా తపన పడిన పరిస్థితులు ఎప్పుడూ లేవు. ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి.. అంతేకాకుండా భావితరాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలనే ఆలోచన చేశాం. వీటన్నింటి దృష్ట్యా జీపీఎస్ తీసుకువచ్చాం.
- రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించాం. బేసిక్ జీతంలో 50 % అంటే రూ.లక్ష జీతం ఉంటే రూ.50 వేలు రిటైర్ అయిన తర్వాత పింఛన్ వస్తుంది. 62 ఏళ్లకు రిటైర్ అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయి లో జీవన ప్రమాణాలు ఉండాలని ఆలోచన చేశాం.
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కూడా మంచి ఆలోచన చేశాం. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. నా దగ్గరకు వచ్చినప్పుడు రాష్ట్ర విభజన కంటే ముందు పదేళ్లను విండోగా అధికారులు నిర్ణయించారు. అలాగైతే మరీ ఆలస్యమవుతుందని ఐదేళ్లకు తగ్గించాం.
- ఇంకా భవిష్యత్తులో ప్రభుత్వం వైపు నుంచి ఏ రకమైన మంచి జరగాల్సి ఉన్నా, మీ మొహంలో (ఉద్యోగులు) చిరునవ్వు ఉండేలా చేస్తాం. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలకూ మంచి జరుగుతుంది. ప్రభుత్వం ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది.

'మార్గదర్శి'పై సీఐడీ న్యాయపరమైన చర్యలు

- తమ ప్రతిష్టకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేయడంపై ఆగ్రహం
- త్వరలో రామోజీ, శైలజలకు నోటీసులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంసీఎఫ్‌ఎల్)పై న్యాయపరమైన చర్యలకు సీఐడీ సన్నద్ధమవుతోంది. ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సీఐడీ చర్యలను వక్రీకరిస్తూ, దాని ప్రతిష్టకు భంగకరంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యవహరిస్తుండటం వివాదాస్పదమవుతోంది. ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు సంస్థతోపాటు అధికారుల గౌరవానికి భంగం కలిగిస్తూ మార్గదర్శి అవాస్తవాలను ప్రచారం చేస్తోందని.. తమ అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందని సీఐడీ గుర్తించింది. తద్వారా కేసు దర్యాప్తును ప్రభావితం చేయాలన్నది మార్గదర్శి చిట్‌ఫండ్స్ లక్ష్యమన్నది కూడా స్పష్టమైంది. అందుకే సీఐడీపై దుష్ప్రచారం చేస్తూ దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌లపై న్యాయపరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే వారికి సీఐడీ నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

నగర వార్తలు

క్రీడల్లో రాణిస్తే అన్ని రంగాల్లో రాణించొచ్చు



మధుసూదన్‌రెడ్డిని సన్మానించిన డాక్టర్ ఆంజనేయ గౌడ్

అబిడ్స్: క్రీడల్లో రాణించిన వారు ఏ రంగంలోనైనా అద్భుతమైన విజయాలు సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ పేర్కొన్నారు. సైక్లింగ్ క్రీడాకారుడు అన్నాడి మధుసుదన్ రెడ్డి యూపీఎస్సీ నిర్వహించి పరీక్షల్లో ఆల్ ఇండియా 51 ర్యాంకు సాధించడంతో అతనిని శాట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ.. ఓ క్రీడాకారుడు జాతీయస్థాయిలో 51వ ర్యాంకు సాధించి సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు విభాగంలో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగం పొందడం ఎంతో అభినందనీయమన్నారు. సైక్లింగ్ అకాడమీలో ఒక విద్యార్థిగా ఉంటూ ఒక ఐపీఎస్ సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రీడలతో పాటు చదువుపై కూడా దృష్టి సారించి సివిల్ సర్వీస్‌లో ఆల్‌ఇండియా స్థాయి 51వ ర్యాంక్ సాధించడం రాష్ట్రంలోని క్రీడాకారులందరికి స్ఫూర్తిని ఇస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా మారుమూల పల్లెలో పుట్టి క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించిన మధుసూదన్‌రెడ్డి సివిల్స్‌లోనూ సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ సుధాకర్‌రావు, స్టేడియం సిబ్బంది, కోచ్‌లు, సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రూపు–1 పరీక్షకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 11వ తేదీ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షా సమయానికి అనుగుణంగా అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకొనేందుకు, పరీక్షల అనంతరం తిరిగి గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలుగా బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక బస్సులపైన 'టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్' అనే బోర్డులను ఏర్పాటు చేస్తారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

ఈ నెల 12వ తేదీన హయత్‌నగర్ బస్‌పాస్ కౌంటర్ వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేక బస్‌పాస్ మేళాను ఏర్పాటు చేయనున్నారు. హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్, తొర్రూరు,అనాజీపూర్, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్‌బీనగర్ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- ఘనంగా సంక్షేమ సంబురాలు
- హాజరైన మంత్రులు తలసాని, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్



గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రవీంద్రభారతిలో సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దార్శనికుడని కొనియాడారు. నిరుపేద ఆడపిల్లకు రూ.లక్ష అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 2014కు ముందు తెలంగాణ, 2014 తర్వాత తెలంగాణలో తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రం శాంతి భద్రతల పరిరక్షణలో మొదటి స్థానంలో ఉందన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజనులపై వివక్ష చూపుతుందన్నారు. సమ్మక్క, సారలక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని, గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, గిరిజనుల రిజర్వేషన్లపై పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి అవార్డులను అందజేశారు. అంతకు ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏకే.ఖాన్‌తో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మందు బాటిళ్ల' పేరుతో మస్కా!

'ది వైన్' గ్రూప్ యాప్ ద్వారా భారీ టోకరా

- నిండా ముంచిన సైబర్ నేరగాళ్లు
- రూ.450తో ప్రారంభించి రూ.లక్షల వరకు పెట్టుబడి
- స్పందించిన వేలాది మంది ప్రజలు
- హైదరాబాద్ సిటీ సైబర్ క్రైంలో ఏడుకు పైగా కేసులు
- ఇతర కమిషనరేట్‌లలోనూ ఫిర్యాదులు

హిమాయత్‌నగర్: 'ది వైన్' గ్రూప్ పేరుతో కోట్లాది రూపాయలు లూటీ చేసిన ఘటనలు తెరపైకి వస్తున్నాయి. ఆన్‌లైన్ వేదికగా తక్కువ ధరకు మందు బాటిళ్లను కొంటే అధిక లాభాలు ఇస్తామంటూ అమాయకులకు ఎర వేశారు. ఆ ఎరలో చిక్కుకున్న వేలాది మంది అమాయకులు లక్షల రూపాయలు నష్టపోయారు. కొద్ది రోజులుగా లక్షలు నష్టపోయిన బాధితులు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఇలా దేశవ్యాప్తంగా దాదాపు 15 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా..నగర వ్యాప్తంగా మూడు లక్షలకు పైగా మంది రిజిస్ట్రేషన్ చేసుకుని దీనిలో పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఇదో భారీ స్కాం

కొందరు సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసానికి ఒడిగట్టారు. 'ది వైన్' గ్రూప్ పేరుతో ఓ యాప్‌ను క్రియేట్ చేశారు. ఒక్కో వైన్ బాటిల్‌ను యాప్ ద్వారా కొనుగోలు చేస్తే 60 రోజుల్లో మూడింతలు లాభాలు ఇస్తామంటూ ప్రకటనను పోస్ట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ వంటి సైట్లు ఓపెన్ చేసిన ప్రతిసారీ ఇదే యాడ్ ప్రత్యక్షమవ్వడంతో కొందరు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. దానిలో రూ.450తో రిజిస్ట్రేషన్ చేసుకున్న బాధితులు ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన బ్రాండెడ్ వైన్ బాటిళ్లను కొనుగోలు చేశారు. ఇందుకు తొలిరోజుల్లో బాధితులకు లాభాలు సైతం ఇచ్చారు. ఇలా లాభాలు రావడంతో అత్యాశకు పోయిన బాధితులు లక్షల రూపాయిలు బయట అప్పులు చేసి మరీ ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టి మందుబాటిల్స్‌ను కొనగోలు చేశారు. రోజులు గడిచినా లాభాలు రాకపోవడంతో ఇప్పుడు మోసపోయామంటూ పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు.

ఒక్కో టీం లీడర్ కింద 230 మంది

ఈ యాప్‌లో తొలిరోజుల్లో మందు బాటిల్స్ కొని లాభాలు పొందిన వారిని యాప్ నిర్వాహకులు టీం లీడర్లుగా నియమించుకున్నారు. టీం లీడర్ అర్హత సాధించాలంటే ఒక్కొక్కరు 230 మందిని సభ్యులుగా చేర్చాలి. ఒక్కొక్కరి నుంచి రూ.450 నుంచి రూ.1000 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజును వసూలు చేసి చేర్పించుకున్నారు. ఈ టీం లీడర్‌కు ప్రతి నెలా రూ.20 వేల జీతాన్ని కూడా ఇచ్చారు. అదేవిధంగా టీంలోని సభ్యులు మందుబాటిల్‌ను కొనుగోలు చేస్తే టీం లీడర్‌కు 20 శాతం కమీషన్‌ను కూడా వారి వారి అకౌంట్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. టీం లీడర్లు డబ్బు సంపాదిస్తున్న విషయాన్ని ఇతరులకు చెప్పి ఆ రకంగా కొన్ని వేల మందిని ఈ యాప్‌లో చేర్పించారు.



'ది వైన్ గ్రూప్' యాప్ ప్రొఫైల్

ఫిర్యాదులతో పేజీ మూసేశారు..



ఇప్పటి వరకు ఈ మోసంపై ఆరేడు ఫిర్యాదులు అందగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. మాకున్న సమాచారం మేరకు రెండు రాష్ట్రాల్లో వేలల్లో బాధితులు కోట్ల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. ఎప్పుడైతే ఎఫ్ఐఆర్‌లు నమోదు అవ్వడం స్టార్ట్ అయ్యిందో..అప్పుడే 'ది వైన్ గ్రూప్' పేజ్‌ను ఆన్‌లైన్ నుంచి రిమూవ్ చేశారు. ఈ తరహా మోసాలను నమ్మొద్దు.

– కేవీఎం ప్రసాద్, సిటీ సైబర్‌క్రైం

'గడువు ముగిసిన మందు'లపై అత్యవసర కమిటీ నియామకం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలో కలకలం రేపిన గడువు ముగిసిన మందుల పంపిణీపై ఐదుగురు సభ్యులతో కూడిన అత్యవసర కమిటీని నియమించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పేర్కొన్నారు. అనారోగ్యంతో చికిత్స నిమిత్తం ఉస్మానియాలో చేరిన ఓ మహిళకు గడువు ముగిసిన మందులు ఇవ్వడంతో ఆమె ముఖంపై దద్దుర్లు రావడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనపై తీవ్రంగా స్పందించిన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ సంబంధిత జూనియర్ వైద్యులు, స్టాఫ్ నర్సులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు.

ఉత్తమ ఫ్యాషన్ డిజైనర్‌గా నీతా లుల్లా



సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్ఠాత్మక కాన్స్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి అంతర్జాతీయ వేదికపైన ఓ మహిళగా దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన శాకుంతలం సినిమాలో ప్రముఖ నటి సమంతాకు నీతా రూపొందించిన ఫ్యాషన్ డిజైన్స్‌కు ఈ అవార్డు వరించింది. అంతేకాక కాన్స్ వేదికగా ఈ అవార్డును అందుకున్న మొదటి భారతీయ మహిళ నీతా కావడం విశేషం. శుక్రవారం నగరంలోని ఎఫ్‌టీసీసీఐ వేదికగా హామ్స్‌టెక్, జేఎన్ఏఎఫ్ఏయూ వీసీ డా.కవితా దర్యాణి రావు ఆధ్వర్యంలో నీతా లుల్లాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీతా లుల్లా మాట్లాడుతూ.. ఈ అవార్డ్ పొందడం తన కష్టానికి ప్రతిఫలమని, శాకుంతలం సినిమాకు అవకాశం కల్పించిన గుణ టీమ్ వర్క్స్, డైరెక్టర్ గుణశేఖర్, నిర్మాత నీలిమ గుణ, దిల్ రాజు ప్రొడక్షన్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హామ్స్‌టెక్ విద్యార్థులకు ఫ్యాషన్ డిజైన్ మెంటార్ కొనసాగడం సంతోషంగా ఉందని, హామ్స్ టెక్ విద్యార్థులు తన ప్రాజెక్టులలో భాగమయ్యారని అన్నారు. హామ్స్‌టెక్ సీఈఓ అజితా యోగేష్ మాట్లాడుతూ.. నగరంలోని ఫ్యాషన్ రంగానికి నీతా చేసిన కృషి ఎనలేనిది, ఇలాంటి డిజైనర్ తమ విద్యార్థులకు మెంటార్‌గా ఉండటం ఆనందంగా ఉందన్నారు.

అన్ని వ్యాపారాలకు అనుగుణంగా హైదరాబాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జయేశ్‌రంజన్ తదితరులు

మాదాపూర్: హైదరాబాద్ నగరం అన్ని వ్యాపారాలకు అనుగుణంగా ఉంటుందని జెమ్స్, జ్యువెలరీ రంగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం హైదరాబాద్ జ్యువెలరీ, పెరల్, జెమ్‌ఫెయిర్–2023ను ఆయన నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిన 14 రంగాలలో జెమ్స్ అండ్ జ్యూలరీ రంగంలో మాత్రం కోర్టు కేసుల కారణంగా ఆశించిన ప్రగతి సాధించలేకపోయామన్నారు. తమ వర్క్‌షాపులు, ఫ్యాక్టరీలు, పెట్టే ఆభరణాల వర్తకులకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. భవన నిర్మాణాలు, పరిశ్రమలు స్థాపించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాలసీలను ప్రవేశ పెట్టిందని వీటి ద్వారా దేశంలో ఎక్కడలేని విధంగా త్వరితగతిన పనులు పూర్తి చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. మూడ్రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో వివిధ రకాల డిజైన్‌తో కూడిన బంగారు ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బులియన్ జెమ్ అండ్ జ్యూలరీ ఫెడరేషన్ అధ్యక్షులు జగ్దీస్ పెర్షద్ వర్మ, ఐబీజేఏ జాతీయ ఉపాధ్యక్షుడు చేతస్‌మెహతా, ఇండోనేషియన్ ట్రేడ్ ప్రామోషన్ సెంటర్ డైరెక్టర్ నుగ్రోహో ప్రియో ప్రటోమోల పాల్గొన్నారు.


కొండాపూర్‌లో 'గేమ్-ఏ-థాన్ హైదరాబాద్'

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ఈ నెల 10 (నేడు) స్ట్రీట్ ఫైటర్ వీ, ఫిఫా–23, ఫోర్జా హారిజోనా తదితర విభాగాలతో 'గేమ్–ఏ–థాన్ హైదరాబాద్' పేరుతో విఆర్ గేమింగ్ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. కొండాపూర్‌లోని విజయ్ సేల్స్, ఏసర్ ఆధ్వర్యంలో 'గేమ్–ఏ–థాన్ హైదరాబాద్'ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ప్రముఖ గేమింగ్ ఐకాన్ సోనాలి ప్లే లైక్ ఇన్‌కాగ్నిటో సింగ్‌ను కలవడంతో పాటు థ్రిల్లింగ్ గేమ్‌ప్లే సెషన్‌లో సోనాలిని సవాలు చేసే ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ గేమింగ్ మహోత్సవం కొండాపూర్‌లోని విజయ్ సేల్స్ వేదికగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
10-6-2023

బెంగళూరు వెనక్కి... హైదరాబాద్ ముందుకు

- ఆఫీసు స్పేస్ సరఫరాలో తొలి స్థానం
- మార్కెట్‌లోకి కొత్తగా 1.49 కోట్ల చ.అ. స్థలం
- బెంగళూరులో 1.26 కోట్ల చ.అ. స్థలమే
- అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్ అదిరిపోయింది. 2023 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై)లో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కార్యాలయాల స్థలాల సరఫరాలో భాగ్యనగరం తొలి స్థానంలో నిలిచింది. బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్, ముంబై వంటి మెట్రోలను వెనక్కి నెట్టేసి పతాక స్థాయికి చేరింది. 31 శాతం వాటాతో నగరంలో కొత్తగా 1.49 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి కాగా.. 26 శాతం వాటాతో బెంగళూరులో 1.26 కోట్ల చ.అ. స్థలం సరఫరా జరిగిందని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.

- దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో 2023 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 4.86 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ మార్కెట్లోకి వచ్చింది. 3.61 కోట్ల చ.అ. లావాదేవీలు జరిగాయి. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సరఫరాలో క్షీణత, లావాదేవీలలో వృద్ధి నమోదయింది. 2022 ఎఫ్‌వైలో 5.12 కోట్ల చ.అ. స్థలం సరఫరా కాగా.. 3.40 కోట్ల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. 2023 ఎఫ్‌వైలో ఎన్‌సీఆర్‌లో 88.2 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి కాగా.. ఎంఎంఆర్‌లో మరీ దారుణంగా కేవలం 41.8 లక్షల చ.అ.లకే పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 46 శాతం తక్కువ.

గ్రేడ్-ఏ అదరహో..

ఒక్క హైదరాబాద్‌లో మినహా ప్రధాన మెట్రో నగరాలన్నింట్లోనూ గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ వెకెన్సీలో క్షీణత నమోదయింది. ఉద్యోగుల లే-ఆఫ్‌లు, పరిమిత స్థాయిలో కంపెనీల విస్తరణ వంటి ప్రతికూల వాతావరణంలోనూ భాగ్యనగరంలో వృద్ధి నమోదయింది. వార్షిక ప్రాతిపదికన హైదరాబాద్‌లో గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ వెకెన్సీలో 0.5 శాతం పెరుగుదల కనిపించింది. మిగిలిన ఆరు నగరాలలో 0.1 శాతం నుంచి 0.5 శాతం మధ్య తగ్గుదల నమోదయింది. అత్యధికంగా ఎంఎంఆర్‌లో 0.5 శాతం క్షీణత నమోదు కాగా.. కోల్‌కతాలో 0.4 శాతం, పుణేలో 0.2 శాతం, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్‌లలో 0.1 శాతం తగ్గుదల కనిపించింది.

లావాదేవీల్లో మూడో స్థానం..

2022 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో 1.18 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి జరిగింది. అలాగే 78.5 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి. అదే బెంగళూరులో 1.45 కోట్ల చ.అ. సప్లయి జరగగా.. 76 లక్షలు చ.అ. స్థలం లావాదేవీలు జరిగాయి. ఇక 2023 ఎఫ్‌వైలో ఆఫీసు స్పేస్ లావాదేవీలలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ నగరంలో 68.8 లక్షల చ.అ. కార్యాలయ స్థలాల లావాదేవీలు జరిగాయి. 98.8 లక్షల చ.అ.ల నికర లావాదేవీలతో బెంగళూరు తొలి స్థానంలో నిలవగా.. 68.9 లక్షలు చ.అ. లావాదేవీలతో రెండో స్థానంలో ఎన్‌సీఆర్ నిలిచింది.

నగరాల వారీగా ఆఫీసు స్పేస్ సరఫరా, లావాదేవీలు: (చ.అ. లక్షల్లో)

నగరం	సరఫరా	లావాదేవీలు
హైదరాబాద్	1.494 కోట్లు	68.8
బెంగళూరు	1.266 కోట్లు	98.8
ఎన్‌సీఆర్	88.2	68.9
ఎంఎంఆర్	41.8	53.7
పుణే	41.5	30.1
చెన్నై	35.9	34.5
కోల్‌కత్తా	3.2	6.5

4 శాతం పెరిగిన అద్దెలు..

ఏడాది కాలంలో ఆఫీసు స్పేస్ అద్దెలు 4 శాతం మేర పెరిగాయి. నగరాల వారీగా చూస్తే.. అత్యధికంగా పుణే, బెంగళూరులో ఆఫీసు రెంట్లు పెరిగాయి. పుణేలో 10 శాతం, బెంగళూరులో 9 శాతం అద్దెలు వృద్ధి చెందగా.. హైదరాబాద్‌లో 7 శాతం మేర పెరిగాయి. అత్యంత ఖరీదైన ఆఫీసు స్పేస్ మార్కెట్‌గా ఎంఎంఆర్ నిలిచింది. ఇక్కడ చ.అ. అద్దె నెలకు రూ.132 కాగా.. బెంగళూరులో రూ.85, ఎన్‌సీఆర్‌లో రూ.82, కోల్‌కత్తాలో రూ.54గా ఉన్నాయి.



ప్రతి ఐదుగురిలో ఒకరు ప్రవాసులే!

- ఎన్నారై పెట్టుబడులు రెట్టింపు
- గృహ విభాగంలో 20 శాతానికి చేరిక

సాక్షి, హైదరాబాద్: దేశీయ స్థిరాస్తి రంగంలో ప్రవాస భారతీయులు (ఎన్నారై) పెట్టుబడులు పెరిగాయి. ప్రత్యేకంగా కరోనా తర్వాతి నుంచి గృహ విభాగంలో ఎన్నారై ఇన్వెస్ట్‌మెంట్లు రెట్టింపయ్యాయి. ప్రముఖ, బ్రాండెడ్ నిర్మాణ సంస్థలలో ప్రతి ఐదుగురిలో ఒకరు ఎన్నారై కస్టమర్లే ఉంటున్నారని ఇండియా సోథెబేష్ ఇంటర్నేషనల్ రియల్టీ సర్వే వెల్లడించింది. కరోనా కంటే ముందు ప్రీమియం, లగ్జరీ ప్రాజెక్ట్‌ల అమ్మకాలలో ఎన్నారైల వాటా 10 శాతం కంటే తక్కువగా ఉండేదని.. మహమ్మారి తర్వాతి నుంచి 20 శాతానికి చేరిందని తెలిపింది.

తొలి మూడేళ్లలో కొనేస్తున్నారు..

సొంతూర్లలో ఉండే తల్లిదండ్రులను సిటీకి తీసుకురావాలనే భావన ప్రవాసులలో పెరిగింది. దీంతో అమెరికా వెళ్లిన హైదరాబాదీలు తొలి మూడేళ్లలో నగరంలో అపార్ట్‌మెంట్ కొనేస్తున్నారని గిరిధారి హోమ్స్ ఎండీ ఇంద్రసేనా రెడ్డి అభిప్రాయపడ్డారు. కొందరు యువ ఎన్నారైలైతే బృందంగా ఏర్పడి, శివారు ప్రాంతాలలో పెద్ద ఎత్తున భూములను కొనుగోలు చేసి, స్థానిక డెవలపర్ భాగస్వామ్యంతో స్థిరాస్తి రంగంలోకి ఎంట్రీ ఇస్తున్నారని చెప్పారు. విదేశాలలో జరిగే ప్రాపర్టీ షోలలో హైదరాబాద్ డెవలపర్లు పాల్గొని ప్రాపర్టీలను ప్రదర్శిస్తున్నారు. ప్రాపర్టీ పోర్టళ్లు, విదేశాలలో బ్రాంచ్ ఆఫీసులను తెరిచి, హైదరాబాద్ అభివృద్ధి, ఇక్కడ ప్రాపర్టీలను రకరకాల మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ.. ఎన్నారైలను ఆకర్షిస్తున్నారు.

ఏం కొంటున్నారంటే..

దేశీయ స్థిరాస్తి రంగంలో ప్రవాసుల ప్రాధాన్యాలు మారుతున్నాయి. గతంలో వాణిజ్య సముదాయాలలో పెట్టుబడులకు ఆసక్తి చూపించిన ప్రవాసులు.. క్రమంగా గృహ విభాగంపై కూడా దృష్టిసారించారు. లగ్జరీ, అల్ట్రా ప్రీమియం, లగ్జరీ విల్లాలు, విల్లామెంట్లు, ఉమ్మడి అపార్ట్‌మెంట్ల భవన సముదాయం (కండోమీనియం), బ్రాండెడ్ గృహాల కోసం సంపన్న కొనుగోలుదారులు ఆసక్తిగా ఉన్నారు. దుబాయ్, సింగపూర్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ), ప్రవాసులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రియల్టీలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు.

డాలర్ విలువ పెరగడమే..

సరళీకృత పన్ను విధానం, ప్రాపర్టీ విలువలు, ధరల వృద్ధి, సులువైన కరెన్సీ ఎక్స్ఛేంజ్, డిజిటలైజేషన్, పారదర్శక నిబంధనలు వంటి కారణంగా గత మూడేళ్లుగా దేశీయ స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు ప్రవాసుల ఆసక్తి పెరిగింది. రూపాయితో పోలిస్తే డాలర్ విలువ పెరగడంతో స్వదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన తరుణమని ఎన్నారైలు భావిస్తున్నారు. వచ్చే రెండేళ్లలో దేశంలో లగ్జరీ ప్రాపర్టీలను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. విశ్వసనీయమైన, మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న డెవలపర్‌కు ఎన్నారై కస్టమర్లకు కొరత లేదు. నిర్మాణంలో నాణ్యత, ఆధునిక వసతులు, గడువులోగా నిర్మాణం పూర్తి, ప్రాపర్టీ ధరల వృద్ధి ఇవే స్థిరాస్తి కొనుగోళ్లలో ప్రవాసుల ఎంపికలు.

ద్వితియార్థంలో మెరుగు

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఆఫీసు స్పేస్ రియల్టీలో బలమైన వృద్ధి కనిపించింది. అయితే ద్వితీయార్థంలో ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో మందగమనం కారణంగా భారత ఆఫీసు మార్కెట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయని అనరాక్ గ్రూప్ రీసెర్ప్ హెడ్ ప్రశాంత్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ ఉద్యోగుల తొలగింపులు, ఆర్థిక మందగమనం వంటి పలు కారణాలతో సమీప భవిష్యత్తులోనూ ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. చాలా వరకు ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు వ్యాపార కార్యకలాపాలను, కొత్త నియామకాలను తగ్గించుకుంటున్నాయని.. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పనితీరును బట్టి 2024 ద్వితీయార్థంలో కొంత మెరుగు పడే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు.

మే నెలలో 31 శాతం వృద్ధి

- 5,877 అపార్ట్‌మెంట్లు రిజిస్ట్రేషన్
- వీటి విలువ రూ.2,994 కోట్లు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో మే నెలలో 5,877 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్స్ అయ్యాయి. వీటి విలువ రూ.2,994 కోట్లు. ఏప్రిల్‌లో రూ.2,286 కోట్లు విలువ చేసే 4,494 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్స్‌తో పోలిస్తే మేలో 31 శాతం వృద్ధి నమోదయిందని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. రూ.50 లక్షల లోపు ధర ఉండే మధ్య తరగతి గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. గత నెలలో జరిగిన రిజిస్ట్రేషన్లలో 55 శాతం ప్రాపర్టీలు రూ.25-50 లక్షలు మధ్య ధర ఉన్న గృహాలే. రూ.కోటిపైన ధర ఉన్న ప్రాపర్టీల వాటా ఏప్రిల్‌లో 6 శాతంగా ఉండగా.. మే నాటికి 9 శాతానికి పెరిగింది. అలాగే 1,000 నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం గృహాల వాటా 70 శాతంగా ఉంది.

ఐటీ పవర్ హౌస్‌లుగా పట్టణాలు

హైదరాబాద్‌లా తీర్చిదిద్దేందుకు హబ్‌ల నిర్మాణం

- ఇప్పటికే నాలుగు చోట్ల కంపెనీల కార్యకలాపాలు
- మరో నాలుగు చోట్ల చివరి దశలో ఐటీ హబ్‌లు
- రెండేళ్లలో 25 వేల ఉద్యోగాలు, 5 శాతం ఎగుమతులు లక్ష్యం
- 15న సిద్దిపేట హబ్‌ను ప్రారంభించనున్న కేటీఆర్, హరీశ్



సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలను 'పవర్ హౌస్'లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలుచోట్ల 'ఐటీ హబ్'లను నిర్మిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ రెండో ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) పాలసీ (2021-26) ప్రకారం వచ్చే రెండేళ్లలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో 25 వేల ఐటీ ఉద్యోగాల కల్పనతో పాటు, రాష్ట్ర ఐటీ ఎగుమతుల్లో 5 శాతం ఇక్కడి నుంచే సాధించేలా సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ప్రభుత్వం ఇప్పటికే నిర్మించిన ఐటీ హబ్‌లతో పాటు ఇతర ప్రైవేటు సంస్థల ద్వారా 9 వేల ఐటీ ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో టీఎస్ఐఐసీ ద్వారా నిర్మించిన 'ఐటీ హబ్'ల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇక నల్లగొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేటల్లో ఐటీ హబ్‌ల నిర్మాణం పనులు చివర దశకు చేరుకున్నాయి. ఈ నెల 15న సిద్దిపేట ఐటీ హబ్‌ను రాష్ట్ర మంత్రులు కేటీ రామారావు, హరీశ్‌రావుతో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు వరంగల్, ఖమ్మం ఐటీ హబ్‌లలో సీటింగ్ సామర్థ్యానికి మించి ఐటీ కంపెనీల నుంచి డిమాండ్ ఉండటంతో ఆయా ప్రాంతాల్లో రెండో దశ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. వరంగల్ ఐటీ హబ్ రెండో దశ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, ఖమ్మంలోనూ త్వరలో ప్రారంభం కానున్నాయి.

పట్టణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి

ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు ఐటీ రంగ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా ఉద్యోగాల కల్పనతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇప్పటికే వరంగల్ లాంటి పట్టణాల్లో టెక్ మహీంద్ర, సియాంట్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, జెన్ పాక్ట్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలు విస్తరించాయి. వరంగల్ ఐటీ హబ్‌లోనే ఏకంగా 2,500 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. స్టార్టప్‌లను ప్రోత్సహించడం, నైపుణ్య శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా టీ హబ్, 'టాస్క్', వీ హబ్ వంటి సంస్థలు కూడా తమ ప్రాంతీయ కార్యాలయాలను ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని ఐటీ హబ్‌లలో ఏర్పాటు చేస్తున్నాయి. స్థానికంగా ఏర్పాటయ్యే ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు టాస్క్ నిరంతర శిక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. సిద్దిపేటలో ఈ నెల 15న ప్రారంభమయ్యే ఐటీ హబ్‌లోనూ టాస్క్ ద్వారా ప్రతి బ్యాచ్‌లో 150 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానికంగా ఏర్పాటవుతున్న ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించే దిశగా ఐటీ శాఖ సన్నాహాలు చేస్తోంది.

పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా..

ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ హబ్‌ల నిర్మాణంతో కంపెనీలను ఆకర్షించేందుకు ఐటీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇటీవలి యూకే, అమెరికా పర్యటనల్లో మంత్రి కేటీ రామారావు ఎన్ఆర్ఐ సీఈఓలతో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నల్లగొండ ఐటీ హబ్‌లలో కంపెనీల ఏర్పాటుకు అనేక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. సొనాటా సంస్థ నల్లగొండ ఐటీ టవర్‌లో 200 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చింది.

వనపర్తి, రామగుండంలోనూ..

ప్రస్తుతం కరీంనగర్, బెల్లంపల్లి వంటి పట్టణాల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఐటీ హబ్‌లలోనే కాకుండా పలు ప్రైవేటు సంస్థలు అద్దె భవనాల్లో ఐటీ కంపెనీలు నిర్వహిస్తున్నాయి. కరీంనగర్‌లో ఎక్లాట్ సొల్యూషన్స్ అనే కంపెనీ సుమారు వేయి మందికి ఉద్యోగాలు ఇచ్చింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐటీ హబ్‌లతో పాటు కొత్తగా వనపర్తి, రామగుండంలోనూ ఐటీ హబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. భవిష్యత్తులో కనీసం 500 సీటింగ్ కెపాసిటీతో చిన్న పట్టణాల్లో మరిన్ని ఐటీ హబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

– జయేశ్ రంజన్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి

30% మందికి బీపీ.. 9.9% మందికి షుగర్




దీర్ఘకాలిక వ్యాధుల బారిన తెలుగు రాష్ట్రాల ప్రజలు

- ఐసీఎంఆర్ సర్వే వివరాలు వెల్లడించిన లాన్సెట్ జర్నల్
- రెండు రాష్ట్రాల్లోనూ 25 శాతం కంటే ఎక్కువగా ఊబకాయులు
- దేశవ్యాప్తంగా 11.4 శాతం మందికి డయాబెటిస్
- గోవాలో అత్యధికంగా 26 శాతం మందికి.. యూపీలో అతి తక్కువగా 4.8 శాతం మందికి

సాక్షి, హైదరాబాద్: అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం (డయాబెటిస్/షుగర్) తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ..తద్వారా జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు, ఇతర కారణాలతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. 30 శాతం మంది హైబీపీతో బాధ పడుతుండగా, 9.9 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. దేశంలో డయాబెటిస్, బీపీ, కొలెస్ట్రాల్ వంటి వాటిపై భారత వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్) అధ్యయనం చేసింది. 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 20 ఏళ్లకు పైబడిన వారిపై సర్వే జరిపింది. జనాభా, ప్రాంతాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. దేశవ్యాప్తంగా 1.13 లక్షల మందిని సర్వే చేశారు. 79,506 మంది గ్రామీణులు, 33,537 మంది పట్టణ ప్రాంత ప్రజల (మొత్తం 1.13 లక్షల మంది) ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. 2008 అక్టోబర్ 18 నుంచి 2020 డిసెంబర్ 17 వరకు ఐదు దశల్లో రాష్ట్రాల వారీగా కొనసాగిన సర్వే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జరిగింది. ఆ వివరాలను తాజాగా లాన్సెట్ జర్నల్ ప్రచురించింది.

పట్టణాల్లోనే ఎక్కువ..

తెలుగు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 30 శాతం మందికి పైగా హైబీపీతో బాధపడుతుండగా, గ్రామాల్లో 25–30 శాతం మంది బాధపడుతున్నారు. రెండు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 10 శాతం కంటే ఎక్కువగా మధుమేహ బాధితులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 7.4 శాతంగా ఉంది. ఇక 15 శాతం మంది వరకు ప్రీ డయాబెటీస్ (వ్యాధికి ముందు దశ) స్థితిలో ఉన్నారు. పట్టణాల్లో ఇది 10–15 శాతంగా ఉంది. తెలంగాణ గ్రామాల్లో ప్రీ డయాబెటీస్ 15 శాతం వరకు ఉండగా, ఏపీలోని గ్రామాల్లో 10 శాతం వరకు ఉంది.



పంజాబ్‌లో 51.8 శాతం మందికి హైబీపీ

దేశవ్యాప్తంగా 11.4 శాతం మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నట్లు సర్వే నిర్ధారించింది. డయాబెటిస్ ముందు దశలో 15.3 శాతం మంది ఉన్నారు. 35.5 శాతం బీపీతో బాధపడుతుండగా, 28.6 శాతం మంది ఊబకాయంతో ఉన్నారు. పొట్ట దగ్గర కొవ్వు ఎక్కువ ఉన్నవారు 39.5 శాతం మంది ఉన్నారు. రక్తంలో కొవ్వు శాతం అధికంగా ఉన్నవారు 81.2 శాతం ఉన్నారు. అత్యధికంగా గోవాలో 26.4 శాతం మందికి డయాబెటిస్ ఉంది. అతి తక్కువగా యూపీలో 4.8 శాతం మందికి ఉంది. బీపీ బాధితులు అత్యధికంగా పంజాబ్‌లో 51.8 శాతం మంది ఉన్నారు. అత్యంత తక్కువగా మేఘాలయలో 24.3 శాతం మంది ఉన్నారు. దేశంలో ఊబకాయులు 28.6 శాతంగా ఉన్నారు. పాండిచ్చేరిలో ఎక్కువ (53.3 శాతం) మంది, జార్ఖండ్‌లో తక్కువ (11.6 శాతం) మంది ఊబకాయ బాధితులు ఉన్నారు.

మరికొన్ని ముఖ్యాంశాలు..

- ఉమ్మడి ఏపీలో ఊబకాయులు 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. పట్టణాల్లో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. తెలంగాణ గ్రామాల్లో 20 శాతం వరకు ఉన్నారు. గ్రామీణ ఏపీలో 20–25 శాతం మధ్య ఉన్నారు.
- పొట్ట దగ్గర అధిక కొవ్వు పేరుకుపోయిన వారు ఉమ్మడి ఏపీలో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు.
- రక్తంలో అధిక కొలెస్ట్రాల్ ఉభయ రాష్ట్రాల్లోని 20–25 శాతం మందికి ఉంది. అర్బన్ తెలంగాణలో ఇది 20–25 శాతంగా, ఏపీలో 25 శాతం కంటే ఎక్కువగా ఉంది. గ్రామీణ తెలంగాణలో 20–25 శాతం మధ్య, గ్రామీణ ఏపీలో 15–20 శాతం మధ్య ఉంది.
- మంచి కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్నవారు తెలంగాణలో 50–60 శాతం మంది ఉండగా, ఏపీలో 60 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 15–20 శాతం మందికి చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంది. రెండు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 20–25 శాతం మందికి చెడు కొలెస్ట్రాల్ ఉంది.

అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో డయాబెటిస్ అధికం

అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో డయాబెటిస్ అధికంగా ఉంది. చాలా జబ్బులు పట్టణాల్లో ఉన్నాయి. ప్రీ డయాబెటిస్ గ్రామాల్లో ఎక్కువగా ఉంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రాష్ట్రాల్లో షుగర్ తక్కువగా ఉంది. దీర్ఘకాలిక జబ్బులు అధికంగా ఉన్నాయని అధ్యయనం తేల్చింది. ప్రీడయాబెటిస్ స్థితిలో ఉన్నవారిని డయాబెటిస్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. అధిక షుగర్ బాధితుల్లో తదుపరి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. –ప్రొఫెసర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ విభాగాధిపతి, నిజామాబాద్ మెడికల్ కాలేజీ



బస్సులో టైగర్స్ ఫొటో ఎగ్జిబిషన్

పులుల సంరక్షణపై అవగాహనకు టీఎస్ఆర్టీసీ వినూత్న ప్రయత్నం

బంజారాహిల్స్: పులుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జీవవైవిధ్యంలో పులుల ప్రాముఖ్యతను వివరించేందుకు దేశంలోనే తొలిసారిగా 'హైదరాబాద్ ఆన్ వీల్స్'బస్సులో టైగర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. పులుల సంరక్షణ, తగ్గిపోతున్న పులుల సంఖ్య పెంచేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ టైగర్'50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామాజిక బాధ్యతగా, ఇండియన్ ఫోటో ఫెస్టివల్(ఐపీఎఫ్), ఐసీబీఎం–స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్స్‌లెన్స్ సహకారంతో టీఎస్ఆర్టీసీ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించింది. ఐసీబీఎం–స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్స్‌లెన్స్ డీన్(అకడమిక్స్), వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ప్రొఫెసర్ జితేందర్ గోవిందాని తీసిన పులుల ఫొటోలను టీఎస్ఆర్టీసీ ప్రదర్శిస్తోంది.

పులుల ఆవాసాలతో జీవవైవిధ్యం : దోబ్రియాల్

ఈ ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(పీసీసీఎఫ్) రాకేశ్ మోహన్ డోబ్రియాల్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హైదరాబాద్‌లోని కేబీఆర్‌పార్క్ ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభించారు. పులుల ఆవాసాలున్నచోట జీవవైవిధ్యం ఉంటుందని డోబ్రియాల్ వెల్లడించారు. టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. పులులను సంరక్షిస్తే పర్యావరణాన్ని సంరక్షించినట్లేనన్నారు.

నకిలీ పత్తి విత్తన విక్రేతల అరెస్ట్

3.35 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు, 14,850 ఖాళీ ప్యాకెట్లు సీజ్



సైబరాబాద్ కమిషనరేట్‌లో నకిలీ విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

హఫీజ్‌పేట్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఆయన సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం విలేకరులకు అందించిన వివరాలివి. నకిలీ విత్తనాల ప్రధాన సూత్రధారి, నిర్మల్ జిల్లా భైంసా కోర్బ గల్లీకి చెందిన అబ్దుల్ రజాక్ (59) పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన రజాక్.. తన స్నేహితులు జానీ, హరీశ్, శ్రీనివాస్, ఐలయ్య, మల్లికార్జున్‌లతో కలిసి భారత ప్రభుత్వం నిషేధించిన బీజీ–3/హెచ్‌టీ కాటన్ సీడ్స్‌ను, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలో గోడౌన్‌లో నిల్వ ఉంచాడు. విషయం తెలుసుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ, మేడ్చల్ జోన్ లోకల్ పోలీసుల సహాయంతో గోడౌన్‌పై దాడి చేశారు. 2530 కిలోల బీజీ–111/హెచ్‌టీ నకిలీ పత్తి విత్తనాలు, 2900 ప్రణతి పత్తి విత్తనాల ఖాళీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న అయిదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చేవెళ్ల పరిధిలో..: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన కొత్త తుర్క అలీషా (43) కర్నూల్‌లోని గౌతమి విత్తనాల కంపెనీలో ఆర్గనైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీలో 5 టన్నుల విత్తనాలు, అంకురోత్పత్తి పరీక్షలలో విఫలమైన 800 కిలోల పత్తి విత్తనాలను రైతులకు విక్రయించాలనే ఆలోచనతో హైదరాబాద్ నగరం ఉప్పల్‌కు చెందిన ఉబ్బని రాజు, తిప్పరబోయిన వెంకటేష్, సోమ్‌గని వేణు, కావలి మల్లయ్యలతో కలిశాడు. 15 బ్యాగుల్లోని సుమారు 800 కిలోల విత్తనాలను.. పల్లవి సీడ్స్ అనే సంస్థ పేరుపై ఉన్న 88 ప్యాకెట్లలో ప్యాక్ చేసి చేవెళ్లలో రైతులకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, వ్యవసాయ అధికారులు, చేవెళ్ల పోలీసులు అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 800 కిలోల విత్తనాలున్న 15 బ్యాగులు, 88 ప్యాకెట్లు, 4 సెల్‌ఫోన్లు, 1 కీ ప్యాడ్, వివిధ విత్తన సంస్థలకు చెందిన 14850 ఖాళీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అయిదుగురు నిందితులపై రెండు కేసులు నమోదు చేశారు.

మావోయిస్టు మహిళా దళ కమాండర్ అరెస్టు

పోలీసులను హతమార్చేందుకు వచ్చి పట్టుబడిన బుజ్జి

కొత్తగూడెంటౌన్/మంగపేట: పోలీసులను హతమార్చాలనే లక్ష్యంతో దళ సభ్యులు, మిలీషియా సభ్యులతో కలసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చిన ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు ఎల్ఓఎస్ మహిళా దళ కమాండర్ బుజ్జి పోలీసులకు పట్టుబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం కొత్తగూడెంలో వివరాలను వెల్లడించారు. భద్రాద్రి జిల్లా చర్ల మండల పరిధిలో శుక్రవారం ఉదయం చర్ల పోలీసులు, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అందులో ఒకరిని పామేడు మహిళా దళ కమాండర్ గొట్టా బుజ్జి అలియాస్ కమలగా గుర్తించి ఆమెను అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చర్లపల్లికి చెందిన బుజ్జి 2008లో మావోయిస్టు పార్టీలో చేరింది.

పోలీసుల అదుపులో మావోలు?

ములుగు జిల్లా సరిహద్దు గ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జానంపేటకు చెందిన ఇద్దరు మావోయిస్టులను మంగపేట, ఏటూరునాగారం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై వివరణ కోరేందుకు ఏటూరునాగారం సీఐకి ఫోన్ చేయగా స్పందించలేదు.

ధరణితో రైతుల హక్కులకు విఘాతం

- సమస్యలు పరిష్కరించకుండా మాపై విమర్శలు చేయడం తగదు
- బహుళజాతి కంపెనీలకు దళారీగా మంత్రి కేటీఆర్
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



గన్నెర్లపల్లి గ్రామంలో కూలీలతో కలిసి పత్తి విత్తనాలు విత్తుతున్న భట్టి విక్రమార్క

చందంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భట్టి పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శుక్రవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి.. రైతులు, ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చందంపేట మండలంలోని గన్నెర్లపల్లి గ్రామంలో కూలీలు పత్తి విత్తనాలు విత్తుతున్న సమయంలో ఆయన వారితో కలసి విత్తనాలు నాటారు. అనంతరం భట్టి ఇదే గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణి అనే పోర్టల్‌ను తీసుకొచ్చి.. కబ్జాలో ఉన్న రైతుల పేర్లు తీసేసి గతంలో ఎప్పుడో దొరలు, 70 ఏళ్ల క్రితం ఉన్న భూస్వాముల పేర్లు మళ్లీ ధరణి సాఫ్ట్‌వేర్‌లో చూపిస్తున్నారని, దీంతో 70 ఏళ్లుగా భూమి సేద్యం చేసుకుంటూ కాస్తులో ఉన్న రైతుల పేర్లు లేకుండా పోయాయని అన్నారు. ఫలితంగా అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణిలో మార్పులు చేస్తామని తాము మాట్లాడుతుంటే అటు కేసీఆర్ ఇటు కేటీఆర్ మతిభ్రమించి సన్నాసులు.. అని మాట్లాడుతున్నారని, వారు ధరణితో ఎవరికి న్యాయం చేశారో చెప్పాలని నిలదీశారు. తాను పాదయాత్ర చేసుకుంటూ వస్తున్న క్రమంలో ధరణి వల్ల భూములపై హక్కులను కోల్పోయిన రైతులు తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించకుండా.. సన్నాసి యాత్రలు అంటూ తమపై విమర్శలు చేయడం తగదని, దీనిని వారి సభ్యత, సంస్కారాలకే వదిలేస్తున్నానని అన్నారు. తనకు సభ్యత, సంస్కారం ఉంది కాబట్టే కేసీఆర్‌గారు, కేటీఆర్‌గారు అని సంబోధిస్తున్నానని పేర్కొన్నారు. ఈ ధరణి పోర్టల్ తీసుకొచ్చి దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి పాల్పడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన శాస్తి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నేతల అవినీతి బాగోతం బట్టబయలు అవుతుందన్నారు. మంత్రి కేటీఆర్ బహుళ జాతి కంపెనీలకు దళారీగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

1,000 కిలోమీటర్లకు చేరిన భట్టి యాత్ర

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా దేవరకొండకు చేరుకుంది. దీంతో ఆయన పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లకు చేరుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శనివారం దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ముందు షేజల్ నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని బీఆర్ఎస్ కార్యాలయం ముందు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నుంచి రక్షణ కల్పించాలంటూ ఆరిజన్ డెయిరీ సీఈవో షేజల్ నిరసనకు దిగారు. శుక్రవారం మధ్యాహ్నం ఫ్లెక్సీతో బీఆర్ఎస్ కార్యాలయం ముందు తన నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వల్ల ఇబ్బందులు పడుతున్న మహిళల్ని సీఎం కేసీఆర్ రక్షించాలని, ఎమ్మెల్యే అక్రమాల మీద విచారణ జరిపించాలని షేజల్ డిమాండు చేశారు.

నాన్‌కేడర్ ఎస్పీలుగా 18 మంది అడిషనల్ ఎస్పీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీలకు ఎస్పీ(నాన్‌కేడర్)లుగా పదోన్నతి లభించింది. అదేవిధంగా 35 మంది సివిల్ డీఎస్పీలకు నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి జితేందర్ శుక్రవారం రెండు ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన నాన్‌కేడర్ ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలను శుక్రవారం నుంచి 15 రోజుల్లోగా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పదోన్నతులు లభించినా, ఎవరికి కూడా ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వలేదు. కాగా, రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం అడిషనల్ ఎస్పీలకు నాన్‌కేడర్ ఎస్పీలుగా, సివిల్ డీఎస్పీలకు నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించడం సంతోషంగా ఉందని డీజీపీ అంజనీకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ట్వీట్ చేశారు. పదోన్నతులు పొందిన అధికారులకు శుభాకాంక్షలు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐదారు రోజుల్లో రాష్ట్రానికి నైరుతి!

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- రెండ్రోజుల్లో ఏపీకి..
- రాష్ట్రంలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు
- కరీంనగర్ జిల్లా తంగులలో 46.5 డిగ్రీలు నమోదు
- నేడు పలు జిల్లాల్లో వడగాడ్పులు
- కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు!

సాక్షి, హైదరాబాద్: కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు తెలంగాణపై ప్రభావం చూపించేందుకు ఐదారు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 48 గంటల్లోగా కేరళ అంతటా విస్తరించడంతో పాటు తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని వెల్లడించింది. రెండ్రోజుల్లో ఏపీలోని రాయలసీమను తాకే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కాగా రుతుపవనాలు ఆలస్యం కావడంతో రాష్ట్రంలో పలుచోట్ల ఇప్పటికీ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం కరీంనగర్ జిల్లా తంగులలో ఏకంగా 46.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా, అనేక జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. రాజధాని హైదరాబాద్‌లో 39.7 డిగ్రీలుగా నమోదయ్యింది. శనివారం ఖమ్మం నల్లగొండ, సూర్యాపేట, కొత్తగూడెం, అదిలాబాద్, కొమరం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ఒడిశాలో సముద్ర మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఒక ఆవర్తనం వ్యాపించి ఉంది. దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయువ్య, పశ్చిమ దిశల నుండి తెలంగాణ వైపు వీస్తున్నాయి. ఈ కారణంగా శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

శుక్రవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత	ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల (కరీంనగర్)	46.5	ఖమ్మం	44.0
జంబుగ (కొమురం భీం)	45.7	నల్లగొండ	43.5
బూర్గంపహాడ్ (భద్రాద్రి కొత్తగూడెం)	45.7	రామగుండం	43.0
యానంబైలు (భద్రాద్రి కొత్తగూడెం)	45.6	ఆదిలాబాద్	42.8
వీణవంక (కరీంనగర్)	45.5	హనుమకొండ	41.5
అశ్వాపురం (భద్రాద్రి కొత్తగూడెం)	45.1	నిజామాబాద్	41.1
కుంచవెల్లి (కొమురం భీం)	45.1	మెదక్	41.0
ఏడూళ్ల బయ్యారం (భద్రాద్రి కొత్తగూడెం)	45.0	హైదరాబాద్	39.7
భద్రాచలం	44.5	మహబూబ్‌నగర్	38.7

ధరణిని బరాబర్ రద్దు చేస్తాం

- యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్
- ధరణి రాకముందు గ్రామాల్లో రికార్డులు లేవా?
- భూస్వాములకోసమే ధరణి
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం.. కేటీఆర్, హరీశ్ సిద్ధమా?
- సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మేనిఫెస్టో



మాట్లాడుతున్న రేవంత్. పక్కన మాణిక్‌రావ్ ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను బరాబర్ రద్దు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గడీల పాలన పునరుద్ధరణ కోసమే కేసీఆర్ ధరణిని తీసుకువచ్చారని, ఈ పోర్టల్ ద్వారా బినామీల పేరిట వేల ఎకరాలను కొట్టేశారని ఆరోపించారు. 'కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణిని తెచ్చారు. 97 శాతం భూ వివాదాలకు ధరణి పోర్టలే కారణం. దీనిని ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా రద్దు చేస్తాం'అని ప్రకటించారు. యువజన కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం క్షత్రియా హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ కారణంగా ప్రభుత్వ అధికారుల వద్ద ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిందని, ధరణిలో అవకతవకలకు కారణమైన అధికారులు ఊచలు లెక్కపెట్టక తప్పదని హెచ్చరించారు. 'ధరణి రాకముందు రైతుబంధు రాలేదా? భూముల రికార్డులు లేవా? ధరణిని రద్దు చేస్తామంటే కేసీఆర్‌కు ఎందుకంత దుఃఖం వస్తోంది?'అని ప్రశ్నించారు. ధరణి విషయంలో కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి కోసం చర్లపల్లి జైల్లో డబుల్‌బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని రేవంత్ పేర్కొన్నారు.

యువత ముందుండాలి

రాష్ట్రంలో కేసీఆర్‌పై చేసే పోరాటంలో గెలవాలంటే యువత ముందుండాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా యూత్ కాంగ్రెస్ శ్రమించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఒక్క అవకాశాన్ని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని కోరారు. పార్టీ మేనిఫెస్టోను తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17న విడుదల చేస్తామని చెప్పారు. దేశంలో డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అని, దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజిన్ పని అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రద్దయిన వెయ్యినోటు లాంటి వారయితే, మోదీ.. వెనక్కు తీసుకున్న రెండు వేల రూపాయల నోటు లాంటివారని ఎద్దేవా చేశారు. మోదీ, కేసీఆర్‌లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీలంగా పనిచేయాలని రేవంత్ వ్యాఖ్యానించారు.

చర్చకు మేం సిద్ధం

ఈ సమావేశం అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక, అంతకుముందు జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంలో మంత్రి కేటీఆర్ చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని రేవంత్ అన్నారు. '2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, 2014 తర్వాత జరిగిన అభివృద్ధిపై చర్చకు కేటీఆర్, హరీశ్‌లు సిద్ధమా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేయనిది ఏదైనా బీఆర్ఎస్ చేసి ఉండే క్షమాపణలు చెప్పడానికి తాము సిద్ధమని ప్రకటించారు. 'కాంగ్రెస్ ఏం చేసిందని తండ్రీ కొడుకులు అడుగుతున్నారు. కేసీఆర్‌లా మేం రాష్ట్రాన్ని కొల్లగొట్టం. ప్రజలు ఎవరిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారో త్వరలోనే తెలుస్తుంది'అని వ్యాఖ్యానించారు.

డీకే అరుణ బీజేపీ అధ్యక్షురాలయితే మంచిదే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా మాజీ మంత్రి డి.కె.అరుణను నియమిస్తే మంచిదేనని, అప్పుడు రాష్ట్రంలో బీజేపీని కూడా కాంగ్రెస్ వాళ్లే నడిపిస్తున్నట్టు అవుతుందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అరుణని అధ్యక్షురాలిగా నియమిస్తే బీజేపీని నడిపే బలం ఆ పార్టీ వాళ్లకి లేదని ఒప్పుకున్నట్టే అవుతుందని చెప్పారు. తెలంగాణలో ఏముందని షర్మిల పార్టీతో పొత్తు పెట్టుకుంటామని, పొత్తులయినా, టికెట్లయినా పార్టీ అధిష్టానమే చూసుకుంటుందని చెప్పారు. కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరన్న మంత్రి కేటీఆర్ ప్రశ్నకు స్పందిస్తూ.. తమ పార్టీ సీఎం అభ్యర్థి ఎవరో చెపితే బీఆర్ఎస్ దుకాణాన్ని బంద్ చేసుకుంటారా? అని ప్రశ్నించారు. తమ పార్టీలోకి ఎవరైనా రావచ్చని, అయితే టికెట్‌పై మాత్రం గ్యారంటీ ఇవ్వలేమని రేవంత్ వ్యాఖ్యానించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 10-6-2023

న్యూస్ మేకర్

ఎడారి చిరుత




ప్రపంచంలో అత్యంత కష్టమైన మారథాన్ 'సహారా మారథాన్'. ఆరు రోజుల పాటు సహారా ఎడారిలో 250 కిలోమీటర్లు నడవాలి. ఒక్క ఒయాసిస్సు కూడా తగలని ఈ దారిలో ప్రాణం కూడా పోవచ్చు. ఇంతటి ప్రమాదకరమైన పోటీలో భారతీయ మహిళ మహాశ్వేతా ఘోష్ మొదటిసారి పాల్గొని మారథాన్ పూర్తి చేసింది. ఆమె పరిచయం.

'మారథాన్ డెస్ సేబుల్స్' లేదా 'మారథాన్ ఆఫ్ ది శాండ్స్' లేదా 'సహారా మారథాన్'లో పాల్గొనేవారి ధైర్యం ఏమిటో? మామూలుగా ఎండలో నడవడమే కష్టం. అలాంటిది ఎడారి ఎండలో నడవడం సామాన్యమా? మామూలు నేల మీద ఎక్కువసేపు నడవడం కష్టం. ఇక ఎడారి ఇసుకలో ఎక్కువ సేపు నడవడం సాధ్యమా? 44 ఏళ్ల మహాశ్వేతా ఈ అసాధ్యమైన మారథాన్‌ను పూర్తి చేయగలిగింది. అలా చేసిన తొలి భారతీయ మహిళగా రికార్డు స్థాపించింది. ఏప్రిల్ చివరి వారంలో మొదలయ్యి మే 1న ఈ మారథాన్ పూర్తయ్యింది.

ఎడారిలో సాహసవంతులు

'మారథాన్ ఆఫ్ ది శాండ్స్' 1986 నుంచి మొదలయ్యింది. 1984లో పాట్రిక్ బ్యూయెర్ అనే ఫ్రెంచ్ వ్యక్తి మొరాకోలోని సహారా ఎడారిలో 12 రోజుల పాటు ఒక్కడే 250 కిలోమీటర్లు ప్రయాణించాడు. అతడు ప్రయాణించిన దారిలో ఒక్క ఒయాసిస్సు కూడా లేదు. ఎడారి తండాలు కూడా కనిపించలేదు. అంటే ఈ దారి అల్ట్రా మారథాన్‌కు అనువైనదని భావించి రెండేళ్ల తర్వాత ఈ మారథాన్‌ను మొదలెట్టాడు. అయితే 2009 నాటికిగాని ఇది ఊపందుకోలేదు. ఆ సంవత్సరం వెయ్యి మంది సహారా మారథాన్‌లో పాల్గొన్నారు.

అడుగడుగునా సవాళ్లు

2023లో మారథాన్ ఆఫ్ ది శాండ్స్ ఏప్రిల్ చివరి వారంలో మొదలయ్యింది. భారతదేశం నుంచి మహాశ్వేతా ఘోష్ మాత్రమే హాజరయ్యింది. అనేక దేశాల నుంచి మొత్తం 1200 మంది పోటీదారులు వచ్చారు. 'మా అందరికీ 11 కిలోల బరువున్న బ్యాక్ ప్యాక్ మాత్రమే అనుమతించారు. రోజుకు 12 లీటర్ల నీళ్లు నిర్వాహకులు సప్లై చేశారు. అంతకుమించిన నీరు దొరకవు. ఎవరి ఆహారం వారు తినాలి. మారథాన్‌లో పెద్దగా స్నేహాలు ఏర్పడవు. పోటీ కాబట్టి ఎవరి లక్ష్యంలో వారు నడుస్తుంటారు. ఎడారి దారిలో 40 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వరకూ ఉండే ఎండలో నడవడం అంటే మాటలు కాదు. మాకు ప్రతిరోజూ లక్ష్యం ఇస్తారు. అంటే రోజుకు 70 నుంచి 90 కిలోమీటర్ల లక్ష్యానికి చేరుకోవాలి. ఇచ్చిన సమయంలో నిర్దేశిత దూరానికి చేరుకోలేకపోతే అక్కడితో వారు పోటీ నుంచి డిస్‌క్వాలిఫై అయిపోతారు. నేను ఎలాగైనా ఈ మారథాన్ పూర్తి చేయదలిచాను. అందుకే ఏ రోజు కూడా నిర్దేశిత గమ్యాన్ని తప్పలేదు. చాలామంది మధ్యలోనే ఆగిపోయారు' అని తెలిపింది మహాశ్వేతా.

లూజర్స్ స్ఫూర్తి

'మాది పశ్చిమ బెంగాల్. నేను కాలేజీలో చదివేప్పుడు సన్నబడటానికి నడకను, జాగింగ్‌ను సాధనంగా చేసుకున్నాను. అదే కొనసాగిస్తున్నాను. 2019లో నెట్‌ఫ్లిక్స్‌లోని లూజర్స్ సిరీస్ నాకు మారథాన్ ఆఫ్ శాండ్స్ గురించి తెలియజేసింది. అందులోని ఒక ఎపిసోడ్‌లో ఒలింపిక్ విజేత మారో ప్రాస్పెరీ మారథాన్ ఆఫ్ శాండ్స్‌ను ఎలా ముగించాడో వివరంగా చూపించారు. నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. అయితే ఎడారిలో మారథాన్ చాలా కష్టం. అందుకే రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నాకై నేను 75 కిలోమీటర్ల మారథాన్ సాధన చేసి ఈ అతికష్టమైన ఎడారి మారథాన్‌కు సిద్ధమయ్యాను' అని చెప్పింది మహాశ్వేతా ఘోష్.

పోహా, ఓట్స్

'నేను మారథాన్ సాగిన ఆరు రోజులు హల్దీరామ్ డీహైడ్రేటెడ్ దాల్ చావల్, రెడీ టు ఈట్ పోహా, న్యూట్రి బార్స్, చాక్లెట్లు, డ్రై ఓట్స్ తిన్నాను. తల మీద సోలార్ హ్యాట్, కూలింగ్ గ్లాసెస్, స్ట్రోలింగ్ స్టిక్స్, భుజాన బ్యాగ్‌తో మన నడక కొనసాగాలి. చివరిరోజు చివరి దశలో పరుగు తీయాలి. ఎండ మన సహనాన్ని పరీక్షిస్తుంది.

డీ–హైడ్రేట్ కాకుండా చూసుకోవాలి. చాలామంది తల మీద నీళ్లు పోసుకుంటారు. అలా పోసుకోవడం వల్ల వేడి ఇంకా పెరుగుతుంది. కేవలం మెడ, ముఖం తడుపుకుంటూ ముందుకు సాగాలి. గుడారంలో రాత్రిపూట విశ్రాంతిలో భాగ్ మిల్కా భాగ్‌లోని స్ఫూర్తిగీతం వినేదాన్ని' అని చెప్పిందామె.

భ్రాంతుల నుంచి

'ఎడారిలో భ్రాంతులు ఎక్కువ. వాటి మాయలో పడ్డామంటే చిక్కుల్లో పడతాం. ఈ ఎడారిలో నీకు ఎప్పటికీ నీళ్లు కనిపించవు. కనిపించే నీళ్లను నమ్మకు అని నా మనసుకు చెప్పుకున్నాను. ఏమంటే చాలాసార్లు ఎండమావులు కనిపిస్తాయి. షూస్‌లో ఇసుక దూరకుండా నడవడం పెద్ద విద్య. ఇన్ని కష్టాలు వద్దా అంతిమంగా యాత్ర ముగిస్తే కలిగే ఆనందం నిజంగా జీవితంలో ఒయాసిస్సులా ఉంటుంది' అందామె నవ్వుతూ.

నేటి అకేషన్‌కు.. అలనాటి డ్రెస్



పెళ్లిలో పెళ్లికొడుకు కంటే పెళ్లికూతురు ముస్తాబుకి కాస్త ఖర్చు ఎక్కువే. పెళ్లిరోజు ప్రత్యేకంగా కనిపించేందుకు ధరించే డ్రెస్‌ను ఏరికోరి ఎంచుకుని, దానికి మరికొన్ని అదనపు హంగులు జోడించి డ్రెస్‌ను అందంగా రూపొందించుకుని పెళ్లిలో ధరించి మురిసిపోతారు. అయితే ఎంతో తాపత్రయపడి, ఎంతో ఖరీదైన డ్రెస్ వేసుకున్నప్పటికీ పెళ్లి తరువాత ఆ డ్రెస్ బీరువాలకే పరిమితమవుతుంది. జీవితంలో మళ్లీ దానిని ధరించే సందర్భం రాదు, చివరికి తీపి జ్ఞాపకంగా మిగిలిపోవడం తప్ప మరే ప్రయోజనం కనిపించదు. ఈ నేపథ్యంలో ''ఇంత విలువైన డ్రెస్‌లను ఎందుకు వృథాగా పోనివ్వడం! అప్పుడప్పుడు ఏదైనా అకేషన్స్‌కు వాటిని ధరించండి! ఎంతో హుందాగా ఉంటుంది!'' అని చెబుతున్నారు అమెరికా అమ్మాయిలు. చెప్పడమేగాక తమ వెడ్డింగ్ డ్రెస్‌లు వేసుకుని డిన్నర్ చేసి సోషల్ మీడియా సాక్షిగా మురిసిపోతున్నారు.

టెక్సాస్‌కు చెందిన టెర్రీ బోనిన్‌కు పదకొండు మంది సంతానం. ఐదుగురు కొడుకులు, ఆరుగురు కూతుళ్లు. నెలకొకసారి తన సంతానంతో కలిసి బయటికి వెళ్లి విందు భోజనం చేయడం టెర్రీ ఇంటి సంప్రదాయం. భర్త లేకుండా కూతుళ్లు, కొడుకులు లేకుండా కోడళ్లతో కలిసి టెర్రీ బయట డిన్నర్ చేస్తుంది. అయితే టెర్రీ ఆరుగురు కూతుర్లులో ఒకరైన అలెక్సిస్ హ్యూస్టన్ ఈసారి డిన్నర్‌కు తమ పెళ్లినాటి డ్రెస్‌లు వేసుకోవాలని సూచించింది. ఇది అందరికి నచ్చడంతో టెర్రీ కూతుర్లు.. మెడిలీన్, అలెక్సిస్, అన్నెలీస్, కేట్‌లతోపాటు, కోడళ్లు .. హన్నా జాయ్, సిడ్నీలు తమ పెళ్లినాటి గౌన్లు ధరించారు. అంతా రెడీ అయ్యాక హ్యూస్టన్‌లో డిన్నర్‌కు వెళ్లారు.

ఏడుగురు ఒకే టేబుల్ మీద కూర్చొని రోస్టెడ్ వెజిటేబుల్స్, బర్గర్స్, గ్రెయిన్స్ బౌల్, చికెన్ వెరైటీలతో విందును ఆస్వాదించారు. కార్లను పార్కింగ్ చేసిన దగ్గర నుంచి టేబుల్ మీద డిన్నర్ చేస్తున్నంతవరకు వీరిని చూసిన వారంతా ఆశ్చర్యంగానూ, ఈ ఐడియా బావుందన్నట్లు చూశారు. కొంతమంది వారితో కలిసి ఫోటోలు తీసుకున్నారు. అలెక్సిస్ వెడ్డింగ్ డ్రెస్ డిన్నర్ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో యాభైలక్షల మందికిపైగా నెటిజన్లు చూశారు. వీరి ఐడియాను అభినందిస్తున్నారు. అయితే కూతుర్లు , కోడళ్లకు వారి పెళ్లి నాటి డ్రెస్‌లు పాడవకుండా చక్కగానే ఉన్నాయి. కానీ టెర్రీ పెళ్లిడ్రెస్ మాత్రం పాడైపోయింది. దీంతో ఏం చేయాలి అనుకున్న సమయంలో కేట్ స్కూలు కార్యక్రమంలో వేసుకున్న వెడ్డింగ్ డ్రెస్ టెర్రీకి సరిపోవడంతో కూతుళ్లు, కోడళ్లతో టెర్రీ కూడా డ్రెస్‌తో డిన్నర్ జాయిన్ అయ్యింది.





ఆనందం రెట్టింపు అయ్యింది

"ఖరీదైన వాటిని ఒక్కసారి వాడి పక్కన పెడితే ఏం బావుంటుంది? వాటిని ఇలా వాడితే పెట్టిన డబ్బులకు న్యాయం చేసిన వారమవుతాము. మమ్మల్ని నేరుగా చూసిన వారుగానీ, మా వీడియో చూసిన వారు మమ్మల్ని చాలా మెచ్చుకుంటున్నారు. ఐడియా బావుందని అభినందిస్తున్నారు. డ్రెస్ వేసుకున్నప్పుడు కలిగిన ఆనందం, అందరూ మెచ్చుకున్నప్పుడు రెట్టింపు అయ్యింది" అని టెర్రీ కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది.

ఈ అమ్మాయిల ఐడియా అదుర్స్ కదా! ఇంకెందుకు ఆలస్యం అకేషన్‌ను ప్లాన్ చేసి మీ పెళ్లిబట్టలను పెట్టెలో నుంచి తీసి ధరించి మురిసిపోండి.

* వరల్డ్ డాల్ డే

బొమ్మలకు ఒక రోజు



ఆత్మీయులకు బొమ్మలను కానుకగా ఇచ్చినా, వారి నుంచి అందుకున్నా శాంతి, సంతోషాలను రెట్టింపు చేయచ్చు. ప్రపంచంలోని విభిన్న సంస్కృతులను బొమ్మల సేకరణ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ప్రత్యేకతను తెలియజేయడానికి ప్రతి యేడాది జూన్ రెండవ శనివారం వరల్డ్ డాల్ డే ని జరుపుకుంటున్నారు డాల్ లవర్స్. చేతితో సొంతంగా తయారు చేసుకున్న బొమ్మల నుండి డిజైనర్ బొమ్మల సేకరణ వరకు ఈ డాల్ డే ని ప్రత్యేకంగా జరుపుకోవచ్చు.

మనసుల మధ్య ఆత్మీయతను, ఆనందాన్ని పెంపొందించే బొమ్మలు ఆ ఇంటివారితోనూ అనుబంధాన్ని కలిగి ఉంటాయి.

పంచుకోవడం నేర్పుతాయి

బొమ్మలు స్నేహాన్ని పెంపొందించడానికి సహాయపడతాయి. మూడేళ్లైనా, ముప్పై మూడేళ్ల వయసైనా ఆడుకోవడానికి ఒక బొమ్మ ఉండటం అనేది వ్యక్తి జీవితంలో అద్భుతమైన ఆనందాన్ని నింపుతుంది. పిల్లల స్నేహితుల మధ్య బొమ్మలు ఇచ్చి పుచ్చుకోవడం అనే అలవాటును పెంచితే వారికి ఒకరికొకరు సహాయపడటంలోని ఆనందాన్ని అర్థవంతంగా తెలియజేయవచ్చు. మీరు మీ పిల్లల చేత అనాథాశ్రమానికి బొమ్మలను విరాళంగా ఇప్పించవచ్చు. అక్కడి పిల్లల మోముల్లో చిరునవ్వులను పూయించవచ్చు.

తయారీలో సృజన

ఫ్యాబ్రిక్, స్టఫింగ్, దారాలు.. వేటితోనైనా సరే సొంతంగా బొమ్మను తయారుచేసుకుంటే ఆహ్లాదకరమైన అనుభూతిని పొందవచ్చు. ఇందుకోసం వాడకంలోని మెటీరియల్‌ను ఉపయోగించి, సొంతంగా సృజనాత్మకతను జోడించి బొమ్మలను తయారు చేసుకోవచ్చు. దీనిని పిల్లలతో కలిసి తయారుచేస్తే వారి మెదళ్లకు ప్రతిభను జోడించినవారవుతారు. అద్భుతమైన క్రాఫ్ట్ ఐడియాలు పెరగడానికి బొమ్మల తయారీ ఎంతగానో దోహదం చేస్తుంది.

సేకరణ ఓ మంచి హాబీ

బొమ్మల సేకరణను ఓ హాబీగా అలవాటు చేసుకోవచ్చు. ప్రాచీన, ప్రత్యేకమైన బొమ్మల సేకరణ పట్ల దృష్టి పెట్టవచ్చు. ఇందుకు ప్రాచీన వస్తువులు, బొమ్మలు లభించే షాప్‌లను సందర్శించవచ్చు. టూర్లకు వెళ్లినప్పుడు ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన కళాత్మక బొమ్మలను సేకరించవచ్చు.

బొమ్మలకోసం పార్టీ

ఎక్కడెక్కడ నుంచో సేకరించిన, సొంతంగా తయారు చేసుకున్న, అతిథుల నుంచి అందుకున్న బొమ్మలను ఇంట్లో ఓ చోట కొలువుదీర్చి పండగ చేయచ్చు. సాధారణంగా మన పండగల సమయాల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుంటాం. అయితే, అందుకు పండగలే అక్కర్లేదు. పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రత్యేక రోజుల్లో బొమ్మల అలంకరించి, అతిథులను ఆహ్వానించి తమ అభిరుచిని చూపించవచ్చు. అతిథులు కూడా తమకు ఇష్టమైన బొమ్మను తీసుకొచ్చి, మీకు కానుకగా ఇవ్వచ్చు.

తోలుబొమ్మల ప్రదర్శన

అభిరుచిని అంచెలంచెలుగా పెంచుకోవడానికి తోలుబొమ్మ (పప్పెట్రీ)ల ప్రదర్శన ఒక మంచి అవకాశంగా మార్చుకోవచ్చు. మీదైన ఓ సొంత కథను తయారు చేసుకోవచ్చు. లేదా పుస్తకాల్లోని కథల నుంచి ప్రేరణ పొందవచ్చు.

అందమైన డ్రెస్‌ల రూపకల్పన

రంగు రంగుల ఫ్యాబ్రిక్స్‌ను సేకరించి, బొమ్మలకు బట్టలు కుట్టడం మొదలుపెట్టవచ్చు. ముచ్చటైన డ్రెస్సులు, స్వెటర్లు, టోపీలు తయారుచేసి, అలంకరించవచ్చు. జుట్టు అల్లడం మొదలుకొని... ఆభరణాలను అలంకరించడం వరకు బొమ్మతో ఎంత సమయం గడిపినా ఎక్కడా బోర్ అనిపించదు. ఇష్టమైన, అరుదైన, విలువైన బొమ్మల కోసం ఆన్‌లైన్ పోర్టల్స్ శోధించి, ఆర్డర్ మీద తెప్పించుకోవచ్చు. బొమ్మలతో ఆడుకోవడానికి ఇష్టపడే పిల్లలకు మరో బొమ్మను బహుమతిగా ఇచ్చి వారిని ఆశ్చర్యానందనంలో ముంచెత్తవచ్చు.

– నిర్మలారెడ్డి

మనవైన బొమ్మలు



మన తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకమైన హ్యాండీక్రాఫ్ట్స్ నిర్మల్, బొంతపల్లి, చేర్యాల, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు ఉన్నాయి. ఈ ఉడెన్ టాయ్స్ సేకరణ ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. పిల్లలు మన హస్తకళల గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి. అలాగే, గృహాలంకరణలోనూ ప్రత్యేక ఆకర్షణను నింపుతాయి. పిల్లలకు, పెద్దలకు, అతిథులకు, వేడుకల సమయాల్లో ఈ బొమ్మలను కానుకగా ఇవ్వచ్చు. నేటి పిల్లలు అభిరుచికి తగినట్టు ఈ బొమ్మలు తయారీలో చాలా మార్పులు తీసుకువస్తున్నాం. చేర్యాల బొమ్మలు నేచరల్ ఫైబర్, నేచరల్ కలర్స్‌తో చేస్తారు. ఈ బొమ్మల తయారీకి వర్క్‌షాప్స్ కండక్ట్ చేస్తున్నాం. మనవైన బొమ్మల తయారీని భవిష్యత్తు తరాలకూ అందించేలా ప్రణాళికలు చేస్తున్నాం.



– మందడి శ్రీహరిరెడ్డి,
తెలంగాణ స్టేట్ టాయ్స్ ఇండస్ట్రీ నోడల్ ఆఫీసర్, నల్గొండ

వెడ్డింగ్ డాల్స్





నేను ఈ సంప్రదాయ బొమ్మల తయారీ మొదలుపెట్టినప్పుడు అందరూ ఏం గిట్టుబాటు అవుద్ది అన్నవారే. కానీ, టీచర్ ఉద్యోగం చేసే నేను కరోనా టైమ్‌లో స్టార్ట్ చేసిన థీమ్ బేస్డ్ బొమ్మల తయారీ నాకు మంచి గుర్తింపుతో పాటు ఆదాయవనరుగా మారింది. పండగలు, వివాహ వేడుకలను ప్రతిఫలించే బొమ్మలను తయారు చేస్తుంటాను. డాల్‌మేకింగ్ వర్క్‌షాప్స్‌తో బిజినెస్ అవకాశాలూ పెంచుకోవచ్చు. బార్బీ డాల్‌ను మన దేశీయ సంప్రదాయ పద్ధతిలో చూపించడం నేను చేస్తున్న ప్రత్యేకత. దీని వల్ల నాకు మంచి బిజినెస్ పెరుగుతుంది. వీటి నుంచి వివాహ వేడుకలకు సృజనాత్మకత వస్తువుల తయారీ కూడా చేస్తున్నాను.

– దివ్య, డాల్ మేకర్, హైదరాబాద్

కళ

నిరుపమాన నృత్య వైభవం



బెంగళూరుకు చెందిన నిరుపమ రాజేంద్ర నృత్యకౌశలం శాస్త్రీయ నృత్య ప్రేమికులకు మాత్రమే కాదు... నాట్యంలో ఓనమాలు కూడా తెలియని వారినీ ఆకట్టుకుంటుంది. రంగస్థలంపై ఆమె అభినయం, కదలికలు, ఆ ఉత్సాహం 'ఆహా' అనిపించేలా చేస్తాయి. ఎన్నో సంవత్సరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న అభినయ డ్యాన్స్ కంపెనీ వారి 'రామకథ విస్మయ' సరికొత్త మెరుపులతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నిరుపమ నృత్యవైభవం మరోసారి కనులవిందు చేయనుంది...

ఎన్నో దేశాల్లో ఎన్నో అద్భుతమైన షోలు చూసిన తరువాత భారతీయతతో కూడిన అద్భుత కళారూపం గురించి నిరుపమ రాజేంద్ర ఆలోచన చేసింది. ఆ ఆలోచనల్లో నుంచి పుట్టిందే... రామ కథ విస్మయ.

'రామాయణం' ఆధారంగా రూపొందించిన 'రామ కథ విస్మయ' సంగీత నృత్య రూపకం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ పొందింది. దీన్ని 2008లో తొలిసారిగా బెంగళూరులో ప్రదర్శించారు. ఆ తరువాత దేశంలోని ఎన్నో ప్రాంతాలలో ప్రదర్శించారు.

'రామాయణంలో ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. మనుషులు, రాక్షసులు, జంతువులు, మొక్కలు...అనేకం ఉంటాయి. అందుకే మేము ఎంచుకోవడానికి ఇది సరియైన కథ అనిపించింది. మా ఎంపిక సరియైనదేనని ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన నిరూపించింది' అంటుంది నిరుపమ.

తల్లి పిల్లలకు చెప్పే కథాసంవిధానాన్ని అనుసరిస్తూ ఆబాలగోపాలాన్నీ ఆకట్టుకునేలా ఈ నృత్యరూపకాన్ని తీర్చిదిద్దారు. తాజాగా ఈ షో రీవ్యాంప్‌తో ప్రేక్షకుల ముందుకువస్తోంది. ప్రొడక్షన్ కంపెనీలో 70 మంది ఆర్టిస్టులు, 25 మంది బ్యాక్‌స్టేజ్ వర్కర్స్ ఉన్నారు. బంగారు లేడి, రావణుడి తలల విషయంలో ప్రయోగాలు చేశారు. లైటింగ్, కాస్ట్యూమ్స్‌కు సంబంధించి రకరకాల కసరత్తులు చేశారు. మాస్కులు, పెయింటెడ్ ట్రిక్స్, ఎల్‌ఈడీ ప్రొజెక్షన్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారు.

మూడు సంవత్సరాల వయసులో నృత్యానికి దగ్గరైంది నిరుపమ. భరతనాట్యం తరవాత కథక్ నేర్చుకుంది. ఆహార్యంతో అద్దంలో చూసుకున్నప్పుడల్లా తనకు తాను ప్రత్యేకంగా కనిపించేది.

'మా కళారూపాలు భావోద్వేగాలతో కూడుకున్నవి. భాషతో పనిలేదు. అందుకే వాటికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలలో నుంచి ఎన్నో అనుభవాలను మూటగట్టుకున్నాం. చైనాలోని షాంఘైలో షో చేసినప్పుడు అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.

నృత్యం గురించి ఏమీ తెలియని వారు కూడా మనల్ని ప్రశంసించేదే అతి పెద్ద ప్రశంస. బెల్జియంలో ఓ స్పానిష్ తల్లి తన కూతురుతో కలిసి నా షోకు హాజరైంది. షో పూర్తయిన తరువాత మా దగ్గరకు వచ్చి కరచాలనం చేస్తూ ఆ తల్లీబిడ్డలు ఆనంద బాష్పాలు కురిపిస్తూ మా షో గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడారు. ఇది మరిచిపోలేని అనుభవం' అంటుంది నిరుపమ.

ప్రదర్శనలు ఇచ్చిన చోట 'వాక్ ది టాక్'లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దీని ద్వారా తమ షోకు సంబంధించి సలహాలు, సూచనలు ప్రేక్షకుల నుంచి కోరుతారు. వాటి ఆధారంగా కంటెంట్‌ను మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దుతారు. ఒక షోకు సంబంధించి స్వదేశం, విదేశాలలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన సాధించారు.

'స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచైనా రావచ్చు' అనేది నిరుపమ చెప్పే మాట.

నిజమే మరి, నిరుపమ నృత్యప్రదర్శనలు యువతరంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆమె బాటలో అందంగా అడుగు వేసేలా ప్రేరణ ఇస్తున్నాయి.




మీ కిచెన్ సింక్ ఎంత శుభ్రం?



తెల్లవారి లేచేసరికి ప్రతి ఒక్కరికీ కిచెన్ సింక్‌తో పని వస్తుంది. కాఫీ కప్పులు, టీ కప్పులు మొదలుకొని రకరకాల గిన్నెలు, గరిటలు, వంటపాత్రలు, స్పూన్లు... వంటివాటన్నింటినీ కిచెన్ సింక్‌లో పడేస్తుంటాం. వాటిని సరిగా శుభ్రం చేయక పోతే జిడ్డుపట్టి వాటిపై బ్యాక్టీరియా పేరుకు పోతుంది. దీనివల్ల సింకు దుర్వాసన వెదజల్లుతుంది. అయితే కొన్నిసార్లు సింక్‌లు రసాయన ఉత్పత్తులను ఉపయోగించి కడుగుతారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. దానిలో వాడే విషపూరిత రసాయనాలు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందువల్ల సింక్‌ను శుభ్రంగా ఉంచడానికి కొన్ని సహజ పరిష్కార మార్గాలు తెలుసుకుందాం.

సింక్‌లో పేరుకుపోయిన నూనె వంటి జిడ్డు పదార్థాలను తొలగించేందుకు వేడినీరు చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. కాబట్టి వీలయినప్పుడల్లా నాలుగైదు గ్లాసుల నీటిని వేడి చేసి సింక్‌లో పోస్తూ ఉండటం మంచిది. అంతకన్నా ముందు కాస్తంత బ్లీచింగ్ పౌడర్‌ను సింక్‌లో చల్లి, దానిమీద వేడినీటిని పోసి కాసేపు ఆగిన తర్వాత ఏదైనా క్లీనింగ్ బ్రష్‌తో క్లీన్ చేసేస్తే సరి.

సాధ్యమైనంత వరకు ఇల్లూ వళ్లూ పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. చాలా మంది ఇంటిలో ఖరీదైన ఫర్నీచర్‌తో నింపేస్తారు. కిచెన్‌ను కూడా వీలైనంత ఆధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే కిచెన్ సింక్‌ను మాత్రం అంతగా పట్టించుకోరు. దానివల్ల ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది.

వెనిగర్, నిమ్మకాయ



ఒకవేళ సింక్‌ను మరింత బాగా శుభ్రం చేయవలసి వస్తే వెనిగర్, నిమ్మరసం ఉపయోగించాలి. నిమ్మకాయ, వెనిగర్ దుర్గంధాన్ని తొలగించే సహజ ఆమ్లాన్ని కలిగి ఉంటాయి. నిమ్మరసం, వెనిగర్ మిశ్రమాన్ని సింక్‌లో పోసి ఓ అరగంటసేపు అలాగే వదిలేయండి. ఆ తర్వాత నీళ్ళతో శుభ్రం చేస్తే దుర్వాసన వదిలి సింక్ శుభ్రపడుతుంది.

వంట సోడా



ఒకోసారి సింక్ బ్లాక్ అవుతుంటుంది. అలాంటప్పుడు దాదాపు అరకప్పు వరకు బేకింగ్ సోడాను సింక్‌పై చల్లి కాసేపు అలాగే ఉంచి తర్వాత కడిగేస్తే సింక్ బ్లాక్ తొలగి శుభ్ర పడుతుంది. బేకింగ్ సోడాను వివిధ మార్గాల్లో శుభ్రపరచడానికి ఉపయోగించవచ్చు.

వేపాకు



వేపలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి కాబట్టి కొన్ని వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఈ నీటిని సింక్‌లో పోయాలి. తర్వాత, సబ్బు నీటిని ఉపయోగించి సింక్‌ను స్క్రబ్ చేస్తే, అది సింక్‌ను శుభ్రపరుస్తుంది.

సింక్ తోపాటు గిన్నెలను శుభ్రం చేయడానికి వాడే స్క్రబ్బర్‌ను కూడా క్లీన్‌గా ఉంచాలి. ఇందుకోసం గిన్నెలు శుభ్రం చేయడం అయిపోగానే స్క్రబ్బర్‌ను నీటిధార కింద కొన్ని సెకన్ల పాటు ఉంచాలి. తర్వాత దానిని పొడిగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే కంటికి కనిపించని బ్యాక్టీరియా చేరుతుంది.

జంక్ వద్దు



ఆధునిక జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది జంక్ ఫుడ్స్ విచ్చలవిడిగా తింటున్నారు. ఇలా తినడం చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ... ఎప్పుడు పడితే అప్పుడు జంక్ ఫుడ్ తీసుకోవడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జంక్ ఫుడ్ ఎక్కువగా లేదా తరచు తినడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలుగుతాయో తెలుసుకుందాం.

జంక్ ఫుడ్ లో చెడు కొలెస్ట్రాల్, ఉప్పు పరిమాణాలు అధికంగా ఉంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయి తీవ్ర వ్యాధుల బారిన పడతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి సమస్యల బారిన పడకుండా ఉండడానికి బయటి తిళ్లకు దూరంగా ఉండడం చాలా మంచిది.

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో కొవ్వు, నూనె, ఉప్పు ఉండవలసిన వాటికన్నా చాలా ఎక్కువ పాళ్లలో ఉండడంతో పాటు వాటిని నిల్వ ఉంచడానికి వాడే రసాయనాల వల్ల కూడా ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. చిప్స్, స్నాక్స్, బర్గర్‌లు, స్ప్రింగ్ రోల్స్, పిజ్జా వంటి 33 జంక్ ఫుడ్‌లు ఇందులో భాగమేనని, కాబట్టి ఇలాంటి ఆహారాలకు దూరంగా ఉండటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ తినడం వల్ల కూడా తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడతారని నిపుణులు చెబుతున్నారు. ఆహార పదార్థాలను నూనెలో అతిగా వేయించడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. రెగ్యులర్ గా జంక్ ఫుడ్ తినే వారిలో దంతాల సమస్యతోపాటు రక్తపోటు, మలబద్ధకం, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇలాంటి ఆహారాలు తీసుకోవడం కారణంగా ప్రతి సంవత్సరం 8 శాతం మంది తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని ఒక సర్వేలో తెలిసింది.

గుండె సమస్యలు

జంక్‌ఫుడ్ లో కార్బోహైడ్రేట్ల పరిమాణాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా ఇందులో పీచు పదార్థాలు తక్కువగా ఉండటం వల్ల అరుగుదల సామర్థ్యం లోపించి జీర్ణ సమస్యల బారిన పడతారు. దీని కారణంగా కొలెస్ట్రాల్ పరిమాణాలు పెరిగి రక్తంలో మార్పులు వచ్చి గుండెపోటు బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి జంక్ ఫుడ్ తినడం మానుకోవాలి. అంతేకాకుండా జీవనశైలిలో మార్పులు చేర్పులు చేసుకోవడమూ అవసరం.

ఆరోగ్యానికి అంజీర్

అధునిక జీవన శైలి కారణంగా అనారోగ్య సమస్యలు రాకుండా ప్రస్తుతం చాలామంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రతిరోజు డ్రై ఫ్రూట్స్ తో పాటు ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకుంటున్నారు. ప్రతిరోజు అంజీర్ పండ్లను పాలతో పాటు తీసుకుంటే చాలారకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే పోషక విలువలు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా శరీరాన్ని రక్షిస్తాయి. కాబట్టి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అంజీర్ పండ్లను తీసుకోవడం మంచిది.



అంజీర్ పండ్లలో ఫ్యాటీ యాసిడ్స్‌తోపాటు విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి.

డయాబెటిస్ ఉన్న వారు రోజూ ఈ పండ్లను తినడం వల్ల రక్తంలోని చక్కెర పరిమాణాలు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా ఇందులో ఉండే పోషకాలు ఇన్సులిన్‌పై కూడా ప్రభావం చూపుతాయి. ఈ డ్రై ఫ్రూట్స్‌లో క్యాల్షియం కూడా అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి ప్రతిరోజు పాలలో నానబెట్టిన అంజీర్‌ను తినడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి.

ఊబకాయాన్ని అదుపు చేస్తుంది

అంజీర్ పండ్లలో తక్కువ పరిమాణంలో కేలరీలు లభిస్తాయి. కాబట్టి ఉదయాన్నే అల్పాహారంలో భాగంగా పాలలో నానబెట్టిన అంజీర్‌ని తీసుకోవడం వల్ల అధిక బరువు సమస్యలు దూరమవుతాయి.

ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది

ప్రస్తుతం చాలామంది చిన్న పిల్లలు ఐరన్ లోపం సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారు ప్రతిరోజు అంజీర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో అధిక పరిమాణంలో ఐరన్ లభిస్తుంది. కాబట్టి వీటిని తినడం వల్ల సులభంగా ఐరన్ లోపం సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది

అంజీర్ లో విటమిన్లు, పొటాషియం, ఖనిజాలు, కాల్షియం సమృద్ధిగా లభిస్తాయి కాబట్టి వీటిని రోజు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా తీవ్ర అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి. అలాగని అంజీర్ అతిగా తీసుకోవడం కూడా మంచిది కాదు. దీనికి వేడి చేసే గుణం ఉండటం వల్ల ఇతర సమస్యలు వస్తాయి.

మీకు తెలుసా

- శరీరంలో వ్యర్థపదార్థాలు పేరుకుపోవడం వల్ల రక్త ప్రసరణలో తీవ్ర ఆటంకాలు కలుగుతాయి. మరికొంతమంది లో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, ముఖంపై మొటిమలు, చర్మం రంగు మారడం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ఇలాంటి సమస్యలతో బాధపడేవారు రోజు 8 నుంచి 9 గ్లాసుల నీటిని తాగడంతోపాటు తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు చెమట రూపంలో బయటికి వస్తాయి.



- ప్రతిరోజు నిమ్మకాయ షర్బత్ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారని.. శరీరంలో పేరుకుపోయిన మలినాలన్నీ బయటికి వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మ షర్బత్‌లో ఉండే విటమిన్ సి చర్మ సమస్యలను దూరం చేసేందుకు సహాయపడుతుంది. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్న వారు నిమ్మకాయ నీటిని తాగడం వల్ల సులభంగా ఉపశమనం లభిస్తుంది.



తరచు వికారం... ఎసిడిటీనా?
బీ12 లోపం కావచ్చు!

ఆధునిక జీవనశైలి కారణంగా చిన్న, పెద్ద తేడా లేకుండా చాలామందిలో విటమిన్ బి12 లోపం ఏర్పడే సమస్యలు వస్తున్నాయి. దీనిమూలంగా చాలామందిలో నాడీ మండల వ్యవస్థ దెబ్బతిని మానసిక అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. ఇంకొందరిలో కోపం, అలసట, అజీర్ణం వంటి సమస్యలు వస్తున్నాయి. విటమిన్ బి 12 లోపం కారణంగా వికారంతోపాటు విరేచనాలు, మలబద్ధకం, కడుపులో తిప్పడం, ఎసిడిటీ వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పెద్దవారితో పాటు పిల్లల్లో కూడా విటమిన్ బి12 లోపం ఉంటే రోజు మూడు పూటలా గోరువెచ్చని పాలను తాగాలి. ఇలా రోజూ పాలు తాగడం వల్ల విటమిన్ బి 12 లోపం నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనివల్ల శరీరంలో క్యాల్షియం పరిమాణాలు కూడా పెరుగు తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ప్రతిరోజు పాలు తాగడం, పొట్టు తీయని పల్లీలు తినడం ఆరోగ్యానికి మంచిది.

శరీరానికి విటమిన్ బి12 అధిక పరిమాణంలో లభించడానికి పాలతో తయారు చేసిన ఉత్పత్తులను వినియోగించాలి. ఆహారంలో కోడిగుడ్లతో పాటు పాలకూరని తీసుకోవడం కూడా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలసట, చురుకుదనం లోపించడం వంటి సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజు ఆహారంలో క్యారెట్‌ని వినియోగించడం మంచిది.


వరుణ్ తేజ్ లావణ్యా త్రిపాఠి

ప్రేమను కనుగొన్నాం

వరుణ్ తేజ్- లావణ్యా త్రిపాఠిల నిశ్చితార్థం శుక్రవారం రాత్రి ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌లోని నాగబాబు స్వగృహంలో జరిగింది. ''ప్రేమను కనుగొన్నాను'' అని వరుణ్ తేజ్, ''2016లోనే ఎప్పటికీ నాతో నిలిచిపోయే ప్రేమను కనుగొన్నాను'' అని లావణ్యా త్రిపాఠి తమ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. ఈ వేడుకలో చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అరవింద్, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ తదితరులతో పాటు మెగా, అల్లు కుటుంబాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. ఇంకా వివాహ తేదీ ఖరారు కాలేదు. అయితే ఇటలీలో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకుంటారని సమాచారం. 2016లో 'మిస్టర్' సినిమా షూటింగ్ సమయంలో వరుణ్-లావణ్య ప్రేమలో పడ్డారని ఊహించవచ్చు.

ఈ నెలలోనే మాయాపేటిక


పాయల్

విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'మాయాపేటిక'. రమేష్ రాపర్తి దర్శకత్వంలో మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. విడుదల తేదీని హీరోయిన్ కీర్తి సురేష్ ప్రకటించారు. రమేష్ రాపర్తి మాట్లాడుతూ – ''ఓ సెల్ ఫోన్ కథ ఆధారంగా రూపొందించిన చిత్రం ఇది'' అన్నారు. ''కొత్త కథతో 'థ్యాంక్ యూ బ్రదర్' చిత్రాన్ని నిర్మించాం. ఆ సినిమాకి లభించిన ఆదరణతో ఎంతో నమ్మకంతో మరో కొత్త కథాంశంతో 'మాయాపేటిక' చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్.

దెయ్యాలు పగబడితే...


రెజీనా

హీరోయిన్ రెజీనా ఓసారి లైబ్రరీకి వెళ్లారు. అక్కడ వందల ఏళ్ల క్రితం నాటి 'కాటుక బొట్టు' అనే బుక్ చదివారు. ఆ బుక్‌లోని పాత్రలు దెయ్యాలుగా మారి రెజీనా ముందుకు వచ్చాయట. ఆ తర్వాత ఏం జరిగింది? దెయ్యాలు ఎవరిపై, ఎందుకు పగబట్టాయి? అనేది తెలుసుకోవాలంటే 'కార్తీక' చిత్రం చూడాల్సిందే. కాజల్ అగర్వాల్, రెజీనా, జననీ అయ్యర్ ప్రధాన పాత్రల్లో, రైజా విల్సన్, నోయిరికా కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కరుంగాపియం'. ఈ మేలో తమిళంలో ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా తెలుగులో 'కార్తీక' టైటిల్‌తో రిలీజ్ కానుంది. ముత్యాల రామదాసు సమర్పణలో టి. జనార్ధన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ''తనకు హాని కలిగించిన వ్యక్తులపై దెయ్యంగా మారి పగ తీర్చుకునే పాత్రలో కాజల్ అగర్వాల్ కనిపిస్తారు. అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆగస్టులో పార్టీ


రాజు బొనగాని

క్రిష్ సిద్దిపల్లి, రితికా చక్రవర్తి, ఐశ్వర్యా గౌడ, సుచంద్ర ప్రసాద్, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవ్ పార్టీ'. రాజు బొనగాని స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా రాజు బొనగాని మాట్లాడుతూ– ''రేవ్ పార్టీల వల్ల యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆగస్టులో చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం'' అని అన్నారు. ఈ చిత్రానికి సహ-నిర్మాతలు: లక్ష్మీకాంత్ ఎన్ఆర్, జయరామ్ డీఆర్, జీఎస్ సీతారామరాజు, ఎస్. నారాయణస్వామి.

ప్రకృతికి విరుద్ధంగా వెళితే...



అప్సరా రాణి

అప్సరా రాణి ప్రధాన పాత్రలో, అశోక్ కుమార్, అజయ్ ఘోష్, 'ఉగ్రం' మంజు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వంలో స్వప్న శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ''హీరోయిన్, ఆమె స్నేహితులు కలిసి తలకోన ఫారెస్ట్‌కి వెళ్లినప్పుడు ఏం జరిగింది? అనేది కథాంశం. ప్రకృతికి విరుద్ధంగా వెళితే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అన్నారు నగేష్ నారదాసి.

కేరాఫ్ టెంపుల్

భక్తి రసాత్మక చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. అలాగే కొన్ని కమర్షియల్ చిత్రాల్లో దేవుడి ప్రస్తావన ఉంటుంది. ప్రస్తుతం భక్తి నేపథ్యంలో, దేవాలయాలు ప్రధానాంశంగా కొన్ని చిత్రాలు రానున్నాయి. 'కేరాఫ్ టెంపుల్' అంటూ రానున్న ఆ చిత్రాల్లో కొన్ని 'పాన్ ఇండియా' స్థాయిలో విడుదల కానున్నాయి. మరి.. దేవుడు అంటేనే యూనివర్సల్. అన్ని భాషల వారికీ నచ్చే కథాంశాలతో రానున్న ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.


ప్రభాస్


వైష్ణవ్ తేజ్

ఇటు రామాయణం.. అటు విష్ణుతత్వం

ప్రభాస్ అంటే రెబల్ స్టార్. మాస్ పాత్రల్లోనే దాదాపు చూశాం. అందుకు భిన్నంగా సౌమ్యుడిగా కనిపించనున్నారు ప్రభాస్. 'ఆదిపురుష్'లో రాముడిగా వెండితెరపై కరుణ కూడా కురిపించబోతున్నారు. ఈ పాత్రను ప్రభాస్ ఎగ్జయిటింగ్‌గా చేశారు. ప్రభాస్‌ని రాముడిగా చూడటానికి అభిమానులు, ప్రేక్షకులు అంతే ఎగ్జయిటింగ్‌గా ఉన్నారు. ఓమ్ రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సీతగా కృతీ సనన్ నటించారు. రామాయణ ఇతిహాసం నేపథ్యంలో గుల్షన్ కుమార్, టీ సిరీస్ సమర్పణలో భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఇక 'ఆదిపురుష్'తో ఓవైపు శ్రీరాముడి గాథని ప్రేక్షకులకు చెబుతున్న ప్రభాస్.. మరోవైపు విష్ణు తత్వాన్ని కూడా బోధించనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రాజెక్ట్ కె'. బిగ్ బి అమితాబ్ బచ్చన్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్నారు. తెలుగులో ఆమెకు ఇదే మొదటి చిత్రం. సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విష్ణు తత్వం, విష్ణు ఆధునిక అవతారం నేపథ్యంలో సాగుతుందని నిర్మాత అశ్వినీదత్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది.

గుడి కోసం రుద్రకాళేశ్వర్ రెడ్డి

రుద్రకాళేశ్వర్ రెడ్డి ఓ గుడి కోసం పెద్ద మైనింగ్ మాఫియాకి ఎదురు తిరుగుతాడు. ఒక సామాన్య కుర్రాడు మాఫియాని ఢీ కొనడం అంటే చిన్న విషయం కాదు. మరి గుడిని కాపాడటానికి రుద్ర కాళేశ్వర్ ఏం చేశాడు? అనేది 'ఆదికేశవ'లో చూడాలి. రుద్రకాళేశ్వర్ రెడ్డిగా వైష్ణవ్ తేజ్ నటిస్తున్నారు. మైనింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఊర్లో శివుడి గుడి చుట్టూ ఈ చిత్రకథ సాగుతుందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. 'ఇంత తవ్వేశారు.. ఆ గుడి జోలికి మాత్రం రాకండయ్యా.. శివుడికి కోపం వస్తే ఊరికి మంచిది కాదు' అంటూ ఆలయ పూజారి చెప్పే డైలాగ్‌ని బట్టి చూస్తే శివుడు, గుడి చుట్టూ ఈ కథ సాగుతుందని స్పష్టమవుతోంది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలైలో ప్రేక్షకుల ముందుకు రానుంది.


సందీప్ కిషన్

భైరవకోనలో ఏం జరిగింది?

సందీప్ కిషన్ నటించిన తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లు. సూపర్ నేచురల్ ఫ్యాంటసీ, సస్పెన్స్ థ్రిల్లర్, అడ్వెంచరస్ మూవీగా 'ఊరు పేరు భైరవకోన' రూపొందింది. భైరవకోనలోని ఓ గుడి నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుందని తెలుస్తోంది. 'శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో చెలామణిలో ఉన్న గరుడ పురాణానికి, ఇప్పటి గరుడ పురాణానికి నాలుగు పేజీలు తగ్గాయి', 'గరుడ పురాణంలో మాయమైపోయిన ఆ నాలుగు పేజీలే ఈ భైరవ కోన' అనే డైలాగ్స్‌తో ఇటీవల ఈ మూవీ టీజర్ విడుదలైంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.


తేజా సజ్జ

అంజనాద్రి కోసం..

'జాంబిరెడ్డి' వంటి హిట్ మూవీ తర్వాత హీరో తేజా సజ్జ- డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'హను-మాన్'. హనుమంతుని శక్తులను పొందిన హీరో హనుమంతుని జన్మస్థలంగా పేర్కొంటున్న అంజనాద్రి కోసం ఎలా పోరాటం చేశాడు? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'హను-మాన్'. ''ఇండియన్ రియల్ సూపర్ హీరో హనుమంతుడి స్ఫూర్తితో అంజనాద్రి అనే ఊహాత్మక ప్రపంచం నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అమృతా అయ్యర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్ర చేశారు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది.

ఇవే కాదు.. మరికొన్ని సినిమాలు కూడా పురాణాలు, దేవాలయాలు, ఇతిహాసాల కథలతో రూపొందుతున్నాయి.

సాక్షి బిజినెస్
శనివారం
10-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	223	62,626
నిఫ్టీ ▽	71	18,563

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,303	▲	65
డోజోన్స్	33,875	▲	41
ఎఫ్‌టీఎస్ఈ 100	7,562	▽	38
డాక్స్	15,950	▽	40
షాంఘై	3,231	▲	18
నికాయ్	32,265	▽	624


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
59,976	▲	389
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,736	▲	388
వెండి (కిలో)		
73,677	▲	1,678

అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు బలోపేతం

కీలక చర్యలను నోటిఫై చేసిన ఆర్‌బీఐ



న్యూఢిల్లీ: పట్టణ కోఆపరేటివ్ బ్యాంకుల బలోపేతానికి వీలుగా ఆర్‌బీఐ కీలక చర్యలను ప్రకటించింది. ప్రాధాన్య రంగాలకు నిర్దేశిత శాతం రుణ వితరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు మరో రెండేళ్ల గడువు ఇచ్చింది. ఆర్‌బీఐ ప్రకటించిన చర్యలు 1,514 పట్టణ కోపరేటివ్ బ్యాంకుల బలోపేతానికి సాయపడతాయని కేంద్ర సహకార శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. కేంద్ర సహకార, హోం శాఖల మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ విస్తృత చర్చ అనంతరం పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులకు సంబంధించి ఈ చర్యలు తీసుకున్నట్టు వివరించింది. పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు ఆర్థికంగా బలమైన, మెరుగైన నిర్వహణకు వీలుగా బోర్డు ఆమోదం పొందిన విధానం అమల్లో పెట్టడం ఈ చర్యల్లో ఒకటిగా ఉంది. వాణిజ్య బ్యాంకుల మాదిరే సాంకేతికంగా రుణాలను పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు సైతం మాఫీ చేయవచ్చు. రుణగ్రహీతలతో పరిష్కారం చేసుకోవచ్చు. ప్రాధాన్య రంగాలకు రుణాలను మంజూరు చేసే విషయంలో 60 శాతం లక్ష్యాన్ని 2023 మార్చి 31 వరకు చేరుకోవాల్సి ఉండగా, మరో ఏడాది గడువు ఇచ్చింది. వాణిజ్య బ్యాంకులకు గ్రామీణ ప్రాంతాల్లోనూ శాఖలు ఉంటాయి. కనుక అవి ప్రాధాన్య రంగాల రుణ వితరణ లక్ష్యాలను అమలు చేయడం సులభంగా ఉంటుంది. కానీ, పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు పట్టణాల్లోనే కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ఆర్‌బీఐ ఈ మేరకు వెసులుబాటు కల్పించింది. పరిశ్రమ ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్ మేరకు.. సమన్వయం కోసం నోడల్ ఆఫీసర్లను కూడా ఆర్‌బీఐ ఇటీవలే నోటిఫై చేసింది.

అధిక మైలేజీతో మారుతీ 'టూర్ హెచ్1'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా టూర్ హెచ్1 పేరుతో సరికొత్త కారును ప్రవేశపెట్టింది. భారత్‌లో అధిక మైలేజీ ఇచ్చే ప్రారంభ స్థాయి కమర్షియల్ హ్యాచ్‌బ్యాక్ ఇదేనని కంపెనీ ప్రకటించింది. మైలేజీ పెట్రోల్ వెర్షన్ లీటరుకు 24.60 కిలోమీటర్లు, సీఎన్‌జీ వేరియంట్ కిలోకు 34.46 కిలోమీటర్లు ఇస్తుందని వెల్లడించింది. ధర రూ.4.8 లక్షల నుంచి ప్రారంభం. సీఎన్‌జీ వేరియంట్ ధర రూ.5.7 లక్షలు. ఆల్టో కే10 ఆధారంగా టూర్ హెచ్1 రూపొందింది. కె-సిరీస్ 1.0 లీటర్ డ్యూయల్ జెట్ ఇంజిన్ పొందుపరిచారు. రెండు ఎయిర్‌బ్యాగ్స్, ప్రిటెన్షనర్, ఫోర్స్ లిమిటర్‌తో ముందు సీట్ బెల్ట్‌లు, సీట్ బెల్ట్ రిమైండర్, ఇంజిన్ ఇమ్మొబిలైజర్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డి‌స్ట్రిబ్యూషన్‌తో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, స్పీడ్ లిమిటింగ్ సిస్టమ్, రివర్స్ పార్కింగ్ సెన్సార్ వంటి హంగులు జోడించారు.

ఐసీఏఆర్‌తో అమెజాన్ ఒప్పందం

రైతులకు తోడ్పాటు అందించడంపై దృష్టి



న్యూఢిల్లీ: కిసాన్ స్టోర్‌లో నమోదు చేసుకున్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడంలోనూ, అధిక దిగుబడులు.. ఆదాయం పొందడంలో తోడ్పాటు అందించడంపై ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పరిశోధన సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. పుణేలోని ఐసీఏఆర్-కృషి విజ్ఞాన్ కేంద్రంలో సంయుక్తంగా నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఊతంతో తమ భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించినట్లు అమెజాన్ తెలిపింది. ఐసీఏఆర్ డిప్యూటీ జనరల్ యూఎస్ గౌతమ్, అమెజాన్ ఫ్రెష్ సప్లై చెయిన్..కిసాన్ విభాగం ప్రొడక్ట్ లీడర్ సిద్ధార్థ్ టాటా ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద ఐసీఏఆర్ అభివృద్ధి చేసే అధునాతన వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరువ చేసేందుకు ఇరు సంస్థలు కృషి చేస్తాయి. అలాగే, రైతులు తమ ఆదాయాలను పెంచుకునేందుకు ఉపయోగపడే మెరుగైన సాగు విధానాలను కిసాన్ వికాస్ కేంద్రాల్లో (కేవీకే) ప్రదర్శిస్తాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు కావాల్సిన శిక్షణ, సహాయాన్ని అమెజాన్ అందిస్తుంది. తద్వారా రైతులను నేరుగా వినియోగదారులతో అనుసంధానిస్తుంది. 2021 సెప్టెంబర్‌లో అమెజాన్ తమ ప్లాట్‌ఫామ్‌లో 'కిసాన్ స్టోర్' సెక్షన్‌ను ప్రారంభించింది. ఇందులో షాపింగ్ ద్వారా వ్యవసాయానికి అవసరమైన ముడి వనరులను రైతులు ఇంటి దగ్గరే అందుకోవచ్చు.

షావోమీకి ఈడీ షోకాజ్ నోటీసులు

రూ. 5,551 కోట్ల ఫెమా ఉల్లంఘన

న్యూఢిల్లీ: విదేశీ మారక నిర్వహణ చట్ట (ఫెమా) నిబంధనల ఉల్లంఘనకు గాను చైనా మొబైల్ తయారీ దిగ్గజం షావోమీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాయల్టీ ముసుగులో అనధికారికంగా రూ. 5,551.27 కోట్ల విలువ చేసే మొత్తాన్ని విదేశాలకు బదలాయించడానికి సంబంధించి ఈడీ ఈ మేరకు చర్యలు తీసుకుంది. సదరు మొత్తాన్ని జప్తు చేస్తూ.. షావోమీ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ రావు, మాజీ ఎండీ మను జైన్‌తో పాటు సిటీ బ్యాంక్, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్, డాయిష్ బ్యాంక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.



ఎస్‌బీఐ నిధుల సమీకరణ బాట

రుణ సెక్యూరిటీల జారీతో రూ. 50,000 కోట్లు!



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) రుణ సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 50,000 కోట్లు సమీకరించే సన్నాహాల్లో ఉంది. ఇందుకు బ్యాంకు కేంద్ర బోర్డు నిర్ణయించినట్లు ఎస్‌బీఐ తాజాగా పేర్కొంది. రూపాయి లేదా మా ర్పిడికి వీలయ్యే ఏ ఇతర కరెన్సీలో రుణ సెక్యూరిటీలను జారీ చేసేందుకు అనుమతించినట్లు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023-24)లో దేశీ లేదా విదేశీ ఇన్వెస్టర్లకు బాండ్ల ప్రైవేట్ ప్లేస్‌మెంట్ చేపట్టనున్నట్లు వివరించింది. కాగా.. గతేడాది(2022-23) చివరి త్రైమాసికంలో ఎస్‌బీఐ కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 90 శాతం జంప్‌చేసి రూ. 18,094 కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి 58 శాతం అధికంగా రూ. 50,232 కోట్ల నికర లాభం ఆర్జించింది. వెరసి త్రైమాసిక, వార్షిక లాభాల సాధనలో సరికొత్త రికార్డులకు తెర తీయడం ప్రస్తావనార్హం!

బాండ్ల జారీ వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 1.7% క్షీణించి రూ. 579 వద్ద ముగిసింది.

భారత్ వైపు.. దిగ్గజాల చూపు

- ఈ ఏడాది 24 బ్రాండ్స్ ఎంట్రీ
- దశాబ్దకాలంలో గరిష్టం



న్యూఢిల్లీ: కోవిడ్ అనంతరం లగ్జరీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ దిగ్గజాలు భారత్ వైపు దృష్టి సారిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు రెండు డజన్ల సంస్థలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. దశాబ్దకాలంలో ఇది గరిష్ట స్థాయి కాగలదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2020లో ఒక అంతర్జాతీయ బ్రాండ్ రాగా, 2021లో మూడు, 2022లో 11 సంస్థలు వచ్చాయి. కోవిడ్ మహమ్మారికి ముందు ఏటా దాదాపు 12-15 బ్రాండ్స్ భారత్‌కు వచ్చేవి. కోవిడ్ తర్వాత లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌తో గత కొద్ది నెలల్లో వాలెంటినో, మెక్‌లారెన్, బాలెన్షియాగా తదితర బ్రాండ్స్ వచ్చాయి. తాజాగా గ్లోబల్ బ్రాండ్స్‌ను తీసుకురావడంలో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ (ఏబీఎఫ్‌ఆర్‌ఎల్), రిలయన్స్ రిటైల్ తదితర సంస్థలు కీలకంగా ఉంటున్నాయి. దేశీయంగా లగ్జరీ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను, ప్రత్యేకంగా ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంను ప్రారంభించే దిశగా ఫ్రెంచ్ దిగ్గజం గ్యాలెరీస్ లాఫేట్‌తో ఏబీఎఫ్‌ఆర్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. అటు చైనీస్ దిగ్గజం షీన్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు రిలయన్స్ రిటైల్ ఒప్పందం కుదుర్చుకుంది.

ఫుడ్.. ఎంటర్‌టైన్‌మెంట్ బ్రాండ్స్ ఆసక్తి..

ఈ ఏడాది దేశీ మార్కెట్లోకి ఎక్కువగా ఫుడ్.. బేవరేజెస్, కొన్ని వినోద రంగ బ్రాండ్స్ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ రాబర్టో కావలీ, బ్రిటిష్ లగ్జరీ గూడ్స్ బ్రాండ్ డన్‌హిల్, అమెరికాకు చెందిన స్పోర్ట్స్‌వేర్..ఫుట్‌వేర్ రిటైలర్ ఫుట్ లాకర్ మొదలైనవి కూడా భారత మార్కెట్లో కాలుపెట్టే ప్రయత్నాల్లో ఉన్నాయి. వీటికి తోడు ఇటలీకి చెందిన లవాజా..అర్మానీ కెఫె, అమెరికన్ సంస్థ జాంబా, ఆస్ట్రేలియన్ బ్రాండ్ ది కాఫీ క్లబ్ కూడా ఈ ఏడాది ఎంట్రీ ఇచ్చేందుకు చర్చలు జరుపుతున్నాయి. రిటైల్ కార్యకలాపాలకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే 5వ అతి పెద్ద మార్కెట్‌గా ఉంది. పలు బ్రాండ్‌ల రాకతో రిటైల్ స్థలం లీజింగ్ 5.5 - 6 మిలియన్ చ.అ.ల మేర ఉండొచ్చని ప్రాపర్టీ కన్సల్టెన్సీలు అంచనా వేస్తున్నాయి. 2019లో నమోదైన 6.8 మిలియన్ చ.అ. గరిష్ట స్థాయి తర్వాత ఇదే అత్యధికం.

వారాంతాన నష్టాల ముగింపు

- సెన్సెక్స్ నష్టం 223 పాయింట్లు
- 18,600 దిగువకు నిఫ్టీ



ముంబై: రోజంతా లాభనష్టాల మధ్య ట్రేడైన స్టాక్ సూచీలు శుక్రవారం చివరికి నష్టాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(1%)తో ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, టెక్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉదయం సెన్సెక్స్ 34 పాయింట్ల లాభంతో 62,811 వద్ద, నిఫ్టీ 21 పాయింట్లు పెరిగి 18,656 వద్ద మొదలయ్యాయి. తొలి దశలో సానుకూలంగా ట్రేడైన సూచీలు.., యూరప్ మార్కెట్ల బలహీన ప్రారంభంతో మిడ్ సెషన్ నుంచి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 254 పాయింట్లు నష్టపోయి 62,594 వద్ద, నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 18,555 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. వారాంతపు రోజు కావడంతో పాటు వచ్చే వారంలో కీలక పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపలేదు. దీంతో ద్వితీయార్థం ఆద్యంతం తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చివరికి సెన్సెక్స్ 223 పాయింట్లు పతనమై 62,626 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 71 పాయింట్లు క్షీణించి 18,563 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ఇండస్ట్రియల్, టెలీకమ్యూనికేషన్, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు(సీపీపీఐబీ) షేరుకు రూ.1,855 వద్ద 3.30 కోట్ల ఈక్విటీ షేర్ల (1.66 % వాటా)ను ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించింది. డీల్ విలువ రూ.6,123 కోట్లు. షేరు ధర 1% తగ్గి రూ.1,872 వద్ద క్లోజైంది.
- బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు షేరు టార్గెట్ ధరను పెంచడం జొమాటో షేరురెండుశాతానికి పైగా లాభపడి రూ.77.57 వద్ద స్థిరపడింది.
- తమిళనాడులో ప్లాంట్‌ను ప్రారంభించడంతో గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ షేరు 20% లాభపడి రూ.476 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

సాక్షి స్పోర్ట్స్

స్వియాటెక్ X ముకోవా

- నేడు ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్
- సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) రూపంలో కొత్త చాంపియన్ అవతరిస్తుందో... లేక డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్) టైటిల్ నిలబెట్టుకుంటుందో నేడు తేలిపోతుంది. ప్రపంచ 43వ ర్యాంకర్ ముకోవా కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతుండగా ... ఇప్పటికే రెండుసార్లు (2020, 2022) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచిన స్వియాటెక్ మూడో టైటిల్‌పై గురి పెట్టింది. నాలుగేళ్ల క్రితం ప్రాగ్ ఓపెన్‌లో వీరిద్దరు తలపడగా... మూడు సెట్‌లలో స్వియాటెక్‌పై ముకోవా గెలిచింది.





ఎదురులేని జొకోవిచ్

- ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్‌పై గెలుపు
- కెరీర్‌లో 34వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు
- ఆదివారం ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం



పారిస్: 'ఫైనల్'గా పరిగణించిన సెమీఫైనల్లో సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ పైచేయి సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో శుక్రవారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ గెలుపొందాడు. 3 గంటల 23 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో జొకోవిచ్ 6-3, 5-7, 6-1, 6-1తో అల్‌కరాజ్‌ను ఓడించి ఏడోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఓవరాల్‌గా జొకోవిచ్ కెరీర్‌లో 34వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తుది పోరుకు అర్హత సాధించాడు. 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌తో ప్రస్తుతం జొకోవిచ్, రాఫెల్ నాదల్ (స్పెయిన్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కాస్పర్ రూడ్ (నార్వే) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో జొకోవిచ్ తలపడతాడు. జొకోవిచ్ చాంపియన్‌గా నిలిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పుతాడు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న అల్‌కరాజ్‌ను వెనక్కి నెట్టి జొకోవిచ్ మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంటాడు.


అల్‌కరాజ్

నిలకడగా ఆడి...

గతంలో అల్‌కరాజ్‌తో ఒకసారి ఆడి ఓడిపోయిన జొకోవిచ్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మాత్రం ఈ స్పెయిన్ ప్లేయర్‌తో తొలిసారి తలపడ్డాడు. గత ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన 20 ఏళ్ల అల్‌కరాజ్ కెరీర్‌లో 9వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతుండగా... మరోవైపు జొకోవిచ్‌కు 69 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన అనుభవం ఉంది. అనుభవానికి తగ్గట్టే కీలకమైన సెమీఫైనల్లో పోరులో జొకోవిచ్ అద్భుతంగా ఆడాడు. సర్వీస్‌లలో కచ్చితత్వం... తిరుగులేని ఫోర్‌హ్యాండ్ షాట్‌లు.. ఎక్కువ అనవసర తప్పిదాలకు తావివ్వకుండా ఆడిన జొకోవిచ్ మ్యాచ్‌ను శాసించాడు. తొలి సెట్‌లో నాలుగో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌ను 59 నిమిషాల్లో సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో అల్‌కరాజ్ తేరుకున్నాడు. ఎనిమిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే ఆ వెంటనే తొమ్మిదో గేమ్‌లో అల్‌కరాజ్ తన సర్వీస్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు. కానీ 12వ గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ 77 నిమిషాల్లో సెట్‌ను నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో జొకోవిచ్ ఒక్కసారిగా చెలరేగిపోయాడు. మూడుసార్లు అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 36 నిమిషాల్లో సెట్‌ను నెగ్గాడు. నాలుగో సెట్‌లోనూ జొకోవిచ్ జోరు కొనసాగించి రెండుసార్లు అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 31 నిమిషాల్లో సెట్‌ను గెల్చుకోవడంతోపాటు విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో జొకోవిచ్ ఎనిమిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఏడుసార్లు అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. 39 విన్నర్స్ కొట్టి 36 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్ద 25 పాయింట్లు నెగ్గిన జొకోవిచ్ 25 డ్రాప్ షాట్‌లతో పాయింట్లు గెలిచాడు. మరోవైపు అల్‌కరాజ్ 35 విన్నర్స్ కొట్టి 50 అనవసర తప్పిదాలు చేశాడు.

అంతరం తగ్గించినా... ఆసీస్‌దే పైచేయి!

మూడో రోజు ఆటలో మన బ్యాటింగ్ కుప్పకూలిపోలేదు. ఎదురుదాడికి దిగిన రహానే, శార్దుల్ భాగస్వామ్యం జట్టును కాస్త మెరుగైన స్థితికి చేర్చింది. ఆపై మన బౌలర్లు పట్టుదలగా ఆడి ఆసీస్‌ను నిలువరించగలిగారు. అయినా సరే పూర్తిగా మనదే రోజని చెప్పలేం! తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన కంగారూలు దానిని కొనసాగిస్తూ ఓవరాల్ ఆధిక్యాన్ని దాదాపు మూడొందలకు చేర్చారు. మిగిలిన 6 వికెట్లతో ఆ జట్టు శనివారం ఎన్ని పరుగులు చేసి లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనేది ఆసక్తికరం. పిచ్ నెమ్మదిస్తుండటంతో ప్రస్తుతానికి ఇంకా మ్యాచ్ ఆస్ట్రేలియాతో చేతిలోనే ఉన్నట్లు!

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 123/4
- ప్రస్తుత ఆధిక్యం 296 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 296 ఆలౌట్
- రాణించిన రహానే, శార్దుల్


రహానే

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ కీలకదశకు చేరింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. లబుషేన్ (118 బంతుల్లో 41 బ్యాటింగ్; 4 ఫోర్లు), గ్రీన్ (7 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉండగా... స్టీవ్ స్మిత్ (47 బంతుల్లో 34; 3 ఫోర్లు) రాణించాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 151/5తో తొలి ఇన్నింగ్స్ ఆట కొనసాగించిన భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. అజింక్య రహానే (129 బంతుల్లో 89; 11 ఫోర్లు, 1 సిక్స్), శార్దుల్ ఠాకూర్ (109 బంతుల్లో 51; 6 ఫోర్లు) ఏడో వికెట్‌కు 109 పరుగులు జత చేసి జట్టును ఆదుకున్నారు.

శతక భాగస్వామ్యం...

మూడో రోజు రెండో బంతికే భరత్ (5)ను బోలండ్ బౌల్డ్ చేయడంతో ఆసీస్‌కు శుభారంభం లభించింది. పరిస్థితి చూస్తే భారత్ 200 పరుగులైనా చేయగలుగుతుందా అనిపించింది. అయితే రహానే, శార్దుల్ శతక భాగస్వామ్యం జట్టును గట్టెక్కించింది. ఇద్దరూ ఎక్కడా తగ్గకుండా ధాటిగా ఆడటంతో పరుగులు వేగంగా వచ్చాయి. కమిన్స్ బౌలింగ్‌లో వరుసగా 4, 6 కొట్టి రహానే 92 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి సెషన్‌లో ఆసీస్ పేలవ బౌలింగ్‌తో భారత బ్యాటర్ల ఆధిక్యం కొనసాగింది. 22 ఓవర్లలోనే ఏకంగా 4.95 రన్‌రేట్‌తో జట్టు 109 పరుగులు సాధించడం విశేషం. అయితే లంచ్ తర్వాత ఆట ఆసీస్‌వైపు మొగ్గింది. గ్రీన్ అద్భుత క్యాచ్‌కు రహానే వెనుదిరగ్గా, ఉమేశ్ (5) అనుసరించాడు. 108 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన శార్దుల్‌ను ఎట్టకేలకు కమిన్స్ అవుట్ చేయగా, షమీ (13) వికెట్ తీసి స్టార్క్ భారత ఇన్నింగ్స్ ముగించాడు. లంచ్ తర్వాత 9.4 ఓవర్లలోనే ఆసీస్ మిగిలిన 4 వికెట్లు పడగొట్టగలిగింది.

ఆకట్టుకున్న జడేజా...

చేతిలో భారీ ఆధిక్యం ఉన్నా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బంతులతో ప్రత్యర్థిని నిలువరించారు. వార్నర్ (1), ఖ్వాజా (13) ఆరంభంలోనే వెనుదిరగ్గా... లబుషేన్, స్మిత్ పరిస్థితిని చక్కదిద్దారు. లబుషేన్ ఎక్కువ భాగం డిఫెన్స్‌కే కట్టుబడగా, స్మిత్ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే ధాటిగా ఆడే క్రమంలో స్మిత్ ఆడిన చెత్త షాట్ ఒక్కసారిగా పరిస్థితిని మార్చేసింది. జడేజా బౌలింగ్‌లో అనూహ్యంగా గాల్లోకి బంతి లేపి స్మిత్ క్యాచ్ ఇవ్వగా, హెడ్ (18) కూడా విఫలమయ్యాడు. బౌండరీ వద్ద ఉమేశ్ క్యాచ్ వదిలేసినా... తర్వాతి బంతికే జడేజాకు అతను రిటర్న్ క్యాచ్ అందించాడు. అయితే లబుషేన్, గ్రీన్ మరో 7.3 ఓవర్లు జాగ్రత్తగా ఆడారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469; భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) కమిన్స్ 15; గిల్ (బి) బోలండ్ 13; పుజారా (బి) గ్రీన్ 14; కోహ్లి (సి) స్మిత్ (బి) స్టార్క్ 14; రహానే (సి) గ్రీన్ (బి) కమిన్స్ 89; జడేజా (సి) స్మిత్ (బి) లయన్ 48; భరత్ (బి) బోలండ్ 5; శార్దుల్ (సి) క్యారీ (బి) గ్రీన్ 51; ఉమేశ్ (బి) కమిన్స్ 5; షమీ (సి) క్యారీ (బి) స్టార్క్ 13; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 296. వికెట్ల పతనం** : 1-30, 2-30, 3-50, 4-71, 5-142, 6-152, 7-261, 8-271, 9-294, 10-296. **బౌలింగ్:** స్టార్క్ 13.4-0-71-2, కమిన్స్ 20-2-83-3, బోలండ్ 20-6-59-2, గ్రీన్ 12-1-44-2, లయన్ 4-0-19-1. **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** ఖ్వాజా (సి) భరత్ (బి) ఉమేశ్ 13; వార్నర్ (సి) భరత్ (బి) సిరాజ్ 1; లబుషేన్ (బ్యాటింగ్) 41; స్మిత్ (సి) శార్దుల్ (బి) జడేజా 34; హెడ్ (సి అండ్ బి) జడేజా 18; గ్రీన్ (బ్యాటింగ్) 7; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (44 ఓవర్లలో 4 వికెట్లకు) 123. వికెట్ల పతనం:** 1-2, 2-24, 3-86, 4-111. **బౌలింగ్:** షమీ 10-4-17-0, సిరాజ్ 12-2-41-1, శార్దుల్ 6-1-13-0, ఉమేశ్ 7-1-21-1, జడేజా 9-3-25-2.



శార్దుల్ సూపర్...

రెండేళ్ల క్రితం ఓవల్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లోనూ అర్ధసెంచరీ చేసిన శార్దుల్ ఈసారీ అదే ప్రదర్శన కనబర్చాడు. ఇన్నింగ్స్ ఆసాంతం అనేక సార్లు బంతి అతని శరీరాన్ని బలంగా తాకినా పట్టుదలగా నిలబడి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కొంత అదృష్టం కూడా అతనికి కలిసొచ్చింది. 'సున్నా' వద్ద అతను ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను ఖ్వాజా వదిలేయగా, 8 పరుగుల వద్ద సునాయాస క్యాచ్‌ను గ్రీన్ నేలపాలు చేశాడు. 36 పరుగుల వద్ద కమిన్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ అయినా అది నోబాల్ కావడంతో బతికిపోయాడు. రహానే 72 పరుగుల వద్ద ఉన్నప్పుడు క్యారీ, వార్నర్ సమన్వయ లోపంతో క్యాచ్ వదిలేశారు. ఈ ఇన్నింగ్స్‌లో రహానే టెస్టుల్లో 5 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. మరోవైపు భారత్ ఇన్నింగ్స్ చివర్లో సిరాజ్ ఎల్బీ కోసం గ్రీన్ అప్పీల్ చేయగా అంపైర్ అవుటిచ్చాడు. సిరాజ్ వెంటనే రివ్యూ కోరినా... అదేమీ పట్టించుకోకుండా ఆసీస్ ఆటగాళ్లంతా ఆలౌట్ అనుకొని మైదానం వీడారు. వార్నర్, ఖాజా ప్యాడ్లు కట్టుకునేందుకు సన్నద్ధమయ్యారు. అయితే రీప్లేలో బంతి బ్యాట్‌కు తగిలినట్లు తేలింది. దాంతో వారంతా వెనక్కి వచ్చారు.

భారత్ శుభారంభం

భువనేశ్వర్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. మంగోలియాతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత జట్టుకు అబ్దుల్ సమద్ (2వ ని.లో), లాలియన్‌జువాలా చాంగ్తె (14వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. సోమవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో వనాతు జట్టుతో భారత్ ఆడుతుంది.

మొబైల్‌లో 'ప్రపంచకప్' ఉచితం!

డిస్నీ-హాట్‌స్టార్ కొత్త ఆఫర్

న్యూఢిల్లీ: క్రీడా ప్రసారాల్లో అగ్రగామిగా వెలుగొందుతున్న 'డిస్నీ-స్టార్' గ్రూప్‌నకు ఇటీవల ఐపీఎల్ క్రికెట్ టోర్నీతో భారీ షాక్ తగిలింది. ఐపీఎల్ మొబైల్ ప్రసారాల హక్కులు దక్కించుకున్న 'జియో' సంస్థ ఉచితంగా మ్యాచ్‌లు చూసే అవకాశం కల్పించింది. దాంతో పెద్ద సంఖ్యలో జియో సబ్‌స్క్రైబర్లు పెరిగిపోగా, 'హాట్‌స్టార్'కు ఫ్యాన్స్ దూరమయ్యారు. దాంతో మళ్లీ అభిమానులకు చేరువయ్యేందుకు వాల్ట్ డిస్నీ సంస్థ కొత్త ఆలోచనతో ముందుకు వస్తోంది. ఈ ఏడాది జరిగే ఆసియా కప్, వన్డే ప్రపంచకప్‌లను మొబైల్ ఫోన్‌ల లో ఉచితంగా స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించింది. కేవలం యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు... రుసుము చెల్లించకుండా ప్రపంచ కప్ మ్యాచ్‌లను వీక్షించవచ్చు.

రన్నరప్ స్నేహిత్



సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్ ఎస్‌ఎఫ్‌ఆర్ స్నేహిత్ రన్నరప్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో స్నేహిత్ 11-5, 11-13, 11-8, 11-8, 3-11, 4-11, 10-12తో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ) చేతిలో ఓడిపోయాడు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.